UNIVERSAL LIBRARY
OU_204407
UNIVERSAL LIBRARY

Call No. Accession No.

Author

Title

This book should be returned on or before last marked below.

శ్రీ

విప్రనారాయణ చరిత్రము

ఆఱంకముల నాటకము.

ఇది

పాదుకాపట్టాభిషేకము, రాధాకృష్ణ, కోకిల
మొదలగు నాటకములు రచించిన

పానుగంటి లక్ష్మీనరసింహారావుగారిచే

రచియింపఁబడినది.

మూడవకూర్పు 1000 ప్రతులు

పబ్లిషర్సు :

వెలుకూరి సుబ్బారావు అండ్ సన్సు

ప్రొప్రయిటర్సు :

సరస్వతీ బుక్ డిపో, బెజవాడ : బ్రాంచి, రాజమండ్రి.

శ్రీ శారదా ముద్రణశాల - బెజవాడ

1941

[వెల రు. 1—0—0

కాపీరైటు రిజిష్టరు]

హెచ్చరిక

ఈ శ్రీ విప్రనారాయణ చరిత్ర నాటకముయొక్క సర్వ హక్కులు గ్రంథకర్తగారివద్ద మేము కాపీరైటు పొంది యున్నాము. ఈ నాటకమునందలి పదములుగాని, భావములు గాని ఏమాత్రము కాపీచేయకూడదు. ఇందలి పాటలు, పద్యములు, వచనములలో గ్రామఫోను రికార్డు యీయవలయు నన్నను, టాకీస్క్రీనింగు చేయవలయు నన్నను, స్టేజీమీద ప్రదర్శించ వలయునన్నను మా లిఖితపూర్వకమైన పర్మిషన్ పొందితీరవలయును. ఇందులకు అతిక్రమించిన వారలు మా నష్టములకు బాధ్యులగుటయేగాక మేము తెచ్చు సివిల్ క్రిమినల్ చర్యలకు బద్ధులగుదురని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

ఇట్లు కాపీరైటు హక్కుదారులు

కురుకూరి సుబ్బారావు అండ్ సన్

ప్రొప్రయిటర్సు: సరస్వతీ బుక్ డిపో

హెడ్డాఫీసు: బెజవాడ　　బ్రాంచి: రాజమండ్రి

పీఠిక

ఈ నాటకము విష్ణుభక్తులలో నొకఁడగు విప్రనారాయణుని చరిత్రమై యున్నది. ఈ చరిత్రము ప్రబంధరూపమున వైజయంతీ విలాస మను పేర నాంధ్రభాషలో నున్నది. ఈ కథలోని కడపటిభాగము గొంత నేను కాలానుగుణముగ మార్చితిని. ఈ నాటకము ఆన సం॥ 1908 డిసెంబరు 6 వ తేదీని ప్రారంభించి సం॥ 1909 జనవరి 12 వ తేదీకి ముగించితిని. దీనినిగూడ మ॥ రా॥ రా॥ శ్రీ శ్రీ పీఠికాపురసంస్థాన ప్రభువువారే యచ్చు వేయించిరి. విద్యాభిమానులును, లోకోపకారప్రియులు నగు శ్రీ శ్రీ రాజా రావు వేంకట కుమారమహీపతి సూర్యరాయ ప్రభువులవారికి సర్వేశ్వరుఁడు సకల శ్రేయోభివృద్ధుల నొసఁగి రక్షించుఁగాక !

దీనికి నాందీప్రస్తావనలను నా మిత్రులగు బ్ర॥ శ్రీ కూచి నరసింహముగారు వ్రాసి దయచేసిరి. నేను వారి కనేక నమస్కారములు చేయుచున్నాను.

పీఠికాపురము,
19-12 1909.

ప॥ లక్ష్మీనరసింహారావు.

ఈ నాటకమున వచ్చుపాత్రలు.

పురుషులు :

విప్రనారాయణుఁడు—కథానాయకుఁడు.

శ్రీనివాసుఁడు—విప్రనారాయణుని శిష్యుఁడు.

మాధవుఁడు—ఒక విటుఁడు.

రాజు—చోళ భూపాలుఁడు.

స్త్రీలు :

దేవదేవి—కథానాయిక యగు వేశ్య.

మధురవాణి—దేవదేవి యక్క.

వేశ్యమాత—దేవదేవి తల్లి.

శ్రీ

విప్రనారాయణ చరిత్రము

నాంది

రారాజన్మణికుండలస్ఫురిత దీ♦ర్ఘ శ్రోత్రసంభావ్యుఁడున్
నీరేజాయతపత్త్రమిత్రవిలస♦న్నేత్రోజ్జ్వలాస్యుండు భ
వ్యారూఢాత్మకదృష్టి పర్వ సుభగ♦శ్యామాంగుఁడై పొల్చు నా
శ్రీరంగేశుఁడు మీ కొసంగుత యశ♦శ్శ్రీ లాయురారోగ్యముల్.

(నాంద్యంతమందుఁ దెరలో)

ఉ॥ కోకిలపల్కుల న్గులుకు ♦ గుబ్బలతళ్కులఁ జూపుబెళ్కులన్
సోకి సువర్ణవర్ణమును ♦ జూపెడు సన్నికషంబుపోలికన్
దేఁకువగల్గుభర్తలను ♦ స్త్రీజనసత్తుల వేఱుపుచ్చు బి
బ్బోకవతుల్ చెలంగుదురు ♦ హో! సువయోవిభవాభిరామతన్.

సూత్ర—(చెవియొగ్గి విని) ఏ మిది? ప్రతిధ్వనియా? కాదు కాదు! నా యవ్యాజస్తుతికిఁ బ్రత్యధిక్షేపాశీర్వాదము పద్యరూపముగఁ జదువఁబడినది. చదివినవా రెవ్వ రని యాలోచింప నేల? ఈ సర్వము నెఱజాణ యగు నటి శ్రావ్యకంఠస్వరము. అది యెప్పుడును బరిహాసప్రియగదా!

(నటి ప్రవేశించును)

నటి—పరిహాసమున కిం దే మున్నది? మీరు పురుషులు. మీ యిష్ట దైవము పరమపురుషుఁడు? సభ్యు లందఱో, పెక్కురో పురు

షులు. వారి కందఱు కాయురారోగ్యసంపత్సమృద్ధి మీరు వేడఁగాఁ బాపము! స్త్రీజాతికిమాత్రము శుభ మక్కఱలేదా? యని చింతించి మీవలె గంభీరశార్దూలధ్వనులతో బహిరంగ ముగఁ గాకపోయినను దెరమాటునుండి సన్నని గొంతుతో మా కలువకంటులపై నొక చిన్న యాశీర్వాదోత్పలమాల వైచితిని. ఇందున కింత యీర్ష్య యేల? శ్రీరంగనాథుఁడు మీ పురుషులకు శుభమిచ్చుచుండ మా యబలలను, వారి సహజ వితావయవములనే శుభపరికరములుగఁ జేసికొం డంటిని. ఇందుఁ దప్పే మున్నదో యీ ముగ్ధ యగు కింకరురాలికిఁ దెలియఁజేయఁ గోరెదను.

సూత్ర—ఏమీ యభినవప్రౌఢతర్కవాగ్వాహిని! ఈ తళుకుబెళుకులు శుభపరికరములా? కావు. తమకు నితరులకుం గూడ నపార ఘోర పాపకరములు. హరిభక్త్యూర్జిత పుణ్యలేశవిదారణమారణ కార్యములు. ఐహికతుచ్ఛసుఖసాధనంబు లైన నగుంగాక! నటీ! కవితల్లజుఁ డైన పానుగంటి లక్ష్మీనరసింహారావు ముద్దులు మూటఁ గట్టునట్టు చేసిన "వైజయంతీవిలాస" మను తొమ్మి దవ నాటక మిది బహుజాగరూకతతోఁ బ్రదర్శింపవలయు నని యెంత బతిమాలి చెప్పినను మొట్టమొదటనే రసాభాస మొనర్చితివి!

సీ॥ విప్రనారాయణుని తీవ్ర♦విష్ణుభక్తి
మాపె నా దేవదేవి మొ♦హమ్మడ్కి వచ్చి
యాసరణి వచ్చి గంగలోఁ ♦ దోసినావు
నా హృదయమందుఁ గల్గు ను♦త్సాహ మంత.

నటి—అట్లనెద రేమి? దేవదేవిప్రయత్నము తుదకు భక్తిభ్రంశకార ణమునకుమాఱు భక్త్యుచ్ఛ్రయహేతువై యతని నాళ్వారుగను,

నామెను విరాగినిగను మార్చినది కదా! నా యాదిమశృంగార ప్రశంసయు నట్లే రసశోషణకరమునకువలెను రసపోషణకరమగు నేమో యెవ రెఱుఁగుదురు? నారాయణతీర్థ, జయదేవ, లీలాశుకభక్తత్రితయమునకు వారిశృంగారవర్ణనము లేమిని కొంతదీసికొనివచ్చినవా? అదియుంగాక స్త్రీవ్యామోహపాశబద్ధులెవరో యథార్థ శ్రీహరిపాదకీలితబుద్ధులెవరో తెలిసికొనుటకు విలాసినులు సాధనములు గాన వారి దీవించితిని.

సూత్ర—ఆలాగునా?

గీ॥ వీరు యోగ్యు లయోగ్యులు ♦ వీ రటంచుఁ
దెలియఁబఱుతురు నీచెప్ప ♦ కులుకులాఁడు
లవని జనులకు సరియె; యే ♦ మందు వింక
బతితుఁడైనట్టి పురుషుని ♦ బడఁతిఁ గూర్చి?

గీ॥ లలితభక్త్యగ్రగణ్యలీ ♦ లాశుకాది
వరమతులు, పారలౌకిక ♦ భక్తిపార
వశ్యమున బాలకృష్ణుని ♦ బాడుకొనిరి
కాని చేసిరె పలుగాకి ♦ కార్యములను.

కం॥ శృంగారపుసంగీతం
బంగీకృత మానె యిట్టి ♦ యవసరములకున్
బంగారపుభక్త్యర్చల
కంగజమంత్రముల కెట్టు ♦ లడుకును ముదితా?

నటి—నిర్యుక్తికముగ నేమేమో సెలవిచ్చితిరి. వాదమునకుఁ బ్రతివాదము వచ్చునని కాఁబోలుఁ బుణ్యాంగన నగు నన్నుఁ బణ్యాంగనకుఁ బోల్చి గీతమధ్యమునం దిఱికించి తిట్టని తిట్టు

చ్చితిరి. పెద్ద లగు పురుషు లేమన్నను సమీచీనవాక్యము లగును. గోల లగు స్త్రీలమనోజ్ఞ వచనములు దుష్టపరిహాసవచనములుగ మాఱును. మాఱు మాటాడక దేవరబోధంబులు శ్రుతిశాసనవాక్యములవలె శిరసావహించెదను గాని యొక సంశయము నన్నింకను బాధించుచున్నది.

సుగాత్రి—అది యేది ?

సుశీ—వెనుక నొకసారి యీకవి నాటకమునే యొక్కదాని బ్రదర్శింపను టలెఁ బ్రసంగవశమున మీ రీ పూర్వపక్షమునే నే చేయ, నప్పుడు భక్తిశృంగారముల కైక్యానుసంధానముచేసి వాక్రుక్కితిరి. అది మనసునఁ బెట్టుకొని యిట్టుసేయ నన్ను దూఱ నారంభించితిరి. అత్తలయొత్తుడికంటె స్వవచనవ్యాఘాతప్రసంగుల ప్రబోధబాధ యెక్కుడుగ నున్నది.

సుగాత్రి—ఓసి వెఱ్ఱిదానా! విను.

గీ॥ కాముకుఁడు భక్తుఁ డనురాగ ♦ కలన నేక
మంటినే కాని, యన్నింట ♦ నట్ల యనఁగ
రాదు సుమి! ప్రేమతావులు ♦ భేద మాట
హ స్తిమశకాంతరము వారి ♦ కలసగమన !

సీ॥ కడుపార నన్నంబు ♦ గుడుచు సౌఖ్యముకంటె
నధికంబు ధనభూష ♦ ణాదు లుంట
దానికంటెను సుఖ ♦ తరము విస్తృతరాజ్య
భాగ్యముల్ గొని పెద్ద ♦ పదవి నుంట
దానికి నధికంబు ♦ తరుణవయోరూప
గుణయుక్త యగు కాంతఁ ♦ గూడి యుంట

దానికి నెక్కుడు ♦ తత్వశాస్త్రనైపుణ్య
మధికంబు దానికి ♦ నమలకవిత

దానికింగూడ నధికంబు ♦ దైవభక్తి
భక్తిసుఖమున కెనలేదు ♦ వసుధ నెదియు
నిట్టి సుఖతారతమ్యంబు ♦ లెనసియుండ
నతివ! యన్నియు నొక్కటే ♦ యనుట తగునె?

నటి—ఆర్యా! ఇప్పుడు నిస్సంశయముగ సుఖముల కుండు భేదంబులును సద్భక్తిస్వభావంబును దెలియంబఱచితిరి కాని మన మాడం బోవు నాటకమందుత్తమభక్తిమంతుండైన విప్రనారాయణుం డంతభక్తియు వదలి యధమవిషయసౌఖ్యలోలుండై దేవదేవి వెంట నేల పఱువెత్తెను? ఇది చాల నాశ్చర్యముగ నున్నదే!

సూత్ర—అది స్థిరభక్తి లేమిని, నింద్రియములబలిమిని, మీాస్త్రీజాతి రూపయౌవనలావణ్యకౌశలప్రభావంబును బ్రకటించుచున్నది.

నటి—అట్లయిన భక్తిప్రభావ మంత యల్పమా?

సూత్ర—కాదు.

గీ॥ పూర్వసుకృతంబు చేతను ♦ బుట్టు భక్తి
పూర్వదుష్కృతముల నడ్డి ♦ పొలియుఁ గొంత
యిహపురాకృతకర్మంబు ♦ లేచి నరుని
ద్రిప్పుఁజుమీ! జలావర్త♦తృణముగతిని.

కం॥ పడుచును లేచుచు మఱలన్
బడుచు నడక నేర్చునట్టి ♦ బాలునిపగిదిన్
బుడమిని మనుజుఁడు భక్తిని
గడియింపఁగఁ బడును దొల్తఁ ♦ గడగండ్లు సఖీ!

నటి—ఆర్యా! నాసంశయవిచ్ఛేదంబు చేసి భక్తితత్త్వము నుపదేశించినందులకు మీ కిదుగో యొకచేమోడ్పుఁ గావించి ప్రదర్శనకార్యమునకుం బోయెదను.

సూత్ర—శుభమస్తు.

గీ॥ పూర్వుఁడోఁటకు నల దేవ ♦ దేవి మధుర
వాణియును, బోయినప్పుడు ♦ వారిఁ గనక
పోయినట్టువంటి విప్రనా ♦ రాయణుని వి
నిర్మలంపుభక్తి నీ కెప్డు ♦ నిలుచుఁగాత!

(ఇది ప్రస్తావన)

(ఇద్దఱును నిష్క్రమింతురు)

శ్రీ

విప్రనారాయణచరిత్రము

ప్రథమాంకము.

ప్రదేశము—శ్రీరంగమున విప్రనారాయణుని పుష్పారామము.

(ప్రవేశము—దేవదేవి, మధురవాణి అను నిద్దఱు వేశ్యలు.)

దేవ—అక్కా! మధురవాణీ! ఈవన మెవనిదో కాని యెంత శృంగారముగ నున్నది!

మధు—దేవదేవి! ఇది విప్రనారాయణుఁ డను భాగవతోత్తముని పుష్పవనము.

దేవ—భాగవతోత్తముఁడని బ్రహ్మాండమంత పేరు చెప్పితివి! మనము మాత్రము భాగవతోత్తములము కామా?

మధు—ఆ! పణ్యస్త్రీలమగు మనము భాగవతోత్తమల మెట్లగుదుము?

దేవ—ఆతనికవలగ్నబంధము; మన కవలగ్నబంధము. ఆతనికి వెనుక బిగి కచ్చ; మనకు వెనుక బిగికచ్చ; ఆతని కాళ్ళకు గజ్జెలు; మనకాళ్ళకు గజ్జెలు. ఆతని చేతిలోఁ దాళపుఁజిప్పలు; మన చేతిలోఁదాళపుఁజిప్పలు. అతనినోటఁ గావేరిరంగని పదములు; మననోటఁ గావేరిరంగని పదములు. ఆతనికిఁ దెయితక్కలు; మనకుఁ దెయితక్కలు. మనకంటె నాతని విశేష మేమి? భాగవతోత్తముఁడని బారెఁడు బిరుదావళని బఠించితివి! భాగవతోత్తముఁ డనగఁ బణ్యస్త్రీప్రాయుఁడన్నమాట! తెలిసినదా? ఆతఁడు దేవదాసుఁడు; మనము దేవదాసులము. ఆతని యేడుపు పరపురుషానుసంధానము కొఱకు; మనయేడుపు పరపురుషానుసంధానముకొఱకు.

మధు—కాని నాతనికిఁ బుణ్యము; మనకుఁ బాపము. ఆతనికి స్వర్గము; మనకు నరకము.

దేవ—అదే తెలివితక్కువమాట! స్వవృత్త్యనుసరణ మెన్నఁటికి దోషముకాదు. అన్నివృత్తులు జీవనాధారము కొఱ కేర్పడినవి. చక్రవర్తి మొదలుకొని చండాలునివఱకు ధనముకై దేవులాడనివాఁ డొకఁడును లేఁడు. వేదఘోషము సేయుచు యజ్ఞోపవీతము నొడ్డుకొని జీవించు బ్రాహ్మణునకుఁ బరమపదమును, కల్లు గీచుకొని జీవించు గవలవానికిఁ గుంభీపాకమునా? ఖడ్గపాణియై శత్రువధ మొనర్చి జీవించు శూరాగ్రేసరునకు వీరస్వర్గమును, గోశఖండన మొనర్చి జీవించు మంగలికి మహానరకమునా? ఒక్కమగని కొడ లమ్ముకొనిన సుందరికి సుగతియు, ననేకుల కొడ లద్దెల కిచ్చు మన కధోగతియునా? ఏమిమాట? మనవృత్తి ననుసరించి—

మధు—మనవృత్తి మనవృత్తి యనెదవేమి? అది వ్యభిచారమను కొంటివా!

దేవ—అనుకొనుటయేమి కాదు. నేనే కాదు.

మధు—మనజాతి మొదట దేవాలయము లందలి యర్చావిగ్రహముల సన్నిధిని నృత్యగానాదు లొనర్చుట కేర్పఱుపఁబడినది. స్వామికి సహస్రనామోచ్చారణముతోఁ బూజజేయు నర్చకుఁ డెట్టివాఁడో భగవద్గుణవర్ణనపవిత్రప్రబంధ గానశీలుర మగు మన మట్టివారము. మనవృత్తి మొదట పవిత్రమైనదే. మనము గూడ సర్వసంసారిణులవలెఁ బతివ్రతలమై కాలక్షేపముఁ జేసి యుండిన బాగుగ నుండియుండును. కన్ను గానక, యొడలు తెలియక, పొగరెక్కి మనవృత్త్యధికతను మనము మన్నుఁ జేసికొనుటయే కాక లోకమున నెట్టి నీచ జంతువైనఁ జేయని యీ యధమాధమపాపమును గూడ శాశ్వతముగ మెడకుఁ జుట్టుకొనినారము.

దేవ—పాపమని చెప్పకుము. నాకుఁ దలనొప్పి వేయుచున్నది. మన జాతి యీ రీతిగా నుండుటయే లోకోపయోగకరమని నమ్ముము. జగదుపకారక కృత్యము సుకృతము కాక దుష్కృత మగునా ?

మధు—మన లోకోపకారము మండిపడ్డ యున్నది.

దేవ—నీవు తత్వమును గనిపెట్టక మాటలాడుచున్నావు. అవనిపతులు ధర్మసత్రము లేల కట్టించుచున్నారు ? చలిపందిరు లేల వేయించుచున్నారు ? మందబయళ్ళేల నిర్మించుచున్నారు ?

మధు—లోకోపకారముకొరకై —

దేవ—అనఁగ —

మధు—గృహాది సాధనములు లేని పాంథుల యుపయోగమునకు—

దేవ—అట్లే బ్రహ్మచారులకై—భార్యామారులకై — భాగవతోత్తములకై — మనము నిర్మింపఁబడినాము. మనమే లేకుండు నెడల ప్రబలబలాతిరేకులగు వీరి మదపుఁ బిచ్చవిసరులు, వీరి బందిపోటులు, సంసారిణుల కొంపలు తీసివేయవా! ఎంద ఱుత్తమ కాంతలు భ్రష్టలై పోవుదురు! పురుషులలో నెట్టి మహా కలహములు సంభవించును ! లోకవిపత్తును మన మిట్లు లాపుటచే మనము లోకోపకారిణులము.

మధు—మనము గుడిసెవ్రేటులమై పరస్త్రీలను బతివ్రతలుగఁ జేయుచుంటిమా ! మనము మహాపాపాత్ములమై యితరుల సుపుణ్యాత్ములుగఁ జేయుచుంటిమా ! ఏమివెఱ్ఱి ! పతివ్రతను బాడుచేయువాఁ డెవ్వఁడును లేఁడు. తపస్సు, దైవము, నామె నెల్లప్పుడుఁ గాపాడుచుండును ; కాని వీథిలోని మగగాడిదెలు, కుక్కలైన మనలఁ గాంచి కన్ను గీటునంతటి పరమ లాఘవ స్థితిని బడి యింక నథోగతికిఁ గ్రుంకుచున్న మనమా, స్వతేజోదుర్నిరీక్ష్యలగు పతివ్రతలను రక్షించుట !

దేవ—సరి సరి ! ఇఁక నీవు వారకాంతా వ్యాపారమును మాని భాగవతోత్తమత నవలంబింతువా యేమి ?

మధు—ఇది వదలవచ్చునుగాని యది సంభవించు టెట్లు ?

దేవ—ఇది వదలిన వెంటనే తనంత తానే యది సిద్ధించును. అన్ని వన్నెలు చిన్నెలు ధనముతో నున్నవి. వ్యాపారము వదలిన ధనము క్షీణించును. ధనలోపమునఁ దత్త్వజ్ఞానవృద్ధియే కదా ? కడుపునిండిన చిలుక కునికిపాటును పడునుగాని కడుపుమండిన చిలుక రంగా రంగా యని కూయదా ! (నేపథ్యమున) రంగ ! రంగ, రంగా !

మధు—అదుగో ! భక్తాగ్రేసరుఁడగు విప్రనారాయణుఁ డిటు వచ్చు చున్నట్లున్నాఁడు. ఆతని పుణ్యదర్శనమున బవిత్రుల మగుదము.

దేవ—నీవు కమ్ము. నేను గానక్కఱలేదు. నే నాతని నా దర్శనమున నపవిత్రునిగాఁ జేయకుండు నెడల చాలును.

(నేపథ్యమున) చాలును. అంతే చాలును. ఈ కాంచనపుష్పము లతో దివ్యమగు దండ యగును.

మధు—మఱియొక కంఠరవము వినఁబడుచున్నది. ఆతని కొక శిష్యుఁడు కూడ నున్నవాఁడేమో !

దేవ—పణ్యస్త్రీ కొక్క-బానిస, పుణ్యస్త్రీ కొక్క- పూర్వసువాసిని, శ్రీరంగదాసున కొక్క- శిష్యుఁడు లేకున్న గ్రంథమే నడువదు గాదా ?

(నేపథ్యమున) 'రంగడే రంగడు' అని నేను చేసిన గ్రంథమును నీవు విందువా ?

(నేపథ్యమున మరియొక ధ్వనితో) చిత్తము.

దేవ—నేను జేసిన గ్రంథ మనుచున్నాఁడు. ఈతని కింక నహంకారము వదలలేదు. నీవు విందువా యనుచున్నాఁడు. ఒకని మెప్పు నింక నపేక్షించుచున్నాఁడు. ఈతఁడు స్తుతిప్రియుఁడు. ఈతని కింక భక్తి పూర్ణముగఁ గుదురలేదు.

విప్ర—(నేపథ్యమున) బాలకా ! పాడెదను వినుము.

దేవ—బాలకుఁడేకాఁడు. బాలికలు గూడ విననై యున్నారు.

(విప్రనారాయణుఁడు శ్రీనివాసుఁడను శిష్యునితో 'రంగఁడే రంగఁడు' అని పాడుచుఁ బ్రవేశించును.)

విప్ర— బలహంసరాగము—ఏకతాళము.

రంగఁడే రంగఁడు ♦ రమ్యగుణాభంగుఁడే (రంగ)
భంగహీనభక్తకోటి ♦ పాలనాత్తసంగుఁడే (రంగ)
(తాండవించును)

దేవ—అక్కా! భంగహీన భక్తుఁ డనుచున్నాఁడు. భక్తికి భంగములు ప్రాయికములని యెఱిఁగి యనుచున్నాఁడు సుమా!

విప్ర—మంగళలలితాంగుఁడే ♦ మహితదయాపాంగుఁడే
అంగసంగతోద్గదార ♦ థాంగశంఖశార్ఙ్గుఁడే (రంగ)
(తాండవించును)

హా! రంగ! రంగ! రంగా! కస్తూరిరంగా! కావేరిరంగా!

దేవ—అక్కా! నాన విడిచినఁ గాని నారియే నాట్యమాడ లేదు. అట్టిచో నట్లుచేయు పురుషుఁ డెంతలజ్జారహితుఁడై యుండవలయును! అందులో కాళ్ళుగాలిన క్రోఁతిచిందులవంటి యీదిక్కుమాలిన మిట్టగంతులను వేయుటకు మఱెంత సిగ్గుమాలినవాఁడై యుండవలయును. సిగ్గులేక యూరందఱి యెదుట మన మెగురులాడ నంతకంటె సిగ్గులేక మనయెదుట నీతఁ డెగురులాడుచున్నాఁడు. ఈతఁడు వేశ్యల పాలివేశ్యయై వెలుఁగుచున్నాఁడు. వేశ్య లీతని యొద్ద శిష్యులుగా నుండదగినంత మహాప్రభావము గలవాఁడు.

మధు—నీవు హేళనమునకై యనుచున్నను బరమార్థమే నీ నోటి నుండి వెడలినది.

శ్రీ—గురూత్తమా! దేవరవారు రచించిన యీపదము దివ్యముగ నున్నది. బ్రహ్మముఖోద్గీతమగు గాయత్రీమంత్రములో మూడవ వంతుఫల మీయఁ దగియున్నది.

విప్ర—ఎట్లయ్యా! శ్రీనివాసా! (పుష్పములు మాలగ గ్రుచ్చుచుండును)

శ్రీ—గాయత్రికి మూఁడుచరణములు. దేవరపదమున కొకచరణమే.

దేవ—(తనలో) శ్రీనివాసా! తెలివిగలవాఁడవే. కాని గాయత్రికంటె నీతని రంగకీర్తనమే యధికఫలప్రదమని చెప్పినయెడల బాగుగ నుండును. ఏలనఁ, జతుర్ముఖ బ్రహ్మోద్గతమగు గాయత్రికిఁ జరణత్రయము ముందుసరికి దుర్లభమైపోయెను. ఏకముఖ బ్రహ్మోద్గతమగు కీర్తనమునకుఁ బూర్ణముగ నొక్కచరణ మున్నది. గొప్పకాదా?

విప్ర—నీవు నన్నేదో యొకకారణమున స్తుతిచేయుచునే యుందువు. నీ కెన్నిమాఱులు చెప్పినను—

శ్రీ—ఆత్మస్తుతి కూడదని చెప్పినారు! కాని గురుస్తుతి కూడదని చెప్పియుండ లేదు.

దేవ—(అపవారించి) అక్కా! వింటివా? గురుశిష్యసంభాషణ మెంత శ్రావ్యముగా నున్నదో! చెప్పితినని గురుఁ డనును! చెప్పియుండ లేదని శిష్యుఁ డనును! గురుఁ డసత్యవాదియైనఁ గావలయును, శిష్యుఁడు గురుద్రోహియైనఁ గావలయును.

మధు—(అపవారించి) చెల్లెలా! పూజ్యుల నధిక్షేపింపకుము.

విప్ర—శ్రీనివాసా! పరమపవిత్రమై, సర్వశక్తిదమైన గాయత్రీమంత్ర మెక్కడ! మనసుండఁబట్టలేక యేదో వెఱ్ఱిమొఱ్ఱిగ నఱచిన నా కీర్తన మెక్కడ! శ్రీరంగ దేవునకు, శ్రీరంగ కింకరుఁడనగు నాకు నెంత యంతర మున్నదో గాయత్రికి నా కీర్తనమున కంత యంతర మున్నది. నాదియొక భక్తియేనా! నా ప్రార్థన మొక ప్రార్థనమేనా! నేను జడుఁడను—దురభిమానిని — పాపాత్ముఁడను—కుటిలుఁడను—అధముఁడను —దౌర్భాగ్యుఁడను — చపలుఁడను—పశువను—రంగ—రంగ—రంగా!

శ్రీ—తమ శిష్యుఁడ నగుటచే నేను గాడిదను—కాకిని — కంబళిపురుగను—పలుదోముపుల్లను—దారమును —పీచను—ఏసను— ఈఁకెను. నారాయణ! నారాయణ! నారాయణ!

దేవ—(తనలో) ఈఁకెలో నొక్క వెండ్రుకవు. వెండ్రుక కాలిన కమరవు. శంకర! శంకర! శంకర! (అపవారించి) అక్కా! వింటివా? గురుశిష్య నైచ్యాను సంధాన బంధుర గ్రంథ సందోహ రచనా ధౌరంధర్యము! ఆహా! ఆచారము ననుసరించి యధమత్వములో నన్యోన్యాధిక్యము నపేక్షించి, యవకతవకలలో నొకని తలపై నొకఁడు దాఁటుదలఁచి, యజ్ఞానకృత డంబాచారఘోరణిని వీరాడిన యవాచ్యాసందర్భాలాపములు బహు పాపప్రదములై వీరి సంతతివానిగఁ జేయునుసుమా?

మధు—ఎందుచేత?

దేవ—దైవదివ్యమంగళ విగ్రహ ప్రతిబింబముగ నీ నరదేహము నిర్మింపఁబడినది. తన్మహాతేజః పవిత్రస్ఫులింగమైన యాత్మ యీ దేహమున నుంచఁబడినది. అందుచే స్వనిందాపరుఁడగువాఁడు దైవనిందాకరుఁడు. ఆత్మఘాతుకుఁడు దైవఘాతుకుఁడు. తానే బ్రహ్మమనుకొని యనుసంధించు నష్టబొట్టద్వైతినైన నా యప్రమేయుఁడామోదించునుగాని తానుఁ బందినని పలుమాఱు పడఁద్రొక్కొను పంగనామాల భాగవతోత్తముని నాఁగదీయక మానఁడు. ఈతనిపాటు లింక ముందున్నవి. ఆత్మగౌరవములేని వానికిహమునందుఁ బరమునందు గూడ దుర్గతియే.

మధు—చాలు, చాలు! నాల్గుముక్కలు చదివితినని విఱ్ఱవీఁగి విష్ణుభక్తులను విపరీతముగఁ దూలనాడుచున్న నీ పాటలు ముందెట్లుండునో యోజించుకొనుము.

విప్ర—

గీ॥ ఎన్నికోటులజీవు లీ ♦ యిలను గలవో!
ఇట్టిగోళమువంటివి ♦ యెన్ని యుర్వ్వ
దంబు లున్నవో! అందు జీ♦వంబు లెట్టి
వెన్ని శంఖానుశంఖంబు ♦ లున్న వొక్కొ!

గీ॥ ఏతదతిసంఖ్య జీవసం ♦ ఘాతములను
వివిధనైజరూపధ్వని ♦ భేదగతుల
లీల సృజియించి రక్షించి ♦ గోళకోటు
లిద్ధగతిఁ ద్రిప్పు నతఁ డబ్బ ! ♦ యెంతవాఁడొ !

(గుండెలు కొట్టుకొనుచు)

గీ॥ ఇంతజేయు నాతనిబుద్ధి ♦ యెంతొ ! తేజ
మెంతొ ! కల్పనావైచిత్ర్య ♦ మెంతొ ! దృష్టి
యెంతొ ! రక్షణసామర్థ్య ♦ మెంతొ ! యాజ్ఞ
యెంతొ ! ఇన్నియుఁ గల యతఁ ♦ డెంతొ ! యెంతొ !

(గుండెలు కొట్టుకొనుచు)

గీ॥ మనకు ముందునకుం జూడ ♦ వెనుకనున్న;
కనిన వినలేము ! వినుచుఁ బ ♦ ల్కంగలేము;
పల్కుచుండి వ్రాయఁగలేము ♦ వ్రాయుచుండి
తలఁపలేము ; తలంపులో ♦ నిలువలేము.

గీ॥ మనకుఁ దెలిసిన దేదైన ♦ మహినిఁ గలదె?
ఇదిగొ ! పుష్పము పూవన ♦ నేమి? ఊఁహూ!
యెట్లు పుట్టెన? దూఁహుహూఁ ♦ ఇట్టిరంగు
లెటుకలిగె? నూఁహూ! యేవస్తు ♦ విద్ది? ఊఁహూ !

గీ॥ తృణ మనఁగనేమొ ? యెట్టిదో ♦ తెలియలేక
ప్రకృతిశాస్త్రిలి కొందఱు ♦ వ్రాయుచుంద్రు
తలపయిని వెండ్రు కెట్టిదో ♦ తెలియలేక
యాత్మజిజ్ఞాస మఱికొంద ♦ రాచరింత్రు.

గీ॥ మెఱుపు మింటఁ దళుక్కనఁ ♦ దెఱువు దప్పు
జనుఁడు దైవాంతికమునకు ♦ సరణిఁ జూపు
గోడపై నెక్కఁ దల దిరు ♦ గునతఁడు పర
మాత్మ కెగఁబ్రాఁక మోక్షసూ ♦ త్రాళిఁ బన్ను.

గీ. కనులు మూసికొని సతిరూపు దృఢముగఁ
గనఁగలేని నరుఁడు దేవుఁ గాంచితి నను
నెందులకుఁ బుట్టె నెఱుఁగక యెటులొ పుట్టి
తాన బ్రహ్మ మటంచును దలఁచు నొకఁడు.

గీ. బ్రహ్మము నెఱుంగ నరుఁ డెన్ని పాట్లు పడిన
నన్ని వెఱ్ఱిపోఁకలసంధు లతిశయించు;
తెలియలేని దెఱుఁగు టెల్ల! తెలియకుంట
మతియె లేని తెలివికంటె మంచిగాదె?

గీ. వస్తుతత్త్వ మెఱుంగుట నట్టికల్ల
మనకుఁ దెలివితో నింతయుఁ బనియె లేదు
భక్తిఁ గింకరో హ మ్మని భగవదర్ప
ణంబు తన్నేసికొనుటె మోక్షంబు తెఱువు.

గీ. అట్టిబ్రహ్మ సర్వాచరూప మంది యిచట
రంగఁడై వెలసెనుగాన రంగ, రంగ,
రంగ రంగ, రంగా రంగ, రంగ యనుట
కంటె నిహపరోత్తారకగతియె లేదు.

(నేపథ్యమున) రంగ రంగ రంగ రంగా! రంగ! (ధ్వను లగుచున్నవి)
ఓహో! దాసాథముఁ డొనర్చు పుష్పమాలాకైంకర్యమునకు వేళయైనది. రంగా! రంగా!

మధు—దేవదేవీ! ఈ మహానుభావుఁ డింక శ్రీరంగ దేవాలయమునకు బోవును. మనము మనయింటికి బోవుదము. రమ్ము.

దేవ—ఈతనిని సమీపించి మాటలాడి మఱి పోవుదము.

మధు—విష్ణుసామీప్య మొందవలసిన భక్తాగ్రేసరుఁడు విట సామీప్యముచే నపవిత్రయగు వేశ్యచే సమీపింపఁబడుట యనర్థమగును గాదా! అదిగాక, అతనికి మన కేమి మాట లున్నవి? అతనినిఁ బరిహాసింతుమా! బంగారునగలకై బాధింతుమా! పరపణ్యా భామినులఁ గాంచి కన్నుగీటె నని చెప్పుదుమా! దేవదేవీ!

మన మాతనిని సమీపింపవలదు! నీవు హేళనస్వభావముగల దానవు. ఆత్మశక్తివిశ్వాసాధికత గలదానవు. తొందరచే నేమాట నీ నోటనుండి జారునో! భగవద్భక్తులంగోడి పరిహాసపుమాటలు పాములతోఁ జెలగాటలు! కావున దూరమునుండియే యొక్క నమస్కార మర్పించి పోవుదము రమ్ము.

దేవ—ఇక్కడనుండి చేయు నమస్కార మెదుటికిఁ బోయియే చేయుదము. నీ కేమియు భయ మక్కఱలేదు. నే నాతని బరిహాసింపను. లెమ్ము.

మధు—పరిహాసింపకపోవుటయే కాదు. భాషించుటకూడ వలదు.

దేవ—సరే! పోవుదము.

(ఇద్దఱును విప్రనారాయణుని కెదురుగఁ బోవుదురు)

మధు—మహాత్మా! దాసురాలి ప్రణామ మంగీకరించవలయును.

(నమస్కరించును.)

దేవ—దేవా! దేవదేవి మ్రొక్కుచున్నది. (నమస్కరించును.)

విప్ర—(వారివంకఁ జూడక యాశీర్వదింపక)

శ్లో. కుడతిశై, ముడియ్యైన్నైత్తు, క్కణదిశై పాదనీట్టి
వడతిశై పిన్బుకాట్టి త్తెఱ్ఱతిశై యిలంగోనోక్కి
క్కడల్నిఱక్కడవుళెన్దై యరవణైత్తు యిఱుమాకణ్
డుడలె నక్కరుసు మాలోవేఱ శేయ్గేనులగ త్తీరే.
నంబెరుమాళ్ తిరువడిగళే శరణం (నిష్క్రమించును)

శ్రీని—అడియేని కంతవట్టుదనుక నక్కఱలేదు. దేవర తిరువడిగళే శరణం.

(నిష్క్రమించును.)

మధు—మహాత్ముని దర్శనమైనది. కృతార్థల మైతిమి. పోవుదము రా!

దేవ—కృతార్థల మెట్లయితిమి?

మధు—దర్శనమువలన—

దేవ—ఆతని దర్శనము మన మా చెట్టుక్రిందనుండి చేయలేదా! అంత మాత్రమునకే కృతార్థుల మగునెడల నిదివఱకే యైతిమే! ఇతని సమీపమునకు వచ్చి మనము గాంచిన యాధిక్య మే మున్నది? ఆతని మనము చూచుటతోడనే సఫలత స్వర్గప్రాప్తి కలుగునా? మన నమస్కారము నాతఁడు గ్రహించెనా? ఆశీర్వదించెనా? ఎక్కడివా రని కుశలప్రశ్న మొనర్చెనా? ఏమియు నక్కఱలేదు. కన్నెత్తి చూడనైనఁ జూచెనా? ఈ మాత్ర పాదరణమునకే ధన్యుల మైతిమా! క్షాళితపాపుల మైతిమా? సమార్జితపుణ్యుల మైతిమా! మోక్షనిశ్రేణికారోహణ మొనర్చుచుంటిమా! శరీరములతో శ్రీమహావిష్ణులోకమును జేర సిద్ధముగ నుంటిమా! ఏటిమాటలు!

మధు—మనము నమస్కరించకున్నను నమస్కరించునట్లు భావించుకొని, తాఁ జేతుల జోడించుకొని యాశీర్వాదము లంతయు లేకుండజేయుట కితఁడు నోటికి దలుపును ద్వారబంధమును లేక వట వట వెళ్ళికొనుఱ లఱచు విటాధముఁడా? బహుమితభాషియైన భాగవతోత్తముఁడు. ఇంటికి వచ్చినతోడనే మన మెవ్వరమును మాటలాడకున్నను "అత్తా! నీకుఁ దలత్రిప్పు తగ్గినదికద" యని మన యమ్మను, "బావా! ఖండువా మాసినట్లున్నదేమోయి! బొజ్జు కనఁబడుట లేదు; భోజన మింకఁ గాలేదా?" యని మన సోదరుని, మన పుత్రునకు "ఏమే! ఈసారి కోరలపుప్పు మికిఁ గోక తప్పకయిచ్చెదను గోపపడ" కని మన యిల్లాడుచ్చదాని దానినైనఁ గారవించుటకు, బరామర్శించుటకు, శాంతింపఁ జేయుటకు, బహుమానించుటకు, బతిమాలుకొనుటకు, కుశలవార్త లడుగుటకు నోడలిమదముచే మనతోఁ గాని బ్రదుకలేక మన దయాలేశముకొఱకు, మన బంధువులకు, మనపుత్రులకు, మన యింటికుక్కలకుఁగూడ నధమాధమదాస్యముఁ జేయుచు, లేనిపోని మమకారములు వెల్లడింపుచు, పడికాపులు

పడుచు, ప్రాకులాడుచు, పాదముల నఱ్ఱుకొనుచు, నూతన సంసారబంధ సహస్రమును జిక్కుకొని గిజగిజ కొట్టుకొనుచు, గిరగిర దిరుగుచు, పడుచు లేచుచు నింద్రియార్థమార్థము దాసుఁడై యుండి మన యారోగ్యాధికపరిశ్రమే యష్టాక్షరీమంత్రముగ జపించి 'జారిణీమయ మిదం జగ' త్తని ఘోషించుట కతఁడు జారపిశాచ మనుకొంటివా? హరిహరీ! ప్రాపంచికాఖిల పాశాబంధప్రదారణపటిష్ఠుఁ డగు భక్తశిఖామణి! "మనలను గన్నెత్తిచూడనైన రాదా?" యనియంటివి. చెల్లెలా! నీ కెంత వెఱ్ఱి! మనలఁ గన్నెత్తి చూచుటకు, కన్నువ్రాల్చిచూచుటకు, నోరగఁజూచుటకు, చూచిచూడనట్లుచూచుటకు, చూచి కన్నిట్టి గీటుటకు, గీటి కిక్కురుమనక తటస్థముగఁ జూచుటకు, టక్కుటమారులమారి దొంగలగురు వగు కులటాకుత్సితపతియా? శ్రీరంగదివ్యమంగళవిగ్రహసందర్శనపరమపవిత్రనేత్రుఁడు, మహాంతర్ముఖుఁడగు వైష్ణవప్రపన్నశేఖరుఁడు. అతఁ డేమి - మనతో మాటలాడుట యేమి, మనలఁ జూచుటేమి, మనకుశల మడుగుటేమి? మనతో మాటలాడువాఁడు మనల జూచువాఁడునైన యెడల మనకోళ్ళకుఁ దపిటియుండలుసేయుచు, బెరిగిపోయిన మనగజ్జెలలోనికి దారమును బేనుచు, మనమంచముల నల్లులను జంపుచు మనయింటిలోనే బంట్రై, బానిసయై పండ్రెండు పక్షములక్రిందఁ బరమపదించినట్లు పడియేయుండును. అదికాక—

దేవ—అంతటితో నాఁగుము. నీ సిద్ధాంతమునకుఁ గొండవీటి చేఁదత్రాడునకువలెఁ గొనయే గోచరింపకున్న దేమి! ఇంతకు నీ యభిప్రాయ మేమో నాకు బాగుగఁ దెలియనే లేదు! మనల నాతఁడు చూచునరికి భగవద్దాసుఁడు పణ్యావనితాదాసుఁడై పోవునా? మనతో మాటాడుసరికి శ్రీరంగసంకీర్తనమంతయు నట్టేటఁ గలసి నాట్యాంగనకు వెనుక నుపాంగముపట్టుచు నక్కిరిబిక్కిరి యగు విటుఁడగునా? హరిహరీ! ఇంత యఖర్వగర్వాతిశయ

ముండునా? అష్టాంగసహితముగ నవనతుల మగు మనకు—మన మధములమేకానీ యాతఁ డత్యుత్కృష్టుఁడే కానీ; మనమధిక పాపులమేకానీ, యాతఁ డమితపుణ్యాత్ముఁడే కానీ; మనమిం ద్రియవశ్యులమే కానీ, యాతఁ డతీంద్రియుఁడేకానీ; మనము తుచ్ఛమైన ధనమునకై మనమాంసము పిటుల కమ్ముకొనిన వేశ్యలమేకానీ, యాతఁ డుత్తమ మగు మోక్షమునకై దనయా త్మను విష్ణు నధీనముగఁ జేసిన విరాగిశిఖామణియేకానీ 'ఆ' యని నోరు తెఱచి యంత యాశీర్వదింపఁగూడదా? అంతటి తోడనే హరిభక్తి యంతయు నంతరించునా? నోరు తెఱచు సరికి రంగఁ డూఁచి పుచ్చుకొని యొకటి నోటిపై వాయించునా? నా కేమియు బోధపడలేదు! ఏల మనలఁ జూడలేదు? ఏల మనతో మాటాడలేదు?

మను—ఆతఁ డేల చూడలేదో, ఏల మాటాడలేదో యను నాలోచ నము లేశముగాని మన కావశ్యకత లేదు. ఆతఁడు పుణ్యమూర్తి. ఆతని దర్శించితిమి. ఆతనికి నమస్కరించితిమి. చక్కవచ్చి తిమి. మనపని యంతవట్టునకే. ఆతని యాలోకనములతో మన కేమి? ఆతనియాశీర్వాదములతో మన కేమి? ఆతఁ డాశీ ర్వదించినఁగాని మనకు బుణ్యము లేదనుకొంటివా? ఆతఁడు చూచినఁ గాని మనకు సుగతి లేదనుకొంటివా? పుణ్యకార్య మని నమ్మి పుణ్యకార్యమును జేసితిమి. కృతార్థతను బొంది తిమి. ఇతరచింతలతో మనకుఁ బనిలేదు.

దేవ—ఇదిగో పొందిన కృతార్థత! అరకాలుమంట శిఖ కెక్కుచు న్నది. ఆ! చూడనే చూడలేదు! అతఁ డేమి మహాధికుఁడా? నిశ్చలసమాధినిష్ఠాగరిష్ఠుఁ డగు యోగియా? శ్రీరంగదేవుని శిరముపై 'నెగిరిపోయినాఁడా? ఆతని కున్నంతభక్తి యాతని కున్నది. నాకుఁ దగినంతభక్తి నా కున్నది. ఆతనిహృదయమున నొకరంగఁడు నాహృదయమున నొక రంగఁ డున్నాఁడా? నన్నుఁ

జూచుటకై నం దగనంత నీచత నాయం దేమున్నది? శ్రీరంగ దేవుని సేవించిన నేత్రములతో వీథిలోని కుక్కలను, గాడిద లను, పందులను జూచుటలేదా? మన మంతకంటెం జెడిపోయి తిమా? ఇదియేనా భక్తునిలక్షణము! తనయాత్మవంటిదే యిత రులలో నున్నదని తెలియజాలనివాండు భక్తుం డగునా? పాపా త్ముల నాదరించి, పాపశాంతికై మంగళానుశాసనమే పలుక లేని పరమతుచ్ఛగర్వభావుండు భక్తు డగునా? మాటలాడ వేమి? ఏల యాతండు మనల నాశీర్వదింపలేదు?

మధు—అతని నేమియు ననకుము. అతండు మహాభక్తుండు. ప్రపన్నా గ్రేసరుండు. ఏపుణ్యకార్యమైనను ఫలమును గోరి చేయంగూడ దని పెద్దలు చెప్పుదురు. మన మాతని కొనర్చిన నమస్కారము తన్మంగలానుశాసనప్రతిఫలాపేక్షచేం జేయంబడినది కా దని యాతం డెఱింగి యాశీర్వదింపలేదు; సరేనా?

దేవ—ఎంత చతురవు! ఫలాపేక్షచే మనము నమస్కరింపంగూడదు. కాని యాతం డాశీర్వదింపంగూడదా? అతని కేమిప్రత్యవాయము?

మధు—అదిగాక శ్రీరంగపాదభక్తపరవశుండై మాలాకైంకర్యో త్సాహమున ద్రావిడప్రబంధమును బఠించుచుం బోవుచున్న యాతండు మనల నెట్లాశీర్వదించును?

దేవ—నోరు ఏనిచేయుచున్నది కాన నాశీర్వదింపలే దందువా? నమ స్కారాంగీకారసూచకముగం దల నింత వంచరాదా? చేయి నింత యెత్తరాదా? పోసీ! కన్నులచూపైన నే గంగలోం బడెను?

మధు—భక్తిపారవశ్యమున నున్నాం డని చెప్పలేదా! ప్రపంచమునకే పరాఙ్ముఖుండైన భక్తుండు మనలం జూడ లే దందు వేల?

దేవ—ప్రసవమాలను గూర్చుటకుం బారవశ్యము లేదేమి? పాశుర మును బఠించుటకుం బారవశ్యము లే దేమి? పాదచారమునకుం బారవశ్యము లే దేమి? భక్తుండు కాంబోలు నను వెఱ్ఱిచే బానిసనై

మ్రొక్కిన నా ప్రణామమును ప్రతిగ్రహించుటకు మాత్రమే యీ పారవశ్యము బయలు దేరినదా?

మధు—భగవత్కైంకర్యసాధక కార్యములందుఁ దదేకలగ్నతయే పారవశ్యము. అట్టి తదేకలగ్నతచేతనే యితరకార్యవైముఖ్యము సిద్ధించును. ఇట్టిస్థితి పారవశ్యమే కాదందు వేమి?

దేవ—పారవశ్యము కాదు. పాషండత్వము—ప్రబలగర్వభూయిష్ఠత—పరనిందా ప్రవీణత—కన్ను లున్న గ్రుడ్డితనము—చెవు లున్న బధిరత్వము—నో రున్న మూకత్వము—ఒడ లెఱిఁగిన పరవశత్వము—డంబాచారము తోడి విరాగత—మతి యున్న పిచ్చి.

మధు—అట్లు లెంతమాత్ర మనఁగూడదు. తలఁపఁగూడదు. ఆతఁడు యథార్థభక్తుఁడు. నమస్కరించిన పుణ్యము బుగ్గి యగుటయే కాక నీఁదుమిక్కిలి భాగవతాపచారమహాదుష్కృతము గూడ మెడకు జుట్టుకొననై యున్నదా? ఆతని నట్టులు తూల నాడఁ దగునా?

దేవ—అట్లు తూలనాడుట తప్పనుచుంటివా? పోనీ! ఆతఁడుమృతుఁడు! మొఱఁడు! మొద్దు! కొయ్య! పాషాణము! ఈసారి సరియేనా?

మధు—ఔను. ఆతఁడు మృతుఁడే! ప్రపంచమునకు—ఆతఁడు మొఱఁడే! సుఖదుఃఖములకు—ఆతఁడు మొద్దే! ఇంద్రియములయూఁపులాటకు—ఆతఁడు కొయ్యయే! శ్రీరంగనామసంకీర్తనేతర గాథాశ్రవణమునకు—ఆతఁడు పాషాణమే! పరవనితాపాంగ మహిమకు—

దేవ—ఆహా! మింటిపై నెగిరిపోవుమాటలను జెప్పుచున్నావు. పరవనితాకటాక్షముమాట తరువాతఁ జూడవచ్చును. మొదట స్వవనితాకటాక్షపాళికైన గరగువాఁడేనా? అక్కడఁ గూడ కాఱుతాయియేనా? ఏమో! భార్యను జక్కబెట్టలేక భాగవతోత్తముఁ డైనాఁడేమో? రక్తిలోని కెక్కుటకు శక్తిచాలక భక్తిలోఁ బడెనేమో? ప్రపంచమునఁ గనఁబడు బోడిబుఱ్ఱల

బాపనయ్యలు, తాళపుఁజిప్పలదాసులు, కాళ్ళగజ్జెలభక్తులు తలఁచుకఁ గొలుకరానికొయ్యలగు భార్యలలోపలి వెలుపలిఁగాక కాఁగలేక లోకాతీతులైనవారే, లే!

మధు—ఎందుల కూరక పుణ్యలోకము నంతను దూషింతువు!

దేవ—భూషించి మహాపుణ్యము నీవు కట్టుకొందువు కాని, ముందది చెప్పుము. ఈతఁ డీవనమున వనితతోడనే యుండెనా?

మధు—ప్రస్తుత మిద్దఱు వనితలతో నున్నాఁడు.

దేవ—పరిహాస మేల? ఈతనిభార్య యెవతె? ఎచ్చట నున్నది?

మధు—ఈతఁడు బ్రహ్మచారి. ఎఱుఁగవా?

దేవ—ఆలాగా? బ్రహ్మచారియా? ఆఁ! అందుపైఁ బడుచువాఁడా? దానిపై బలాఢ్యుఁడా? ఆటుపై శ్రీరంగదేవోచితచిత్రాన్న దధ్యోదన మాషఖండాపూపాది మృష్టాన్న భోజనప్రియుఁడా? ఆపైఁ బ్రసవవనవిహారలోలుఁడా? అందుపై భక్తుఁడా? మఱి యందుపై భాగవతోత్తముఁడా? మఱి యింక నందుపైఁ బ్రమదాపరాఙ్ముఖుఁడా? ఆహా! బాగుగ నున్నది!

మధు—అంత హేళనముగ నందు వేమి?

దేవ—ఇఁకఁ బడుచుబ్రహ్మచారిభక్తుని బ్రదుకు కడతేరినట్లే!

మధు—దుఃఖపూర్ణప్రపంచసంబంధ మగు బ్రతుకు కడ తేరుటచేతనే భక్తుఁ డయ్యెను.

దేవ—భక్తుఁ డయ్యెనా? ఆఁ! నీకు మతిపోయెనా యేమి? నీవు ప్రపంచాతీతవై తివా యేమి? నీవు యుక్తాయుక్తవిమర్శనాదూరవై తివా యేమి? భక్తుఁడు భక్తుఁడనెద వేమి? ఎవఁడా భక్తుఁడు? ఎవని కా భక్తి! ఎక్కడ నాభక్తి! చందనాదిచర్చల ధరించి పూలదండలు మెడ మునుఁగఁ బూని, దివ్యములగు పీతాంబరములఁ గట్టి, కస్తూరీఘనసారకుంకుమపుష్పవాసనలచే గమగమలాడుచుఁ జెన్నంగికొబ్బరికాయయంత శిఖ గన్నేరు పూలమాలతో వెన్నున నసియాడుచుండ, నిగనిగలాడుచుఁ జేవలు

దేలుచు, గుమ్మడిగింజవలె, పనసపిక్కవలె, తాండ్రబెత్తునవలె, పందికొక్కువలె, పోతువలె గాలుకొని యొడలు పొగరుపొగలు గ్రిక్కుచు సందులేక పెటపెట లాడుచుం, గన్నెలికపుం బెండ్లి కొడుకుల గురువుగఁ బ్రకాశించు నీతని భక్తుం డనెద వేమి? జితేంద్రియుం డనెద వేమి? సర్వసంగపరిత్యాగి యనెద వేమి?

మధు__రంగరంగా! ఎట్టి దురాలాపము లాడుచున్నావు. శ్రీరంగదేవుని నిర్మాల్యము లగు పూలమాలలు మహాభక్తిచే ధరించిన యితఁడు శృంగారలోలుం డగునా? శ్రీరంగప్రసాద మగు చందన శ్రీపాదరేణువులనుమహానందమున దనివి తీఱక యొడలంతం బూసికొనిన యీతఁడు విటాధముం డగునా? 'నిగనిగలాడుచుం జేవలు దేలుచు' నని యేమేమో చెప్పితివే. సాంసారికదుఃఖదూరతచే, శ్రీరంగదేవదర్శనానంద మహిమచే, సత్త్వసంపన్నతచే, భక్తియోగప్రభావముచే, సూర్ధ్వరేతస్కతచే, బ్రహ్మతేజస్సంపన్నతచే ధగధగ లాడుచు దుర్నిరీక్ష్యుండై నిండుగ వెలుగుచున్నవాఁడు! పందివలె నుండెనా? దున్నపోతువలె నుండెనా? రంగరంగరంగా! కన్నెలికముల పెండ్లికొడుకువలె నుండెనా?

దేవ__వలె నుండుటయే కాదు. వానినె త్రిప్పె దాటిపోయిన ట్లున్నాఁడు. ఈతని జెటిపిన నట్టిచవుటి పెద్దమ్మ లార్గు ఉగునుదు.

మధు__వాచాదోషము లేల? చాలును! భక్తుం డేమిటి? చెడుట యేమిటి! విటుం డగుట యేమిటి?

దేవ__వెడక__యీతనిభక్తి నిలుచునా? పడుచుందన మెక్కడ? భక్తి యెక్కడ? ప్రపంచసుఖవిరాగికిఁగదా భక్తి యుదయింపవలసినది. అనుభవించి యనుభవించి యేవపడినవానికిఁగదా వైరాగ్యము లభింపవలసినది. రాగమునఁ గొంతకాలము వన్నెలవిసలు కట్టువలె తళుకుతళుకులాడుచు నూఁగులాడి, యెండలోని సీతాకోకచిలుకవలెఁ గనఁబడినపుష్పవతి యగు కొమ్మపై కి మకరంద పానాపేక్ష నెగిరి యెగిరి, యెదవోయిన గిత్తవలె స్త్రీల వెంబడి

ఊంకెలు వేయుచుఁ గెవ్వుమనుచుఁ గాండ్రించుచు దిరిగి తిరిగి విరహశృంగారమునఁ బామువలె బుసకొట్టి క్షయరోగివలె, దిక్కులేనివలె సగ్గు, దైన్యపడి, యేడ్చి యేడ్చి, చోరునివలె గోడలు దాఁటి, కాళ్లు విఱుగఁబడి, రోగములఁబడి శక్తు లుడిగి, శాంతి బడినప్పుడుగదా విరాగ ముదయింపవలసినది ! కొంతకాలము స్త్రీల కొప్పులలోఁ బూలు ముడిచినసిమ్మటఁ గదా, శ్రీరంగదేవునిశిరముపైఁ బూలుంచుట! కొంతకాలము స్త్రీ కపోలములపైఁ బూచికపుల్లతో మకరికాపత్త్రములు వ్రాసివ్రాసి, తుడిచి తుడిచి, యూఁది యూఁది, మఱల వ్రాసి వ్రాసి చేతులు నొప్పులు పెట్టినతరువాతఁగదా, గంటముతోఁ ద్రాటాకుపైఁ బాశురములో, భగవత్కీర్తనములో వ్రాయుట ! కొంతకాలము కాంతల పసుపులత్తుక కస్తూరితో నొడలంత పెద్దపులివేషము నకువలె వింతవింతరంగులై త్రేలుకచ్చులోఁకవలె జీరాడ వెఱ్ఱి వెఱ్ఱియాటలాడినతరువాఁతగదా, యూరంగులు తుడుచుకొని విభూతి రేఖలో, ద్వాదశోర్ధ్వపుండ్రములో ధరించి నెత్తిమీఁది కుళ్లాయిలను గోముఖములుగఁ జేసికొని జపించుట! కొంతకాల మధరపానము చేసినతరువాతఁగదా, శ్రీపాదతీర్థపానము! కొంత కాలము జుట్టు పైరు దిరిగి నభోదర్శనము చేసినతరువాతగదా, శిరోముండనమో, లేక జటాధారణమో ! స్త్రీపాదదాసుఁడై కొంతకాలము పరిచర్య చేసినసిమ్మటఁగదా, శ్రీరంగదాసుఁ డగుట! ఇట్లుగాక——

మధు——ఏమి ! నీ సంభాషణమునఁ జెవులు గుయ్యి మనుచున్నవి. నీ యభిప్రాయ మేమోకూడ బోధింపకున్నది.

దేవ——అట్లయిన స్పష్టముగఁ జెప్పెదను, వినుము. భక్తికిఁ బడుచుఁ దనము చుక్కయెదురు. రక్తపువేఁడియున్న దేహములో భక్తి మొలక లెత్తదు. కాదాచిత్కముగ మొలచినను వెంటనే పిట్టతలలు వైచి మెలికలుబడి మాడును భక్తి బంగాళాదుంప

వలె శీతప్రదేశమునఁగాని వృద్ధిపొందదు. ఇంక స్పష్టముగఁ జెప్పలేదా? పండ్లూడినఁగాని భక్తి బయలుదేరదు. తలవెండ్రు కలు పండినఁగాని భక్తి చిగుర్పదు. నడుము వంగినఁగాని భక్తి లేవదు. దేహము క్షయించినఁగాని భక్తి వృద్ధిపొందదు. చూచితివా? మన అమ్మ ధరించిన తులసిపూసలమాలను, మనము ధరింతుమా? ఆమె శ్రీరంగనామస్మరణము మన కున్నదా?

మధు—నీయూహము కేవల మసత్యము. నీవు వెఱ్ఱిపడుచున్నావు. భక్తి మొదట యదృచ్ఛచే, ననఁగ, దైవేచ్ఛచేఁ బూర్వపుణ్యము ననుసరించి కలుగును. సత్సహవాసాదులవలన వృద్ధిపొందును. బాల్యయౌవనాదు లందులకుఁ గారణములు గావు. వార్ధకమే భక్త్యంకురవృద్ధులకుఁ బ్రధానకాల మని నీవు చెప్పితివి. ఇది కేవల మసందర్భ మగు మాట! సుఖానుభవసాధనములు తగ్గినకొలఁది సుఖవాంఛ హెచ్చగును. శక్తు లుడిగిన కొలఁది వృద్ధి యగునది యాత్మచింత కాదు—ఆశ. నపుంసకుఁడు భక్తాగ్రగణ్యుఁ డగు నని నీ యభిప్రాయము. వాఁ డతి దుర్గోటునికంటెఁ దుచ్ఛతరవాంఛాలంపటతాతిపంకిలాత్ముఁడు. పండ్లున్నవాఁడు తననోటిలో నేదైన నున్నప్పుడు చప్పరించును, గాని పండ్లు లేనివాఁడు రేయింబగళ్ళు సర్వావస్థలయందు నొక్కటే చప్పరింపు. మన యమ్మ యేమో భక్తురా లను చున్నావు. ఆమె కున్నంత ధనాశ మనకు లేదు. ఆమె కున్నంత చావుభయము మనకు లేదు. స్వోత్కృష్టులయందలి యను రాగమే భక్తి. అనురాగ మనునది సర్వమనశ్శక్తులతో వార్ధకమున నశింపకమానదు. పడుచుఁదనమే యందుచేత భక్తికిఁ గొంత ప్రధానకాల మని చెప్పవచ్చును. అందుకు బ్రహ్లాదాదులు సాక్షులు.

దేవ—ఆఁ! వార్ధకమున భక్తులైనవా రెవ్వరు లేరా?

మధు—ఉండిన నుండవచ్చును. వార్ధకముచే మాత్రమైనవారు కాగ, దైవేచ్ఛచేత. పడుచుందనమున భక్తుఁడగువాఁడుమాత్రము పడుచుందనముచే నయ్యెనా? పడుచుందనముచేఁ జెడునా?

దేవ—అబ్బబ్బ! దైవేచ్ఛ యని నీకు నాకుఁగూడ నర్థము తెలియని మాట నొకదానిని చెప్పినావు. కాలభేదము లేకుండ దైవేచ్ఛచేతనే యుదయించు నట్టివి. సరే—భక్తి చెడుటకూడ దైవేచ్ఛచేతనే చెడునా?

మధు—పూర్వజన్మ ప్రారబ్ధముచేత—

దేవ—అంతకంటె నర్థము తెలియని మఱియొకమాట చెప్పుచున్నావు. నీవు చెప్పిన రెండునుగూడఁ గారణములు గావు. భక్తి యుదయించుటకుఁగాని, చెడుటకుఁగాని మనబుద్ధియే కారణము. మనబుద్ధి చిన్నతనమునఁ గొట్లపిండెవలె మిగుల వంకలు గలిగి యుండును. భవభారము దిగలాగినకొలఁది తిన్నఁబడును. అప్పుడు పరిపక్వస్థితి నొందును. ఇన్నిమాట లేల? నే నిప్పుడు నీకు నా మతమును నిదర్శనముగ శిలాశాసనముగఁ జేయఁ దలఁచినాను.

మధు—అ దేమిటి?

దేవ—ఈ బాపనబిచ్చగానిమూలముననేగదా నీకు నాకు గ్రుడ్లెఱ్ఱ పఱకు వచ్చినది. దైవేచ్ఛచేఁగదా యీతఁడు పడుచుందనమున భక్తుఁ డయ్యె నని చెప్పితివి. నా యిచ్ఛచేత నీతనిని నెట్టిభ్రష్టుని జేసెదనో చూడుము. దేవదేవభక్తుఁ డని నీచేఁ గొనియాడఁబడిన, వానిని దేవదేవీపాదదాసునిగఁ జేయుదునో, లేదో చూడుము నా చమత్కారము.

మధు—చాలుఁ జాలు! ఇంతవఱకే యాలస్యమైనది. ఇంటికిఁ బోవుదము రమ్ము.

దేవ—అదిగో! తిరిగిపోవుచున్నావు. నీమాటపైని నీవు నిలువక తప్పదు.

మధు—చీచీ ! అయోగ్యపుఁదలంపులుకూడ మహా పాపప్రదములు. చాలులే. ఇంటికి రా!

దేవ—నీ వొక్కపనిఁ జేసిన నే నింటికి వచ్చెదను.

మధు—ఏ దది ?

దేవ—"ఈతని భక్తి దొంగభక్తి. ఇతఁడు దేవదేవీవిలాసాదులకు వశ్యుఁడై భక్తిభ్రష్టుఁడు కాఁగలఁడు" అనుము.

మధు—నాజిహ్వఁ గోసిన నే నామాట ననుదాసను గాను.

దేవ—జిహ్వఁ గోసినఁగాని నీ వనలేనిమాటను, నేను నాజిహ్వచమత్కారమున నిదర్శనముగఁ జేసెదను, చూచుకో—

మధు—జిహ్వచమత్కారములే నిదర్శనము గావలయును గాని క్రియలు గావు.

దేవ—అలా గేమి? నే నీతని భ్రష్టుని జేసి క్రొంతినివలె వేశ్యావీధి నాడింపక పోయినయెడల నా వేశ్యావృత్తి వదలుకొని నీకు మరణపర్యంతమును దాస్యము చేయుదును. అట్లు చేసినయెడల నీవు నా కట్లాచరింతువా ?

మధు—చెల్లెలా! నీ కేమి మతిపోయినదా యేమి? వసిష్ఠ విశ్వామిత్రులు పోరాడి హరిశ్చంద్రుని బాధించినట్లు మన మీాతనికిఁ జిక్కులు గలుగఁజేయ నుంటిమా? పాప మింక వేశ్యే మాటఁగట్టుకొన నక్కఱలేదు.

దేవ—అక్కా ! నాతో నింక నేమియుఁ జెప్పకుము. ఈతఁడు యథార్థ భక్తుఁ డని నీకు నమ్మకము పూర్ణముగ నున్నయెడల నాపన్నిదమున కంగీకరింపుము.

మధు—నా కా విషయమున నీ నమ్మకముకంటె సంపూర్ణమైన నమ్మక మున్నది.

దేవ—అట్లయైనఁ బన్నిదమున కొప్పుకొంటివి?

మధు—ఊఁ !

దేవ—'ఊఁ!' కాదు, ఒప్పుకొంటి ననుము.

మధు—ఒప్పుకొంటిని. మన దాస్యమునకు మరణపర్యంతము మితి యున్నట్లే! ఈతని భ్రష్టునిగఁ జేయుటకుఁ గూడ మరణపర్యంతమే మితియా యేమి?

దేవ—ఎంతపరిహాసము? ఒక్కమాసము మితి.

మధు—ఒక్కమాసము కాదు. ఆఱుమాసము లిచ్చితిని.

దేవ—అక్కఱ లేదు.

మధు—అక్కఱ లేకపోవుట కాదు. పందె మంతయు నీవు వచించితివి కద! అందులకు నే నంగీకరించితిని గద! ఈ మితిమాత్రము నేను వచించినది కావున నీ వంగీకరింపుము.

దేవ—సరే! ఇఁక నీవు నీదారిని బొమ్ము.

మధు—నీ విచ్చటనే యుండి యిప్పు డేమి చేయుదువు?

దేవ—నాపాటు లేవో నే నింకఁ జూచుకొందును. నీవు పొమ్ము. దయ యుంచుము.

మధు—ఈ బ్రాహ్మణునకు దూరమునుండి నమస్కరించి యింటికిఁ బోవుద మనిన వినకపోయితివి. అది యింత ముప్పునకుఁ గారణమయ్యెను.

దేవ—నేనే గెలిచితినేని యింతనిశ్చలుఁడైనవానిని దేవదేవి యిట్లు యూఁటాడించె నని లోకమందు నా ప్రఖ్యాతి వెల్లడి యగును. లేదా, అక్కగారిపాదము లొత్తుచుఁ గాలక్షేపము చేసెదను. ఇందున ముప్పే మున్నది?

మధు—నీవు గెలిచినప్పుడు గలుగుప్రఖ్యాతికై యిప్పుడు సంతోషించు చుంటివి కాని, అక్కగారిచేతఁ గాళులు పట్టించుకొన వలసి వచ్చుటకు విచారించుచున్నట్లు కనఁబడుట లేదు.

దేవ—అట్టియవస్థ యెన్నఁటికి సిద్ధింప దనియేకదా నీ నమ్మకము! నీకు భక్తుని నిశ్చలత్వ మొక్కసాహాయ్య మున్నది. దైవేచ్ఛ యొకసాహాయ్య మున్నది. పూర్వజన్మపుణ్య మను మఱియొక్క సాహాయ్య మున్నది. నా కన్ను ముక్కు తీరు, వాణి తప్ప

నా కేమున్నది? ఆలస్యమగుచున్న దని యిదివరకే మున్నిమాటలో యంటివి. పొమ్ము. దయ యుంచుము.

మధు—సరే. పోక తప్పునా? ని న్నెప్పుడు తిరిగి చూతును?

దేవ—నన్ను, నీమఱుఁదిని గూడ వేశ్యావీథిలో నాటుమానముల లోఁపునఁ జూతువు.

మధు—ఏమో! నీ కొక్కటే పట్టుదల! లేనిపోని యీగొడవ యంతయు నెందులకు?

దేవ—నాయం దింత దయయుంచి పొమ్ము.

మధు—సరే. అప్పు డప్పుడు క్షేమవార్తను దెలుపుచుందువు గాదా?

దేవ—సరే—

మధు—నేఁ బోయెదను (నిష్క్రమించును.)

దేవ—ఏమి చేయుటకు నేమియుఁ దోఁచకున్నది. అయిన నుచితవేషమున రేపటి యుదయమున విప్రనారాయణుని సేవింపఁ బోయెదను.

(నిష్క్రమించును.)

ఇది ప్రథమాంకము.

శ్రీ

విప్రనారాయణచరిత్రము

ద్వితీయాంకము

ప్రదేశము—విప్రనారాయణుని పుష్పారామము.

(ప్రవేశము—విప్రనారాయణుఁడు, శ్రీనివాసుఁడు.)

విప్ర—రంగా! రంగా! రంగ రంగ రంగా! రంగా!

శ్రీని—దేవరవారికి నట్టి చింత మానుదురుగాక! తత్సంబంధము లగు నన్ని చింత లవశ్యము మానుదురుగాక!

విప్ర—రంగరంగా! ఎంతమాట నుడితివి! శ్రీరంగనామస్మరణమే యింక మానవా? శ్రీరంగనివాసమే యింక మానవా? పుష్పమాలాకైంకర్యమే యింక మానవా? శ్రీరంగదేవదివ్యపదారవిందదర్శనమే యింక మానవా? శ్రీరంగేశ్వరనిర్మాల్యాఘ్రాణమే యింక మానవా? తిరుకావేరీతీర్థపానమే యింక మానవా? ద్వాదశోర్ధ్వపుండ్రములే తుడిచివైచుకొందునా? రంగభక్తి నింక గంగాప్రవేశము సేయనా? బ్రహ్మచర్యవ్రతమును దగులఁబెట్టనా? గజ్జెలు వదలి స్త్రీకటాక్షమాలికాశృంఖలలు కాళ్ళకుఁ దగిలించుకొందునా? వింజామరను వదలి పైఁటచేఁగు చేతఁ బుచ్చుకొని వేశ్యాకపోలఫలకస్థలవిలసితఘర్మవారి నపనయింపనా? రంగ రంగ రంగా! (ఏడ్చును)

దేవ—(యోగినివేషముతో ప్రవేశించి) తథాస్తు. నాచే ముందు గాఁ దగినకార్య మిప్పుడు గజ్జెలు కట్టుకొని యీతనినోటఁ దాండవించుచున్నది. వీ రింక నిక్కడ నేమిమాట లాడుకొందురో విందును.

శ్రీని—అడిగియేని విన్నపమును దేవరవారు మనఃపూర్వకముగఁ జిత్తగింపలేదు.

విప్ర—నీమాట నాకు బాగుగ బోధము కాలే దందువా? గురుని వాగ్వైఖరి శిష్యునికి బోధింపకపోవుట యొకప్పుడు సహజము. గాని యిది యేమి! ఇట్టి విపరీతము! ఇట్టి విపర్యయము! నా బ్రతుకు కిటు తలక్రిం దగునా?

శ్రీని—స్వామీ! దాసు నొకమాఱు కటాక్షింపుము.

విప్ర—నే నొకని గటాక్షించుశక్తి గలవాఁడను గాను. నాకు శ్రీరంగ దేవకటాక్షము కావలయును. అందుకొఱకుఁ బుట్టితిని. అందు కొఱకు బ్రతుకుచుంటిని. దానితోడనే చావవలయును. రంగ రంగ రంగా! (దుఃఖించును.)

శ్రీని—నిత్యభక్తి యోగప్రపూర్ణు లగు దేవరకుఁ గూడ భగవత్కటాక్ష లోపము గలుగునా?

విప్ర—కలుగనే కలిగినది. సంతతమందహాససుందరవదనారవిందదివ్య సందర్శనప్రదాత యగు నాముద్దులరంగఁడు, నాకస్తూరిరంగఁడు నేఁ డేమో నా కప్రసన్నముఖుఁడై యుండుటయే కాక కించి త్కోపావేశవికటీకృతనిటలతటుఁడై యుండె నని నేను నీతో నిదివఱ కెన్నిసారులు చెప్పుకొని యేడ్చితిని? ఇంకను—

శ్రీని—అదిగో! ఆ చింతసే మానుకొనుఁ డని నే నిదివఱకు విజ్ఞాపనముఁ జేసికొనఁగ మీ రన్యథాభావించి యిట్టిదుఃఖాధికతను బొందినారు.

విప్ర—ఆ చింతను మానుకొననా? నాతర మగునా? మానుకొని నేను చేయవలసిన దేమి? రంగా! రంగ రంగా!

ఆ॥ వె॥ తల్లి లేదు; లేఁదు ♦ తండ్రి; భ్రాతలు లేరు;
లేమ లేదు; గృహము ♦ లేదు; నీవు
దక్క, నెదియు లేదు; ♦ దాసుని గోపింప
నేది దిక్కు? రంగ! ♦ ఎట్టు లుందు?

దేవ—(జనాంతికముగ) నీకు లేమ లే దనుకొన నక్కఱలేదు. ఇదిగో! ఇచ్చట నీకొఱకే వచ్చియున్నది. నీ కమ్మ లేకపోయిన నత్త యున్నది. భ్రాతలు లేకపోయిన బావ లున్నారు. ఇ ల్లున్నది. ఇచ్చి పుచ్చుకొనుట లున్నవి. మడి యున్నది. మాన్య మున్నది. సొంత వ్యవసాయ మున్నది. అన్నియు నున్నవి. నీకు బుద్ధి మాత్ర ముండవలయును. అనఁగ—లేకుండవలయును.

విప్ర—నాకు బుద్ధి లేదు. మనసు కుదురు లేదు. భక్తి లేదు. రంగా! రంగా! నీ వెట్లు ప్రసన్నుఁడ వగుదువు? ఏమి చేయుదును?

దేవ—(జనాంతికముగ) ఏమి చేయుదువా? తెగి పడి భోగముపైకి కష్టపడుము.

శ్రీని—దేవా! భక్తి నిలువఁబడుట కొకమార్గ మున్న దని నేను తలఁచెదను.

విప్ర—ఆలాగా! చెప్ప వేమి?

శ్రీని—గంజాయి చిలుములో నుంచి కాల్చినయెడల—

దేవ—(జనాంతికముగ) శ్రీనివాసా! గంజాయి ధూమపత్రము కాని భక్తిపత్త్రము కాదు. భక్తిని గుదుర్చుపత్త్ర మే దనఁగ— తీర్చలేని ఋణపత్త్రము!

విప్ర—(పరధ్యానముగ) రంగ రంగ రంగా! ఏ మంటివి?

శ్రీని—ఇంత తులసీవనముతోఁ బ్రయోజన మేమి? ఇది కొంత పెఱికివైచి గంజాయి మొక్కలు నాఁటి పెంచిన యెడల—

విప్ర—హా! రంగ రంగా! ఎంత విపరీతముగఁ జెప్పుచుంటివి?

గీ॥ పల్లవితకుసుమితపూత♦వనమునందుఁ
దులసి నున్మూలన మొనర్చి ♦ ధూమ్రపత్త్ర
వృద్ధిఁ జేయింపు మంటివో! ♦ హృదిని విష్ణు
భక్తి విడిచి వేశ్యారక్తిఁ ♦ బడయునట్లు.

దేవ—(జనాంతికముగ) సెబాస్! ఓటి పలుకు లారంభ మైనవి. విటుఁగఁ దలఁచినకట్టె ముందు పెటపెటలాడుట సహజమే కాదా!

విప్ర—గీ॥ చల్లనికటాక్షములఁ జల్లు ♦ జలజభవను
జల్ల నగు వనమాలను ♦ సరసహృదయు
మందుఁ గలుగు రంగేశ! నా♦యందు నీకుఁ
దీక్ష్ణభావంబు తగునయ్య ♦ దేవ దేవ!

శ్రీని—తీక్ష్ణభావ మా మహామహుఁడు వహించినట్లు మీరు భ్రమపడు చున్నారు! ఆయన తిరుమొగమును మీరు బాగుగఁ జూచి నారో లేదో! అప్పుడు దీపపుఁ గ్రీనీడ గాని, మఱియేదైనఁ గాని త న్ముఖమండలప్రసన్నతను దగ్గింప నట్టి వికాసశూన్యతి మీభ క్తిలోపమునఁ గలిగిన దని భావించి పరితపింపవచ్చునా? అదిగాక, మీ భ క్తి కిప్పుడు లోప మేమి కలిగెను? వ్రాసెడు పాశురములు వ్రాయుచునే యున్నారు. గ్రుచ్చెడుపూలు గ్రుచ్చు చునే యున్నారు. వాయించెడు తాళములు వాయించుచునే యున్నారు. త్రొక్కెడు నాట్యములు త్రొక్కుచునే యున్నారు. చేసెడు స్మరణములు చేయుచునే యున్నారు.

దేవ—(జనాంతికముగ) తిట్టుకొన్న తిట్టులు తిట్టుకొనుచునే యున్నారు. పెట్టిన పట్టెనామములు పెట్టుకొనుచునే యున్నారు. పూసిన గంధము పూయుచునే యున్నారు. పుచ్చుకొనుతీర్థము పుచ్చు కొనుచునే యున్నారు. త్రాగినకూడక్ త్రాగుచునే యున్నారు. మ్రింగెడు చిత్రాన్నము మ్రింగుచునే యున్నారు. నమలెడు వడలు నమలుచునే యున్నారు. త్రేఁచినత్రేఁపులు త్రేఁచు చునే యున్నారు. ఏడిచిన యేడుపు లేడ్చుచునే యున్నారు.

విప్ర—రంగరంగరంగా! రంగా!

దేవ—(బిగ్గఱగ) రంగరంగరంగా! రంగా!

శ్రీని—అది యేమి! మఱియొక శ్రీరంగభ క్త శిఖామణి యీసమీపమునఁ జేరిన ట్లున్నది!

విప్ర—రంగరంగా! భ క్తిశూన్యముగ నావలెనే కేవలము ధ్వని గలు గుటకు మాత్రమే "రంగరంగా" యని యఱచు నే చిలుకయో

గోరువంకయో కాక, ఈ పాపాత్ముని దరిఁ జేరుటకు భక్తశిఖామణికూడ వచ్చునా! రంగరంగరంగా!

దేవ—రంగరంగరంగా! (దరిఁ జేరఁబోవును.)

శ్రీని—దేవరవా రట్లు కటాక్షింపఁదగుదురు.

సీ॥ పావనతులసికా • పద్మబీజస్తోమ
రచితమాలలు మెడఁ • గ్రాలుచుండఁ
దీరుగా దిద్దిన • తిరుమణి తిరుచూర్ణ
తిలకంబు దివ్యదీ • ధితుల నీన
నీరెండతీరుండు • నీర్కావికాషాయ
తళతళల్ తనువంత • నలమికొనఁగ
రమ్యనాదముతోడ • రంగనామముఁ బల్క
మురళిగానమురీతి • మురువుకొలుప
గుటక లొదవించు చిత్రాన్న • ఘుటికవంటి
వర్ణమును గల్గి వెన్నయ • ప్పమును బోలె
మెత్తనై బోడిదౌ రాగి • మిళ్లిచెంబు
చేతఁ గ్రాలంగ నదిగో! వేం • చేయు నొకతె.

విప్ర—(లేచుచున్నాఁడు.)

దేవ—దాసురాలి ప్రణామ మంగీకరింపవలయును. (సాష్టాంగపడును.)

విప్ర—(సాష్టాంగమును జేయుచు) సర్వాపరాధిని! దాసోహం, దాసానుదాసోహం!

శ్రీని—(తనలో) ఈమెకు నమస్కరించుటకు నాకు బుద్ధి పుట్టకున్నది. అయిన నేమి? గురువుగారు సాష్టాంగపడినతరువాత నే నూరకుండఁ దగదు. (ప్రకాశముగ) దాసోహం!

విప్ర—దయచేయుఁడు.

దేవ—అట్లు కాదు. మీరే ముందు చేయుఁడు.

విప్ర—అదేమి మాట! దేవివారు దయచేయుదురుగాక!

దేవ——ఆఁ! ఆఁ! నేను మీపాదసేవకై వచ్చినదానను. నన్ను మీ రట్లు గౌరవింపఁదగదు.

శ్రీని——దేవా! స్త్రీకిఁ దాము సాష్టాంగపడవచ్చునా? అంతులోను శిష్య ఱికమునకై వచ్చినదానికి——

విప్ర——(దేవదేవిచేతులు పట్టుకొని) కూరుచుండుఁడు. కూరుచుండుఁడు. (ఇద్దఱును గూరుచుందురు.) దేవివారి తిరువడిగళ్లవలన నే దేశము పవిత్రమైనది?

శ్రీని——(తనలో) పస్తుత మీ వనదేశము.

దేవ——దానిని గూర్చి తరువాత ముచ్చటింపవచ్చునుగాని——మీ శిష్యుఁ డడిగిన ప్రశ్నమునకు——'శిష్యఱికమునకు వచ్చిన స్త్రీకి సాష్టాంగ మొనర్పవచ్చునా?' యనుదానికిఁ బ్రత్యుత్తరము సాయింపవలయును.

విప్ర——గీ॥ శిష్యు నెపుడు గురుఁడు నిర • సింపఁగూడ,
దాత్మసమునిగ భావింప • నగు; నతండు
తనదు సహాపాఠకునిగాఁగఁ • దలఁపవలయు;
నిద్దఱు స్వగురుశిష్యులం • చెన్న నగును.

గీ॥ గురుని సేవించి తా నేర్చు • కొనిన నాల్గు
ముక్కలు మఱచిపోకుండఁ • బుణ్యమూర్తి
శిష్యుఁడు లభించె నని ప్రీతిఁ • జెంది యతని
నిత్యగౌరవమునను మ • న్నింపవలయు.

శ్రీని——(తనలో) ఇట్టిగౌరవము మాత్రము నాయం దెప్పుఁడును జూపి యుండలేదు.

విప్ర——గీ॥ శిష్యు నాత్మకు భక్తివి • శేష మిచ్చి
పరమదయ దానిఁ బోషింప • గురునిభార;
మధికభక్తిని గురుదేహ • మాచరించి
రక్షణము సేయ శిష్యభా • రమ్మ సుమ్ము.

ఇంకను,

గీ॥ ఇతఁడు బ్రాహ్మణాగ్రేసరుఁ, ♦ డితఁడు మాల,
ఇది పిపీలిక, యిది సింహ, ♦ మితఁడు పురుషుఁ
డిద్ది స్త్రీ యను ప్రభేద ♦ మెఁగయుభక్త
సన్నితో ద్రవ్యభేదము ♦ లైనయట్లు.

గీ॥ వేదవేదాంగ సత్సార♦వేత్తయైన
శాస్త్రషట్క ప్రవీణతా♦జటిలుఁడైన
ద్విజవరుండైన విష్ణుభ♦క్తిరహితుండు
పరమచండాలుకంటెను ♦ బాంసపుండు.

గీ॥ శ్వపచుఁడైనను బశువైనఁ ♦ బక్షికీట
కము లయిన విష్ణుభక్తియు♦క్తము లగునెడ
బ్రాహ్మణోత్తముకంటెను ♦ బరమపూత
జన్మ లగును మోక్షప్రాప్తి♦శక్తిఁ గాంచు.

గీ॥ మోక్షని క్షేప మిడునది ♦ భూతిరేఖ
కాదు, యజ్ఞోపవీతంబు ♦ కాదు, మఱియు
గొరుగుబోడిమీసము గాదు, ♦ గోష్పదంబు
వంటిజుట్టు గా; దుత్తమ♦భక్తి గాని.

వేన—(తనలో) ఇచ్చట సద్వ్రతులను గొంచె మెత్తిపోడుము మన్నాఁడు కాఁబోలును! ఇతని కింక నన్యమతద్వేషము వదలినది కాదు. భక్తిమార్గము లితనికిఁ దెలియునుగాని, యనుభవమున కింక బాగుగ రాలేదు. ఇతఁడు సంసారమును వదలినాఁడు. పై మెట్టుందక యూఁగులాడు చున్నాఁడు. ఇతనిని బడఁద్రోయుట కిది యే సమయము. గచ్చపప్పుఁ దిన్న కాకివలె నాచాకచక్యమున నితఁడు గిరగిరఁ దిరిగి పడవలసినదే. భూతిరేఖ మోక్ష మీయ నపుడు పంగనామము లిచ్చును గాఁబోలు! గోష్పదమంత జుట్టియు లేనప్పుడు గొత్తితలకాయయంత జుట్టిచ్చును గాఁబోలు!

విప్ర—గీ॥ భక్తునకు జాతిలింగవి♦భాగ మిల్ల;
స్నానసంధ్యాదికృతు లవ♦సరము లేదు;

వేదశీర్షికాజ్ఞత యైన • వేదబంబు
పరమభక్తి యొక్కటె ముక్త్యుపాయ మగును.

శ్రీని — దేవరవా రుపన్యసించిన దెంత సమీచీనముగ నున్నను, గొంత పాషండత్వమును వెల్లడించుచున్నది. భక్తి కత్యావశ్యకత నాపాదించుచున్నారు! అదియుఁగూడ సందేహాంశము! భక్తి తప్ప నితరమోక్షోపాయము లేదనుకొనినను దత్సాధనము లైన కర్మజ్ఞానములను నిరసించుచున్నారు. బ్రహ్మసృష్టిలో స్థాపింపఁబడిన వర్ణలింగవిభేదమును నుడిచివైచినారు. బ్రహ్మముఖోద్గీతవేద వేదాంతసారము ను[illegible]న నూదివైచినారు. దేవరవారు మహాభక్తులు. తమ కేమి బాధలేదు. కాని దీనిఁ దగు నడిమేని కొక్కభయముమాత్ర మున్నది.

విప్ర — ఏ దది?

శ్రీని — భక్తి యప్రత్యక్ష మగు వస్తువు. కొలఁదియో గొప్పయో యది లేనివాఁడే లేఁడు కాని, యెంతభక్తి యున్నప్పు డిట్టిమాటలాడవలయునో, యిట్లు లాచరింపవలయునో తెలియదు. భక్తి మా కున్న దని వెల్లడించుచు వేదముల నిరసించి, వేదవిహిత కర్మములను ద్యజించి, వర్ణవిభాగమును భ్రష్టపఱచి, నిరంకుశ మైనట్టియు సుఖతరమార్గ మైనట్టియు నొక యప్రమాణమతమును భవిష్యజ్జనులలోఁ గొందఱేర్పఱచుకొందు రేమో! అట్టి నిషిద్ధమతమునకుఁ దమయుపన్యాసము ప్రాతిపదికముగ నుండు నేమో యని నేను భీతిల్లుచున్నాను.

విప్ర — భక్తి కుదురనివాఁ డెన్ని వేదవిహితకర్మము లాచరించినను వినియోగము లేదు. కుదిరినవాని కంతకంటె వినియోగము లేదు. కాని ప్రస్తుతవృత్తాంతమును వదలి భవిష్యద్బాధ లేల? ఇప్పటికైన నిద్ది స్త్రీ కా దని నీకుఁ దోఁచినట్లే కద!

శ్రీని — తాను స్త్రీనిగానని ఆమె ఒప్పుకొనినను నే నొప్పుకొనను. నాకన్నుల నెక్కడ మాపుకొందును! ప్రకృతి నెట్లు భ్రష్టము సేయఁగలను?

విప్ర—అబ్బ! నీకు నాయభిప్రాయము బోధింప కున్నది. 'ఈమె' యనఁగ నేమి?

శ్రీని—ఇదిగో! దొంగకోళ్ళను బట్టుకొన వేచియుండు నక్కవలె నున్న యీవ్యక్తి—

దేవ—రంగరంగరంగా!

విప్ర—కాదు. ఈమె యనఁగ. కరచరణాదివిశిష్ట మగు నీ రూపము కాదు. నిరవయవనీరూప మగు నాత్మ. దానికి స్త్రీత్వ మున్నదా?

శ్రీని—చూడకుండ నే నెట్లు చెప్పఁగలుగుదును?

విప్ర.—నేను జెప్పుచుంటిని వినుము. ఈమె స్త్రీ కాదు. నేను బురుషుఁడను గాను.

దేవ—(తనలో) ఈతనికి భక్తితోపాటే ప్రారబ్ధముకూడఁ బట్టిన దేమో?

విప్ర—ఇప్పుడు తెలిసినదా?

శ్రీని—(సందేహముగ) ఉ, ఊఁ.

దేవ—తెలిసె నంటివి గదా? నీవు స్త్రీవా? పురుషుఁడవా?

శ్రీని—రెండును.

విప్ర—అ దెట్లు?

శ్రీని—పురుషులయొద్ద స్త్రీని, స్త్రీలయొద్ద పురుషుఁడను.

విప్ర—సరే, సరే! ఎట్టులైన స్త్రీపురుషభిన్న మైన తత్త్వమవు. (దేవదేవివంకఁ జూచి) ఇదివరకే దేవివారి క్షేమపరిప్రశ్నమున కాలస్య మైనది. క్షమింపవలయును.

దేవ—ఈ శ్రీరంగపట్టణమునకు సమీపమున నున్న యొకచిన్నపల్లె మానివాసము. నేను జన్మమున వేశ్యను. దేవదేవి నా పేరు.

శ్రీని—వేశ్యవే! ఆఁ! ఆఁ! ఏమి స్వామీ! భాగవతులము— భోగము మేళములో నిఁక గలిసిపోవలసినదేనా?

విప్ర—ఏ మనెనో వింటివా? జన్మమున వేశ్య ననినది. వృత్తమునఁ బరమభాగవతోత్తమురాలు.

శ్రీని——పండ్లాడినతరువాతఁ గాని, వారకాంత భాగవతోత్తమ యగునా? దేవరవారు పరిశీలింపఁదగును.

దేవ——పండ్లు కనఁబడుచునే యుండఁ బరిశీలన మొదలుకు? దేవా! అట్టి పరమతుచ్ఛ వేశ్యాకులమునఁ బుట్టి——

విప్ర——రంగరంగరంగా! ఏ పూర్వజన్మపాపముననో యట్లు సంభవించెను.

శ్రీని——(తనలో) అందుచేతనే మన కిప్పు డిట్లు సంభవించెను.

దేవ——పాపమున శాల్యావస్థలోని గండము లన్నిఁటిని దాఁటి బ్రదికి——

విప్ర——పాపము! రంగ రంగా!

శ్రీని——(తనలో) మనది.

దేవ——మహాపాపమునఁ బెద్దదానవై——

శ్రీని——(తనలో) విటులమహాపుణ్యమున——వైద్యులమహాపుణ్యమున——

దేవ——అంతకంటె నతిఘోర మగు పాపమున నొక్క మర్వెటుని కంటఁ గట్టఁబడితిని.

విప్ర——రంగ రంగ రంగా! వేశ్యలకు స్వచ్ఛందవృత్తి యగునప్పు డొక్కని కని చెప్పితివి. నాకుఁ దెలియలేదు.

శ్రీని——స్వామీ! ఇది యేమి తులసిమాలలోని పూసలను గణించుటా! శ్రీరంగదేవార్పణమునకు గ్రుచ్చెడు పుష్పమాలలోని పుష్పములు గణించుటా! గాయత్రీమంత్రసంఖ్యాగణనమా! ఊరిలోనివేశ్య కెందరు విటులో లెక్కించుట మన కెందుల కయ్యా! స్వామీ! నివృత్తిమార్గమున నుండునరులలో భాగవతోత్తముఁ డెట్లు ప్రప్రథముఁడో ప్రవృత్తిమార్గమునఁ దిరుగువిటులలోఁ గన్నెతి కప్పుఁబెండ్లికొడు కట్లు ప్రప్రథముఁడు. దేవర కిప్పుడు సంశయము వీడినదా?

విప్ర——ఈమె గుణ మెంత స్వచ్ఛమైనదో నీవు పరిశీలింపకుండ మాటాడు చున్నావు.

శ్రీని——ఆమె గుణమునుగూర్చి నేను జెప్పనేలేదు.

దేవ—అటుపైన—.

విప్ర—అటుపైన ననగా - ప్రథమమున నమస్త్రోపదేశ మైనతరువాత—పద్మసాయక బ్రహ్మజిజ్ఞాసాశాస్త్ర ప్రథమ సూత్రపారాయణ మైనతరువాత—అంతే కాదా !

దేవ—(తనలో) వీఁడు గండ్రగుండకోడుకు - యథేష్టవృత్తికి వేశ్యామాత్రవలె నష్టపడుచున్నాఁడు. (ప్రకాశముగ) నాపాప మేమో కాని నామనస్సు ప్రపంచసుఖానురక్తికెక్కక పోవుటచే—

విప్ర—అది పాపము కాదు. పూర్వజన్మమహాపుణ్యము.

దేవ—ఏమి పుణ్యమో నే నెఱుఁగను. స్వామీ ! నేను బడినపాటు లేమి చెప్పుదును ! మాఅమ్మ నాకు సింగారింప—నే నగ లూడఁదీసికొన—ఆమె నాకుఁజుక్కబొట్టు పెట్ట—నేను దుడిచికొని తిరుచూర్ణరేఖ తీర్చుకొన—

విప్ర—చూచితివా ? పుణ్యరాలియలంకారవైరాగ్యము ! ఊర్ధ్వపుండ్రధారణోత్కంఠత ! ఆహా ! రంగ రంగ రంగా ! భక్తి ! భక్తి ! భక్తి వంటిది మఱియొకటి యున్నదా ? వేదవిహితకర్మాచరణ మావశ్యక మంటివే ! జ్ఞాన మావశ్యక మంటివే ! ఇక్కడ నవి యేవియు నక్కఱలేకుండ నిశ్చలభక్తి చిన్నతనముననే యెట్లు కలిగినదో చూడు ! శ్రీరంగమూర్తి నిర్హేతుక జాయమాన కటాక్షవైభవముననే యది కలుగవలయును.

విప్ర—ప్రవృత్తిలోఁ దిరిగి పడకుండ దానిని దుస్సంగశూన్యత్వము చేతనే మనము కాపాడుకొనవలయు నని దేవర యిదివఱకు సాయించినారు.

దేవ—సాయంకాల మగుసరికి, విటాధముల నాకర్షించుటకై, గుమ్మములో నిలువఁబడి తలు పోరఁజేసికొని, రంగుబట్టల పెటపెటలవారు, తాళఁపుగొలుసులగలగలలవారు, కూనిదీర్ఘముల గుయిగుయిలవా రగు. నిర్భాగ్యనిరక్షరకుక్షులు వీథినుండి గొంతుకలు సవరించుకొనుచుఁ బోవుచుండ, నిట్టె ముందునకు నట్టె

వెనుకకు దాఁగుడుమూఁత లాడుమని నన్ను మాయమ్మ
గుమ్మములోనికి గెంట—మొఱ్ఱోయని నేను వెనుకవెనుకకు
నాలో నేను దిట్టుకొనుచుఁ బోవ—

విప్ర—ఆహా! రఁగరఁగరంగా! భక్తమణికిఁ బ్రాపంచికసుఖనిర్బంధ
మెంత మహాకష్టము! భక్తి యుదయించినపిమ్మట నది నిశ్చలముగ
వృద్ధి కావలయునుగాని, తుచ్ఛసుఖనిత్య ప్రోత్సాహము దాని
కెంత యవరోధము గావించునో చెప్పవలయునా? నీవు నిశ్చల
చిత్తవృత్తి గలిగినదాన వగుటచేతనే, నీభక్తి యవ్యాజమైనభక్తి
యగుటచేతనే, నీవు సర్వవిఘ్న చరమశాంతిఁ జేసి, యింత
వఱకుఁ గడతేఱితివి! నీ యవస్థ విన నాకు జాలి యగుచున్నది.

శ్రీని—(తనలో) మీయవస్థఁ జూడ నా కేడ్పు వచ్చుచున్నది.

దేవ—దీపాలు పెట్టిన నాలుగుగడియలకుఁ బశువులసంతకుఁ బైపల్లె
నుంచి వచ్చి పశువుసందర్భము కాకపోవుటచేఁ దిరిగి యింటికిఁ
బోవుటకు వీలులేక మాడుచున్న కడుపుమంటను సెనగపప్పు
బెల్లముచే శాంతిపఱుచుకొని, నిద్రించుటకు దావు దొరుకక,
వీథిలో నడయాడుచున్న యే తలమాసినముండకొడుకో యా
రాత్రి పెండ్లికొడుకుగ దాపురింప—

శ్రీని—సంతలోఁ బశువు దొరుకుట దుర్లభము గాని సానివీథిలో సాని
దొరుక కేమి?

విప్ర—ఎంత కర్మము! రఁగరఁగరఁగా!

దేవ—అట్టి తుచ్ఛరూపస్వభావుఁడు—

శ్రీని—వేశ్యకు వెఱ్ఱిమొగమునిర్భాగ్యులు తప్ప విష్ణుభక్తులు లభింతు
రనుకొంటివా యేమి?

దేవ—(తనలో) అమ్మ! నోటిరొట్టెపుముండకొడుక! (ప్రకాశముగ)
నాచేయి పట్టుకొని గదిలోని కతఁడు లాగ — నేను బంచవల్లీ
లోని కాతని నీడ్వ, నన్నాతఁడు బతిమాలుకొనఁగ, నేను
మొగము విడిపించుగొని ధుమధుమ లాడ, నన్నాతఁడు బెద

రింప, నేను దిట్ట, నాతఁడు నన్ను దురుసులాడ, నే నేడ్వ, నిట్టి ముష్టియుద్ధసంరంభమును మాయమ్మ చూచి నన్నుఁ బడదిట్టి వాఁడు సంతరిన్చిన నీ కుండఁ బోవు నేమో యను రోషముతో నన్ను సున్నపుబిడతతో నెత్తిపైఁ గొట్ట—

విప్ర—ఆఁ! ఆఁ! రంగరంగా! సున్నపుఁబిడత యేల?

శ్రీని—బొప్పికి వేతే సున్నమురాయ నక్కఱలేకుండుటకు—

దేవ—గిలగిల కొట్టుకొని నే నేడ్వ—(ఏడ్చును.)

విప్ర—రంగరంగరంగా! ఏడువకుము. భక్తునినేత్రములవెంట నానంద బాష్పములు వెడలవలయును.

గీ॥ ఇతరసుఖములఁ గోరక ♦ హీనకష్ట
పాలఁ బడి భక్త నిటు వృద్ధి♦పఱచినావు;
కడుపు మండ లోకుల దిట్లఁ ♦ బడుచు నాన
యేమి ధనవృద్ధిఁ జేసెదు ♦ కృపణునట్లు.

దేవ—ఇంటివా రందఱు తల కొకతిట్టుతిట్ట, నిరుగుపొరుగు గుడిసెవేటి పేరటాండ్రు దాడలునొక్కుకొనఁగ.—పిటకాం డ్రందఱు వెక వెకలాడ—బోగమింటిపరువు తీసివైచుటకుఁ బుట్టినదీనికి గరిటెఁ గాల్చి వాతవేయు మని వాదపానలు వైద్యబోధములు సేయ—నంకిలి యేమో యని మాయమ్మ సోదికిఁ బోయి, చేటఁడు త్రాటియాకు తాయెతులు కీలుకీలునకుఁ గట్ట— మంత్రవేత్త లని చెప్పవచ్చిన మోసగాండ్రు నన్ను ముగ్గుల కూర్చుండఁబెట్టి బూడిదతోఁ గలిపిన దూలగొండనూగు నాకుఁ బోసి యేడ్పింప — స్త్రీత్వవృద్ధికై నేరేడుపండ్లంత మాత్రలు నాచే వైద్యులు మ్రింగింప—

శ్రీని—పుంస్త్వవృద్ధికై మదనకామేశ్వరమో మర్దనమో గాని, స్త్రీత్వ వృద్ధికి మం దేల?

విప్ర—రంగరంగా! ఏమి కష్టములు? జనుల కెంత వెట్టి!

గీ॥ అనృతవాదులు సత్యవాఙ్మునని బుద్ధి
హీనుఁడని యతిభయుఁడని యెన్నుచుంద్రు
కులటలు పతివ్రతను వెఱ్ఱిగోల యొంట
రెత్తు చచ్చుపెద్దమ్మని యీసడింత్రు.

గీ॥ అత్యనాచారు లిద్ధనిష్ఠాధికాత్ము
ఛాందసపుముండకొడు కని చాటుచుంద్రు
భవరుజాపీడితులు భక్తవరుని బిత్త
విభ్రమాదభ్రుఁడని బాధఁ బెట్టుచుంద్రు.

గీ॥ తమకుఁ గలవెఱ్ఱి దాఁటిన ధన్యతముని
వెఱ్ఱివానిగ జనులు భావించుచుందు
రట్టివెఱ్ఱి దీఱినవెఱ్ఱి యతఁడు లోకు
లెల్లరును వెఱ్ఱివారని యెంచవలయు.

విప్ర—దేవివారు సాయించు నుపన్యాసమునకు నడ్డు వచ్చితిని. క్షమించి సెలవిచ్చెదరుగాక !

శ్రీని—దేవివారి యుపన్యాసమునకు దేవరవారి యోపికకుఁ గూడ నంతము గానఁబడకున్నది !

విప్ర—శ్రీనివాసా ! అట్టులాడుట న్యాయమా ?

గీ॥ భక్తవృద్ధికై భక్తుఁడు పడెడు పాట్లు
భక్తుఁడు గ్రహింపఁదగుఁగాక పరునితరమె ?
ఘనమహాకావ్యపోషణమునఁ గవి పడు
కష్టమితరుఁ డెఱుంగునే కవియె కాక.

శ్రీని—గప్పు మని యొకసారి మెఱుపు మెఱసినట్లు—పూలు జల్లున నాకస్మికముగఁ జల్లినట్లు—చల్లగా హఠాత్తుగాఁ బన్నీరు చిలికి నట్లు—చందనగంధగంధిలమందమారుత మట్టె వీచినట్లు—సరస సంగీతమాధురీధురీణారావపువిసరు చెవిని బడి హృదయమున దూరినట్లు— సుందరయువతీకుచాగ్రయాంధృచ్ఛికస్పర్శచే నొడలు మనస్సు నాత్మయంతయు నొకమాఱు జలజల మని

నట్లు—ఈ యంశముమాత్ర మడియేనికి దేవరవారి కిప్పటివఱ కననుభూతము. క్షమింపవలయును—నిష్ప్రయత్నముగ, నిరాయాసముగ, నబుద్ధిపూర్వకముగ బయలువెడలినకవిత యానందింపఁజేయునుగాని, గాదెక్రింది పందికొక్కువలె రేయింబగళ్ళు బఱికి బఱికి, పండ్లు గిట్టకఱచుకొనఁజేయునట్లు అంపఁపుకోఁత వలెఁ గోసి కోసి, గ్రుడ్లు నీరుగ్రమ్మ నొక్కొక్కవెంట్రుకను దంటసమునవలెఁ బీఁకి పీఁకి, జనపనారపచ్చడినివలె వెనుకకు ముందునకు నూఱి నూఱినట్లు, కష్టపూర్వకముగ, బలాత్కారముగలాగి లాగి, యీడ్చి యీడ్చి చెప్పి వీథిని బారవైచిన కవిత, వెఱ్ఱికుక్కవలెఁ దోఁకముడిచి, పండ్లిగిలించి, తోఁచక, తావులేక, యందఱిని జూచి తా జడియుచు, నందఱకుఁ దా భయహేయతలను గలిగించుచు, నొకచోట నైన నొక నిముసమైన స్థిమితముగ నిలువఁబడదు నన్న 'ఛీఛీ' యను ధ్వనులచే బెదరి పాఱిపోవుచు, లోకులు నిందించుచున్నా రని యేడ్చుచు, నందులకొఱకు లోకులపైఁ బగఁ దీర్చుకొనఁ గఱువఁ బోవును, నొకనిని జంపుచుఁ దాను దూరఁపువారి ఱాలదెబ్బలను దగ్గరవారికఱ్ఱదెబ్బలను దిని పరమపదించును. భక్తియుఁగూడ నటులే. అది దివ్యతేజమువలె బయలువెడలవలయును. అట్టి యట్టి పూర్వపుణ్యమునఁ బ్రాఁకవలయును. అంతయే కాని పడగానిపాటులఁ బడినంతమాత్రమున నది వృద్ధియగునా? గొప్పుద్రవ్వుట కది యేమి వంగచెట్టా? గసికఁ గొట్టినఁ గాని పక్వము గాకుండుట కది యేమి పనసకాయయా? దంపి, సాగఁ దీసి, లట్టించినఁ గాని భోగ్యము గాకుండుట కది యేమి గోధుమ పిండియా? మహాకష్టములఁ బడి యెట్టులో స్వల్పముగ వృద్ధి చేసికొనుభక్తి నిశ్చలముగమాత్రము నిలువదు. పటక్కులాడి, వగలాడి, తగులమారిపేరఁటాలో కుక్కదధ్యోదనపుఁబాత్రను వలె నోటఁ గఱచుకొని పోవును.

విప్ర—రంగరంగరంగా! రంగ!

దేవ—మహాత్మా! దేవరశిష్యుఁడు సూర్యునికి వారములును, జంద్రునికిఁ దిథులును జెప్పువాఁడుగ నున్నాఁడు!

శ్రీని—ఈక్రొత్తశిష్యురాలు—ఈ క్రొత్తశిష్యురాలు— గోవింద భక్తునకుఁ గొక్కోకము సెప్పుటకు వచ్చినది కాఁబోలు నేమి?

దేవ—(తనలో) వీఁ డసాధ్యుఁడే!

విప్ర—(చెవులు మూసికొని) రంగరంగరంగా! అట్లనెద వేమి?

శ్రీని—నేను దేవర నేమియు ననలేదు. ఈ శిష్యురాలు నన్నధిక్షేపింపనేల?

విప్ర—కాని, నీబుద్ధి మొదటినుండియుఁ గనిపెట్టుచుంటిని. ఏమో లోకవిరుద్ధముగ నున్నది.

శ్రీని—మీ చర్యయో? ఈవయసేమి? ఇంత భక్తి యేమి? ఈ దేహదార్ఢ్య మేమి? ఈ ప్రపత్తి యేమి? ఈ రక్తపటిమ యేమి? ఈ యింద్రియనిగ్రహ మేమి? ఈ ప్రాపంచికసౌఖ్యవిరాగత యేమి! ఈ వానప్రస్థత యేమి? ఈ మాధుకరభిక్షాన్ననియమ మేమి! ఈ చర్య లోకవిరుద్ధముగాదా? మీశిష్యుఁడ నైన నా బుద్ధికూడ నట్లే యుండుట యాశ్చర్యమా!

విప్ర—(నవ్వుచుఁ దల పంకించి) నీవు స్తుతిని మానవుకదా!

శ్రీని—స్తుతిని మాను మని నన్ను దిద్దుటకంటె సత్యమును జెప్పవలయు నని శాసించువేదమును దిద్దిన బాగుగ నుండును.

దేవ—(తనలో) ఆహా! మహాత్ముఁడు బహునిష్కల్మషహృదయుఁడు. బహుభూతదయాయుక్తుఁడు. స్త్రీపురుషభేదమే యిప్పటి కెఱుఁగనిమహామహుఁడు. కాని స్వల్పస్తుతిప్రియత, అత్యమాయికత మొదలగు కొన్ని లోపము లీయనయం దుంటచేతనే యాసపడుచుంటిని గాని, జాగిలమువలె నీతని గాచియున్న యీశిష్యుని దలఁచుకొన భయము వైచుచున్నది.

విప్ర—భాగవతోత్తమురాలా! కానిండు.

దేవ—ఏ మున్నది? భక్తురాల నని, బ్రహ్మచారిణి నని, బైరాగిని నని జోగిని నని—యందఱు నన్నుఁ దరిమితరిమి తిట్టితిట్టి—బాధింప—

విప్ర—ఆఁ! ఆఁ! నిజమే! నిజమే!

గీ॥ అట్టిశుభనామములు తుచ్ఛములందుఁ జేరి
తిట్టులయి భక్తునకు నిందఁ దెచ్చు నింత
కవిమృదులవాక్యములు నిరక్షరనటకుల
నోటఁ బడి కవి కిసుమంత మాటవలెను.

కాని,

గీ॥ సంగయుతులకు భూష లౌ స్వర్ణకాంత,
లగును దూష్యము లధికభక్త్యంచితునకు;
వారి కతిదూష్యహేయ మౌ భక్తిమార్గ,
మగును బరమభూషణము భక్తాధికులకు.

దేవ—ఇంటిలోనే పడి "భగవంతుఁడా! నీ పాదసాన్నిధ్యమున కెప్పుడు తీసికొనిపోవుదువోయీ!" యని యేడ్చుచు నొకపంచను పైఁటచెఱఁగుఁ బఱచుకొని రంగనామస్మరణము సేయుచుఁ బడియుండ నొక్కరేయి భుజాగ్రపరిచిహ్నితశంఖచక్రుఁడు—తులసీమాలావక్షస్కుఁడు — ద్వాదశోర్ధ్వపుండ్రప్రభూషిత దేహుఁ డగు నల్లని యాచార్యపురుషుఁ డొకఁడు స్వప్నమున సాక్షాత్కృతుఁ డయ్యెను.

శ్రీని—వేశ్యయింటికి స్వప్నములోనైన నాచార్యపురుషుఁడు వేంచేయుట కిదియే మొదటిసారి!

విప్ర—ఆహా! ఆహా! ఏమి నీయదృష్టము! తరువాత నేమి జరిగినదో చెప్పుమా.

దేవ—నే నామహాత్మునకు నమస్కరించి దేవర వా రెవరో సెలవిం డని వేఁడుకొంటిని.

విప్ర—కానీ ! త్వరగఁ జెప్పుము.

శ్రీని—ఉండుఁడు. ఏమి చెప్పవలయునో యాలోచించుకొననీయ రేమి ?

దేవ—ఆలోచించుకొనుట కిది యసత్య మని నీయభిప్రాయమా ?

శ్రీని—నిన్నరాత్రి గలిగిన స్వప్న మీయుదయముననే యెంతయో నిదానించి స్మృతికిఁ దెచ్చుకొనినఁగాని పూర్తిగా వెల్లడింపలేము. అట్టిచో నెప్పుడో గలిగిన స్వప్నము నాలోచించుకొనకుండ నెట్లు చెప్పఁగల్గుదు వని యంటిని. లేనిపోని దురభిప్రాయ మేల పడెదవు ?

విప్ర—నాయనా ! ఉండవోయి ! శీఘ్రముగ నేమి జరిగినదో చెప్పుము. తా నెవరి నని చెప్పెను ?

దేవ—నన్ను విష్ణుదాసుఁ డంచు రనెను.

శ్రీని—అ దేమి మాట ? వైష్ణవులు విష్ణుదాసులుగాక వేశ్యాదాసు లగుదురా !

విప్ర— ఆతని పేరు ?

దేవ—పేరు చెప్ప వీలులేదు. నేను శ్రీన్నవణ్ణంశైద పెరుమాళ్ దాసుఁడ ననెను.

విప్ర—ఓహో ! భక్తసారులవారోయి ! భార్గవాన్వయులోయి ! నాకన్నవలె నిద్దఱుతల్లులపుత్రులోయి !

శ్రీని—ముసలిదానికిఁ బదునుఁదన మిచ్చిన మహాపురుషులా ?

విప్ర—ఔను !

శ్రీని—(అపవారించి) ఈ పదుచుముండ నాతఁడు ముసలిదానిని జేసిన యెడల మనకే బాధ యుండక పోవును. (ప్రకాశముగ) అయ్యో ! పార్వతీపరమేశ్వరు లెదుట నిలిచినన్నైన వారిం జూడని మహాత్ముఁ డీమెయింటికి వచ్చె ననిన నెట్లు నమ్మెదరు ?

విప్ర—నారాయణమూర్తియే యాశ్రిత పరమ సులభుఁడై యుండఁ దద్భక్తులుగూడ నట్లుండరా ? తరువాత నేమి జరిగెను ?

దేవ—మహాత్మా! నా కేమైనఁ దారకమార్గ మున్న దేమో చెప్పుమని ప్రార్థించితిని.

శ్రీని—(తనలో) తారకమార్గము నిప్పు డేల వెదకుకొనవలయును? వృత్తి ననుసరించి యూరిపాఁరి నెత్తిఁగొట్టుటయే తారకమార్గము!

విప్ర—తరువాత—

దేవ—"శ్రీరంగక్షేత్రమునఁ బుష్పవనమున నర్థపంచకజ్ఞానసంపన్నుఁడగు మహాత్ముఁ డొకఁడు విప్రనారాయణుఁ డనుపేరున వెలుగుచున్నాఁడు. నీవు పోయి యాతని సేవించిన నిస్సంశయముగఁ గృతార్థురాల వగుదువు" అనెను.

శ్రీని—(తనలో) ఈ దుర్వేశ్యాసంగతి కాచార్యోపదేశము మూలాధార మయ్యెనా?

విప్ర—ఆఁ! ఆఁ! నే నంతవాఁడనా? అయ్యయో! దుర్మార్గుఁడను. పాపిష్ఠుఁడను. ఆ మహాత్ముని పాదుకల కున్నంత యర్హత యైన నాకు లేదే!

శ్రీని—ఆ పాదుకలక్రిందిమట్టి కున్నంత యర్హత నాకు లేదు.

దేవ—ఇట్లు సాయించి యాతఁ డంతర్హితుఁ డయ్యెను. ఒక్కతెను బైకి రాఁగ నూరివారు తూలఁ గొట్టుదు రని భయముచే మాయక్కను సహాయురాలిగఁ దీసికొని నిన్నఁటియుదయమున నీ పుష్పవనముఁ జేరి దేవర యెదుటఁబడి మాయక్కతో సాష్టాంగపడితిని.

విప్ర—ఆఁ! ఆఁ! అ దెప్పుడు?

శ్రీని—నిన్నఁటియుదయమున నని చెప్పియే యున్నది!

విప్ర—నీవుకూడ నప్పుడు నాతోడనే యుంటివి కాదా?

శ్రీని—ఊఁ!

దేవ—మీశిష్యుఁడు మమ్ములఁ జూచినట్లు నే ననుకొంటిని.

విప్ర—శ్రీనివాసా! చూచితివా?

శ్రీని—చూచితిని.

విప్ర—అప్పు డేల చెప్పలేదు?

శ్రీని—దేవరవారియొద్ద విష్ణుగాథామాహాత్మ్యమును నేర్చుకొన వచ్చిన వాఁడను గాని, దేవరకు వేశ్యాగాథాకలాపమును బోధించుటకై వచ్చియుండకపోవుటచేత—

విప్ర—ఇఁక నెక్కడి వేశ్య యోయి! ఆ వేశ్యాజన్మమే పోయినది! తత్సంస్కారములే నశించినవి! ఇది యొక పరిశుద్ధతత్త్వము.

దేవ—సాష్టాంగపడినను దేవరవా రాశీర్వదింప కుండుటచేతను—మావంకఁజూడనైనఁ జూడకపోవుటచేతను—

విప్ర—క్షమించవలయును.

దేవ—దేవరమనము శ్రీరంగేశ్వరపుష్పమాలాకైంకర్యసంకలితమై యున్నపుడు దేవర కన్యవస్తువు కనఁబడునా? నన్నుఁ జూడని భక్తాగ్రగణ్యులు నాసేవ నంగీకరించి నన్నుఁ గృతార్థను జేయ రని మహావిచార మొంది, మతిలేక, యెచ్చటికిఁ బోవుటకును గతియు దిక్కును లేక, యేమిచేయుటకుఁ దోఁచక, శ్రీరంగక్షేత్రమంతయుఁ దిరిగి తిరిగి, పరమార్తిచే నేడ్చి యేడ్చి, నిన్న రాత్రి రెండుయామములకుఁ గావేరిలోఁ దిగి ప్రాణత్యాగమును జేయుటకై తటీరమును జేరితిని.

విప్ర—రంగ రంగ రంగా! ఎంతమాట వింటిని!

శ్రీని—(తనలో) ఏదీ! జరిగినది కాదు.

విప్ర—కరచరణాద్యవయవవిశిష్ట మగు నిట్టి రూపమున నుంటచేతనే యాత్మకు మోక్షోపాయము కలిగినది. ఆత్మ తరించునది దేహముచేతనే. రంగరంగా యని స్మరించుటకు నో రుంటచేతనే, రంగాలయమునకుఁ బరుగులిడుటకుఁ గాళ్లు లుండుటచేతనే, రంగని దర్శించుటకుఁ గన్ను లుంటచేతనే, రంగని బూలఁ బూజసేయుటకుఁ జేతు లుంటచేతనే కదా—మన యాత్మలకు రంగభక్తి

కుదిరినది ? అవయవరహితమును రూపశూన్యమైన యాత్మ రంగని సేవించు టెట్లు ? సేవించిన నది యొకసంతుష్టికర మగు సేవగ నుండునా ? గట్టిగ వదలకుండ రంగనికాళులు పట్టుకొన వలయును. నోరార్చుకొనిపోవునట్లు రంగనామము స్మరింప వలయును. అది సంపూర్ణ మగు సేవ. అది సంతుష్టికర మగు కైంకర్యము.

శ్రీని—(తనలో) దీనికే జబర్దస్తీభక్తి యను పేరు.

విప్ర—నామనసులోని యభిప్రాయమును నీకుం జెప్పెదను వినుము. నాకు మోక్షమం దైన నంత యపేక్ష లేదు. ఎన్నిజన్మము లయినను దనివి దీఱకుండ నొక్కరీతిగ రంగకైంకర్యమును జేయుటయే నాకుం గావలసినఫలము. సరి, సరి! దీని కేమి? తరువాత నేమి జరిగెను?

దేవ—అప్పు డంత జనసమ్మర్దముగా నుండుటచేం గొంతసేపు తాళి యుండవలయు నని తత్తీరమునం గూరుచుండ నెందుచేతనో కన్నుల కట్టు మబ్బు దగుల సొమ్మసిల్లితిని.

శ్రీని—(తనలో) తాగుటచేత—

విప్ర—సెబాస్! రంగండు నీప్రయత్నమును గొనసాగనిచ్చెనా?

శ్రీని—(తనలో) ఎవనిగొంతుం గోయుట కట్టిపెట్టి యుంచెనో?

దేవ—అంతట నిద్రావస్థలో—

శ్రీని—తిరిగి స్వప్నమా? ఇదివఱ కాచార్యపురుషునివంతు తీరెనది. ఇఁక రంగనిదికాంబోలు! వేశ్యానునయమునకు భగవంతుండు, భాగవతోత్తము లెంత చవుక యయిపోయినారు!

విప్ర—అదియే భగవంతునియం దున్న విశేషము. ఆశ్రితార్తిసుల భుండు. గజేంద్రాళ్వారులు తిరుప్రపత్తి సేయ, నిత్యసూరు లాశ్చర్యపడునట్లు స్వామి పరమపదమునుండి వేంచేసి మకరికా దంతప్రణబాధిత మగు భక్తునిపాదమును శ్రీదేవీకపోలఫలక

లాలనశీల మగు తనదక్షిణహస్తమున నొత్తి ధన్యాత్ముని జేసిన యాభక్తవత్సలునికంటె — ఆ పరమపురుషునికంటె — ఆ చక్రవర్తితిరుమగనారుకంటె — ఆ జగదాధారునికంటె — నాకన్నను కంటె సులభుం డెవండు? ఆపదల కష్టపడువాం డెవండు? రక్షించువాం డెవండు? అజ్ఞానహరుం డెవ్వండు? నిత్యానంద ప్రదాత యెవ్వండు? రంగరంగరంగా! (అఱచును.)

దేవ — ఎవరో వచ్చి నన్ను శ్రీరంగేశ్వరుని యాలయములోనికిం దీసికొనిపోయినారు. "రంగరంగా! విప్రనారాయణమూర్తిని సేవింప వచ్చి యాతనిచేం దిరస్కరింపంబడి నీ పాదములే గతి యని నమ్మి వచ్చితి" నని పెద్దకేకలు పెట్టి యేడ్చితిని.

శ్రీని — ఇదివఱ కెవరో వచ్చి తీసికొనిపోయి రని చెప్పియుండి యిప్పుడు నీయంత నీవే యాలయమునకు వెళ్లినట్లు చెప్పుచున్నావు!

విప్ర — అది యొకతప్పు కాదు. కానిమ్ము.

దేవ — "తెల్లవారిన పిమ్మట మాలాకైంకర్యమునకై వచ్చు విప్రనారాయణుని మేము మందలింతుము. నీవు పోయి యాతనినే సేవింపుము" అని స్వామి గంభీరవాక్యములం బ్రసాదించిన ట్లుండ నదరిపడి మేల్కాంచితిని.

విప్ర — రంగరంగరంగా! అయ్యయ్యో! రంగరంగరంగా! ఇంక నేమున్నది? రంగరంగరంగా! ఇందులకా మోము ముడుచుకొంటివి! ఇందులకా యప్రసన్నముఖుండవై యుంటివి! ఇదిగో! లెంపలు వైచుకొనుచున్నాను. (అట్లు చేయును.) రంగరంగరంగా! క్షమింపుము. సర్వాపరాధిని క్షమింపుము. భక్తశిఖామణీ! నన్ను మందలింతు నని స్వామి సెల విచ్చెను గాదా! సెల విచ్చెనుగాదా! సెలవిచ్చెనుగాదా!

దేవ — ఏమి అట్లు సంభ్రమపడెద రేమి? నావలన నేమైనం దప్పు గలిగెనా?

విప్ర—నీవలనఁ గాదు; ఈ నిర్భాగ్యునివలన— ఈ యక్షిశూన్యుని వలన— ఈ మత్తుని వలన— ఈ మందుని వలన— ఈ దురహంకారునివలన—

శ్రీని—అట్లు దూషించుకొందు రేల? శ్రీరంగదర్శనతత్పరతను మీ నేత్రము లుండి, శ్రీరంగదేవాలయఘంటాంకారనాదశ్రవణతత్పరతను మీ కర్ణము లుండి, పాశురపఠనావేగమున మీజిహ్వ యుండి, భక్త్యావేశమున నాత్మ యుండి, దేహస్మృతియే లేనట్లుండిన మీ రీనెను గాంచి, యానందించి, యాశీర్వదించి, ప్రసంగించి, యుపదేశించి, కృతార్థ నా నిముసమునసే చేయు లేదని శ్రీరంగమూర్తికి మీపైఁ గోపము వచ్చిన దనుకొనుట కంటె నసందర్భమైనవాక్యము సృష్ట్యాది యిప్పటివఱకుఁ గలిగి యుండ దని నా యభిప్రాయము. అందులో శ్రీరంగమూర్తియే యట్లు సాయించుట తనదైవత్వమును దాను దగ్ధముచేసికొనుట గాని మఱి యొకటియా!

విప్ర—రంగరంగరంగా! ఎట్టిమాటలాడుచున్నావు? శ్రీనివాసా! నీకుఁ దెలియదు. విష్ణుతిరస్కారముకంటె విష్ణుభక్తతిరస్కారము మహాపాపప్రద మోయి! అట్టిమహాపాపము నా మెడకుఁ జుట్టుకొనినది. రంగరంగా! రంగా! ఎట్లు లుద్ధరింతువో! ప్రపన్నరాలా! నన్ను మందలింతు నని స్వామి యానతిచ్చెనుఁ గాదా? ఆనతిచ్చెనుఁ గాదా? ఆనతిచ్చెను గాదా!

దేవ—మహాత్మా! నేను శాంతి నొంద దేవరయొద్దకు వచ్చి తమకుఁ దొందర యిచ్చుచుంటినా? నే నేమైనఁ దప్పాడితినా?

విప్ర—నీ వాడినవి వేదాక్షరములు! నీవు మహాత్మురాలవు. దైవసాక్షాత్కారము గలదానవు. నీతో భగవంతుఁడు సెలవిచ్చినట్లు నన్ని యుదయమున నాతఁడు మందలించినాఁడు.

దేవ—ఎట్లు! ఎట్లు?

శ్రీని—(తనలో) ఇదివరకు వినన ట్లే! ఎఱుఁగన ట్లే! నిన్నయుదయము నుండియు నీముండ మమ్ము తథాస్తుదేవతవలెఁ గనఁబడకుండ సమీపమున నాశ్రయించుకొని తిరుగుచునే యున్న దేమో ?

విప్ర—నా కాతఁ డీయుదయమునఁ బ్రసన్నుఁడు కానేలేదు. ఆతని మొగము వికాసవంతముగనే లేదు. మందహాసపూర్ణముగ నుండుటకు మాఱుగ ధుమధుమ లాడుచున్నది. నా కింతకంటె నే మున్నది ? నాబ్రదుకున కింతకంటె లోప మేమి ? నాదుఃఖ మున కింతకంటె నవధి యేమి ? నానేత్రముల కింతకంటె మంట యేమి ? నామహాపాపమున కింతకంటె దుష్టఫల మేమి ? నాయాత్మ కింతకంటె శల్య మేమి ? మందలింతు నని యాజ్ఞ యిచ్చెను. మందలించినాఁడు. నిన్ను నాయొద్దకుఁ జేర్చుకొంటిని. ఇఁక నామహాత్ముఁడు నాకుఁ బ్రసన్నుఁడు గాకుండునా ! అతిసులభుఁడే ! ఆశ్రితదోషభోగ్యత్వగుణసంపన్నుఁడే ! అమిత కరుణాపరిపూర్ణుఁడే ! అట్టి శ్రీరంగమూర్తి నా కింకఁ బ్రసన్నుఁడు గాకుండునా ? అగును. నాత ప్పేదియో తెలిసినది. అందులకా శిక్షయైనది. నామనస్సు నిర్విచారమైనది. రంగరంగ రంగా ! రక్షించితివి! ఇదిగో నీవు నాయొద్దకుఁ బంపిన భక్తురాలు. ఈమెతో మహానందమున నింకఁ గాలక్షేపమును జేసెదను. ఓరంగదాసురాలా ! నీమూలమున నేఁ గృతార్థుఁడ నైతిని.

దేవ—దేవరవారిపాదమూల మాశ్రయించి సఫలమనోరథను గావచ్చిన నాతో మీ రిట్టు లానతీయఁ దగునా ? దేవరకు శిష్యురాలను, సేవకురాలను. మీపాదముల నొత్తుదును. మీవస్త్రముల నుదుకుదును. మీపూలమొక్కలకు నీళ్ళు తోడుదును. మీరు రంగని కర్పించుపూలదండలను నేను గ్రుత్తును.

విప్ర—అది నే నంగీకరింపను. నా కీ చేతు లేల ? రంగఁడు ధరింపఁదగిన పూలమాలలు నేనే గ్రుచ్చనియెడల నాచేతు లేల కాల్పనా ! మాలాకారు లగు భక్తు లెందఱో తరించి రని విని నే నిట్టి దాస్యముచే నాతనువును బవిత్రముగఁ జేసికొనుచున్నాను.

దేవ——అటులైన పోనిండు. నేను మీపర్ణశాలను సమ్మార్జనము చేసెదను, అలికెదను, ముగ్గు పెట్టెదను——

శ్రీని——ఒకటి యనినమాట యేమి? ఆడువారు చేయు నన్నిపనులను జేయ నిశ్చయించుకొనినావు!

విప్ర——శ్రీనివాసా! నీకుఁ గొంత దేహశ్రమము తగ్గునని సంతోష పడుచున్నావా?

శ్రీని——దేహశ్రమమున కేమి కాని హృదయశ్రమము ద్విగుణమైనది.

విప్ర——ఎందుచేత?

శ్రీని——భక్తరాజుచిక్కుడుతీఁగవలె నొంటరిగనే యెదుగఁదగినది. అది యేను వచ్చినపిదపనే దేవరభక్తసాంగత్యమున కేమి లోపము గలిగెనో యని నేను విచారించుచుంటిని. అందుపై వన్నెలు చిన్నెలు గల యీయామె యొకతె దాపరించినది. సర్వసంగపరిత్యాగు లగు దేవరకు సంసారవృద్ధి యగుచున్నది. ఇంక నెంత వృద్ధి యగునో యని నే నేడ్చుచున్నాను.

విప్ర——సంసారవృద్ధి యెట్లగును? సున్న లెన్ని గూడిన నొకటి యగునా? ఈమె రంగనియాజ్ఞపై నిట్లు వెంచేసినది మన యిష్టమేమున్నది?

దేవ——దేవా! మీ కిష్టము లేనియెడల నే నెచ్చటికైనఁ బోవుదును. నిర్బంధ మేల?

విప్ర——రంగరంగరంగా! ఎంత మాట నాడితివి! నీవు మహాభక్తురాలవు. నీ సాంగత్యమునకంటె నాకుఁ గావలసిన దేమి? అందుపైఁ బరమ ప్రపన్నశేఖరు లగు భక్తసారభగవానునిచే నిటకుఁ బంపబడితివి.

దేవ——దేవరదాసినై నే నిచ్చట నుండుట మీ కిష్టమే కదా!

విప్ర——అదియే నిక దీ మహాభాగ్యము.

శ్రీని——(తనలో) రంగరంగరంగా!

దేవ—మీ భుక్తశేషమే మైన నున్న నది మీ శిష్యునిచేఁ గుక్కకు విదిర్చినట్లు వేయించుఁడు. ఈ బొందిలోఁ బ్రాణము లున్నంత వఱకు శ్రీరంగదేవ కైంకర్యము, దేవర కైంకర్యము చేసికొనుచు నుండెదను.

విప్ర—రంగరంగరంగా! అట్లు లాడఁ దగునా?

శ్రీని—అట్లు లాడుట తగదు కావున, దేవర యారగించు భిక్షాన్న మీ మీ చేతనే మాధుకర మెత్తించి తెప్పించఁ దగును.

విప్ర—అ దెందులకు? నేనే పోయెదను. లేనియెడల నీవు పోయి తేవచ్చును.

శ్రీని—దేవరకు వర్ణవిభాగముఁ బని లేదు; లింగభేదముతో నంత కంటెఁ బనిలేనప్పు డామె తెచ్చిన బాధ యే మున్నది?

విప్ర—ఎందులకోయి! అట్టి యగత్యము లేదు.

శ్రీని—(తనలో)

సీ॥ విప్రాంత్యజులలోన ♦ భేద మే మనుఁగాని
పంచముతోఁ డ సాఁ♦పడఁగ లేదు
తరుణీపురుషు లొక్క♦ తత్త్వ మా ననుఁగాని
యింతి పీఁటఁ బడ స♦హింపలేదు
వేదముల్ చలిమంట♦వేయు నె ననుఁగాని
తండ్రిశ్రాద్ధము సమం♦త్రముగఁ జేయు
సత్యవర్తనమే ప్ర♦శస్త మా ననుఁ గాని
పలికిన ట్లాచరిం♦పంగ లేదు
తనకుఁడియెడమచేతులఁ ♦ దనరునట్టి
భేదమే తీర్చుకోలేని ♦ వెఱ్ఱినరుఁడు
లింగవర్ణ భేదములు మా♦ర్పంగఁగలఁడె?
పొల్లు కేకల సృష్టిని♦ర్మూల మగునె?

గీ॥ బ్రహ్మసృష్టిలో భేదమే ♦ ప్రాతిపదిక
వర్ణ భేదదులు మఱొక ♦ ప్రబలభేద
మెంచి యొకనిపై నొకఁ డేచి ♦ మెగయుచుండ్రు
భేదశూన్యముగ బ్రదుకె ♦ లేదుగాదె!

గీ॥ కుక్క-గొడుగులవలెఁ బుట్టి ♦ గ్రుంకు మనము
ప్రాక్తనప్రకృతిగతిప్రవాహ మడ్డు
పఱుతుమే ? బుద్బుదము లట్లు ♦ పైని నూఁగి
యొటనొ టప్పనకుండఁ జేలుటయె కాక !

(ప్రకాశముగ) స్వామీ! అట్లేమో యస్తిమితముగ నున్నారేమి?

విప్ర—నా కిపుడు మనసు నిర్మలముగ నున్నది. లోపలినుండి యేదియో సముద్రతరంగములవలెఁ బొంగుచున్న ట్లున్నది. ఒడలు జలజల లాడుచున్నది. పులకాంకుర మగుచున్నది. రంగరంగ రంగా! ప్రసన్నుఁడవైతివి. మీరందఱు నాతోఁ బాడుఁడు. నాతోఁ దాండవింపుఁడు. రంగరంగరంగా! రంగరంగరంగా!

దేవ—(తనలో) భక్త్యావేశ మాహేంకజ్వరమువలె దినమున కొకసారియో రెండుసారులో తగిలి విడుచునుగాఁబోలు!

కాంభోజిరాగము—ఆదితాళము.

విప్ర—నీరదలలితాంగ శ్రీరంగా! ♦ నిఖిలపాపవిభంగ ॥నీ॥
సారహీనం బైన యీసంసారమందునఁ జిక్కి నీ పద
నీరజంబుల భక్తిఁ గొల్వఁగ ♦ నేరక చెడిపోతి రంగా! ॥నీ॥

దేవ—(తనలో) ఇఁక ముందది జరుగవలయును.

విప్ర—సుందరం బగు ఫాలతలమందు ♦ శోభిల్లెడుచిఱుకురు
లందముగ నిరుపాయ లందగను
చెందొవ న్నిందింపఁగం దగు ♦ చందమున దిరురేఖఁ దీర్చిన
చందమామనుబోలు నీమొగ ♦ మెందులకుఁజూపింపకుందువు ॥నీ॥

దేవ—(తనలో) ఈ మొగము నామొగమా ? రంగనిమొగమా ?

విప్ర—(గట్టిగ తాండవించి) రంగరంగరంగా! రంగా!

(పెద్దకేకలు వైచి నేలఁబడును.)

ముని—ఆహా! ఆహా! భక్త్యధికతచేఁ గాఁబోలు! మహాత్ముఁడు మూర్ఛ నొందినాఁడు.

దేవ—(ఆతని దస్తోడప్పి నుంచుకొని పైటచెఱంగుతో విసరుచుం దనలో) ఇట్టియవస్థనే నేను గోరితిని. స్త్రీస్పర్శచే నేమైనమార్పు కలుగునేమో? (తలయుం జెక్కులు వక్షమును నిమురుచున్నది.)

శ్రీని—నీ వెంగుల నతని స్పృశించితివి? నీ వటు పొమ్ము. లే, లే!

దేవ—గురుని దేహసంరక్షణము శిష్యునిదని యీతండిదివఱకు బోధించిన యంశమును మఱచితివా?

శ్రీని—శిష్యుని దని చెప్పినాండా? శిష్యురాలి దని చెప్పినాండా?

దేవ—భక్తునిగూర్చి లింగభేదము చూడందగ దని యీతం డుపన్యసింపలేదా?

శ్రీని—భక్తునిగూర్చి యని చెప్పెనా? శిష్యునిగూర్చి యని చెప్పెనా?

దేవ—నే నిటకు భక్తి నభ్యసించుటకే కదా వచ్చితిని!

శ్రీని—నీ వభ్యసించి నిశ్చలభక్తురాలవైనప్పుడుచూచుకొనవచ్చును లే! ఇప్పుడు లే! అదిగో! ఆ దిక్కుమాలిన పైంటచెఱంగుతో విసరుచున్నా వేమి? ఆఁగు! నాప్రారబ్ధము—ఆగాలి నాకుంగూడం దగులుచున్నది. (విప్రనారాయణుని చెవిలో) రంగరంగరంగా! రంగా

విప్ర—(లేచి) ఏండీ? కావేరిరంగం డేండీ! ఏండీ! కస్తూరిరంగండు! ఏండీ శృంగారరంగండు! ఏండీ! వైభోగరంగండు! ఏడీ! నా యొయ్యారి రంగం డేండీ! రంగరంగరంగా! (పడంబోవును.)

శ్రీని—(పట్టుకొని) దేవా! తను కొండలు తిరుగు చున్నది. పర్ణశాలకు దయచేయవలయును.

విప్ర—పర్ణశాల కేల? నన్నుం బట్టుకొని శ్రీరంగాలయమునకుం దీసికొని పొమ్ము! అచ్చట నాదివ్యమూర్తిని, నాముద్దులరంగని యొకసారి సేవింతును.

శ్రీని—మహాభాగ్యము! దేవర దయచేయుదురుగాక!

దేవ—నేనుంగూడ వచ్చెదను.

శ్రీని—వలదు. నీవు పర్ణశాలకుంబొమ్ము. నిన్నట మేము గలిసికొందుము.

దేవ—సరే! (అందఱు నిష్క్రమింతురు.)

ఇది ద్వితీయాంకము.

శ్రీ

విప్రనారాయణ చరిత్రము

తృతీయాంకము

ప్రదేశము — విప్రనారాయణుని పుష్పారామము.

(ప్రవేశము — దేవదేవి.)

దేవ. — ఆహా! పాపకాలము! వేశ్యయింటిచుట్టు శృంగారవేషములతో విటులు దిరుగవలసి యుండ, వేశ్యనైన నేనీ సన్న్యాసినీవేషమున విటుని సంపాదించుటకొఱకు కల్లలాడవలసివచ్చినది. ధనలాభమును గోరి యీతనికొఱకు దేవులాడుట లేదు. అతఁ డిచ్చున దేమి? సాలగ్రామతీర్థము! పోనీ! చక్కఁదనముఁజూచి యీతనికొఱ కేడ్చుచుంటి నేమో యన నట్టిరూపలావణ్యాదు లచట పూర్ణానుస్వారములు! వేశ్యావృత్తికి స్త్రీప్రకృతికిఁ గూడ నన ర్హమైనపని సేయుచుంటిని. మాయక్కచే నెప్పుడో దాస్యము చేయించుకొనఁ దలఁచి, యిప్పుడీ శాపనయ్య కదియిది యన రానికైంకర్యము సేయుచున్నాను. అతనికి బానిసనై యుంటిని. కడుపునిండినయన్నమునకు మొగమువాచి, యొడలునిండిన గుడ్డకు మొగము వాచి యుంటిని. లోనఁ గడుపు మండుచుండఁగఁ బైకి మహానందమున రంగనామస్మరణము చేయవలయును. కాళ్ళువిఱుగఁ దాండవములు! నోరు నొప్పులువెట్టఁ బాటలు! చెవులు తడకలుగట్టఁ దాళపుదెబ్బలు! ఇంతకు మేళములో ముక్కాకలు దీరినదాన నగుటచే నీ ధాటికింక నిలువఁ బడినాను. అయినను మిక్కిలి శ్రమముగ నున్నది. లోపల విటాకర్షణవృత్తి — పైకి విష్ణుభక్తి! లోపల నింద్రియసమ్మర్దనోత్కం

రత — పైకి భాగవతో త్తమత ! లోపల సంగవాంఛాపాటవము— పైకి సన్న్యాసినీస్వరూపము ! లోపలఁ గ్రీడామందిరావాసాభి సంధి — పైకి శ్రీరంగాలయసందర్శనకుతూహలత ! లోపల భక్తుని బాదదాసునిగఁ జేసికొనుకోరిక — పైకి భక్తునిపాదము లకుఁ బ్రణామము ! లోపల ననంగమంత్రజపము — పైకి నష్టాక్షరీ మంత్రజపము ! లోపలఁదలఁపులో దొంగతనము—పైకిమాటలో రంగనామము ! ఇట్టి స్వరూపము నిల్లు వెల్లడించుచున్నాను. లేని ప్రేమములు వెల్లడించుట, రానిచేమఁపు లేష్చుట, కలుగని కోపములు గనఁబఱచుట, లేనివినయములు తెచ్చుకొనుట మొదలగు మదనమహేంద్రజాలవిద్యలలో విజయపత్రికఁ గొనినదానను గనుక నింతవఱకు దూసిపోకుండ నిలిచితిని. అయినను మిక్కిలి శ్రమముగ నున్నది. ఎంతశ్రమపడినను మదకు సాధింపఁగల నను నాస యున్న నంతబాధ లేదు. అధైర్య మను మాటయే యెన్నఁ డెఱుఁగని నాకే యిల్లున్నది. నే నిటుఁ బ్రవే శించి యెదుమాసములు దాఁటినది. అనేకపన్న్యాయము లతని దేహముతో నాదేహమును దగుల నిచ్చితిని. గిలిగింతలు పెట్టి తిని. జుట్టు దువ్వితిని. పూలు ముడిచితిని. దేహమునకు గందముఁ బూసితిని. కాళ్ళకు గజ్జెలు గట్టితిని. చిత్రచిత్రనృత్యము లనువంక నెన్నిమాఱులో కౌఁగిలించితిని. మోము మోమునఁ జేర్చితిని. పాదము లొత్తితిని. ఉహుహ్హూ ! కరుగలేదు. కదలలేదు. మెదలలేదు. అదరిపడలేదు. టొంకలేదు. ఊఁహుహ్హూ ! ఒడలు జల్లు మనినట్లయినఁ గనఁబడలేదు. రోమాంచమైనఁ గలుగ లేదు. ఱాతిబొమ్మ ! మంచుగడ్డ ! ఉక్కుతునుక ! వజ్రఫలకము ! ఛీఛీ! అందుదాని కక్కుఱుతాని మగవానితను వేల ? ఈ నిర్భా గ్యునికట్టి యంత్యావస్థాగ్నిదీప్తికే కాని, యనంగాగ్నిదీప్తి కక్కుఱకు రాదు.

(నేపథ్యమున) రంగరంగరంగా! రంగ! అంతమాట వలదు.

దేవ—అరుగో! గురుశిష్యు లిద్దఱుఁగూడ వచ్చుచున్నారు. నేనీ మాలతీలతచాటున నుండి వారేమనుకొనెదరో విందును.

(విప్రనారాయణుఁడు శ్రీనివాసుఁడు ప్రవేశింతురు.)

శ్రీని—ఆలాగునఁ జెప్పు మని యిదివఱకుఁ జెప్పిరి కాదా? ఇప్పుడంత మాట వల దందు రేల?

విప్ర—(సందేహముగ) ఊఁ—ఊఁ—సరే—చె—ప్పు—చూడు—చెప్పిన బాధ యేమున్నది?

శ్రీని—బాధయా? బ్రదుకుదుము. పరువు దక్కించుకొందుము. భక్తి నిలుపుకొందుము.

విప్ర—ఆ భయ మేమియు లేదు! అందుచేత నే నట్లు చెప్పు మనుట లేదు.

శ్రీని—చిత్తము. పోయి చెప్పెదను.

విప్ర—చూడు! ఈ దినముననే యనుమాట యేమిఁ? ఇంతలోఁ దొందర యేమి? రేపు చెప్పవచ్చును.

శ్రీని—అట్లు కాదు. క్షమింపవలయును. తలఁచుకొనినది శీఘ్రముగ నైన మంచిది. పోయెదను. సెలవిండు.

విప్ర—చూడు! సాయంకాలమునఁ జెప్పెదువుకాని, యిటు రా!

శ్రీని—నేను రాఁజాలనందులకు దేవర క్షమింపవలయును. ఇంతకాలము నకు మీ నోటివెంట నా మాత్రపుమాట వచ్చినది. పోవు చున్నాను.

విప్ర—ఉండు. ఇప్పుడే చెప్పక తప్ప దనుచున్నావు కాన — విను — మెల్లగ — మృదువాక్యములతో — మనసు నొచ్చకుండ — జాగ్రత్తగా — చెప్పవలయును. ఆమె బహు సుకుమారి సుమా!

శ్రీని—భవబాధాపరిత్యాగిని యగు భక్తురాలు కాదా!

విప్ర—కా దంటినా! ఆ మాట యిప్పు డెందులకు? నేను జెప్పినట్లు కాకుండ—నా మనసులోని యభిప్రాయ మది యై యుండు నని నీ వూహించినట్లుగ—తెలిసినదా?

శ్రీని— తెలిసినది. కాని—మీ యాజ్ఞ యని చెప్పునెడల పని జరుగును గాని, నాయూహ యని చెప్పినయెడల ‘ఛీ! ఛీ!’ యనును.

విప్ర— అయ్యయ్యో! ఆమె యట్టికఠినోక్తు లెన్నఁడైనఁ బలుకునా? పరమమృదులవాణీమనోహర కాదా!

శ్రీని— మహాత్మా! రంగనామముకంటె మృదుమధురమైన వాణి లేదని సెలవిచ్చితిరికాదా! దానికంటె మృదుల మని మీ యభిప్రాయమా!

విప్ర— రంగ రంగ రంగా! ఎంతమాట నాడితివి! రంగ రంగా! (చెంపలు వైచుకొనును.) సరే, పొమ్ము!

శ్రీని— పోనిచ్చినయెడల నీసరికిఁ దిరిగి వచ్చియుందును. (పోవును.)

దేవ— (తనలో) ఏదియో నాకుఁ గొంతబాధ నిచ్చెడు మాటను జెప్ప వచ్చుచున్నాఁడు. ఈ శిష్యుని బలాత్కార మెక్కువగ నున్నది. కానీ! సరసశృంగారలీలాకలాపధళధళాయితరూప సౌభాగ్యము వదలినది కదా! తస్కరవిరాగివేషము వచ్చినదికదా! మహారాజులను మంచఁపుఁగోళ్ళకుఁ గట్టించుమహిమము మున్నఁ గల సినది కదా! పరమదరిద్రకురూపనపుంసకాధమాధముఁ డగు పాపనపందవెంట ‘మగఁడో మగఁడో’యని యఱచుచుఁ బ్రాఁకులాడిన నైన నతఁడు నన్నుఁ బ్రేఁగంటనైనఁ జూడనట్టి దురవస్థ ప్రాప్తమైనదికదా! ఇంతకంటె నైచ్య మేమి రాఁగలదు? వచ్చునెడల రానీ! నైచ్యము భక్తికి మంచిదే కాదా! దొంగభక్తి పోయి నిజమైనభక్తి కుదిరెనయెడల నదృష్టవంతురాలనే! లేదా, యజ్ఞోపవీతమును మెలికవైచి భక్తుని వేశ్యావీధి కీడ్చి తెచ్చి మేళములో నావెనుక నీతని తాళఁపుహంగునకై పెట్టి యింతటినుండి సానులమేళములో శ్రీవైష్ణవులు చిప్పతాళపుహంగుఁ జేయవచ్చునను సదాచారమును స్థాపించి శాశ్వతకీర్తి నైనఁ బొందుదును.

(నేపథ్యమున) దేవదేవీ! దేవదేవీ!

దేవ—శ్రీనివాసుఁడు పిలుచుచున్నాఁడు. నే నిట్టు లోనికిఁబోయి యీసారి పిలిచినప్పుడు కానఁబడుదును. (పోవును.)

శ్రీని—(ప్రవేశించి) దేవదేవీ! దేవదేవీ!

(నేపథ్యమున) శ్రీనివాసా!

శ్రీని—ఆఁ! ఇచ్చటకు రమ్మా.

దేవ—ఎందులకు?

శ్రీని—ఎందులకో వినుటకే—

దేవ—(ప్రవేశించి) ఏదీ? వినఁ దలఁచితిని. శీఘ్రముగఁ జెప్పుము.

శ్రీని—శీఘ్రముగఁ జెప్పుట కది మంచిమాట కాదని సంకోచించుచుంటిని.

దేవ—నీవు సంకోచింప నక్కఱ లేదు. నేను గీదును సంకల్పించుకొనియే యిల్లు వదలి యిటఁ జేరితిని.

శ్రీని—ఆఁ! ఆఁ! నీవు సంకల్పించుకొనిన కీ డేమి?

దేవ—ఆత్మహత్య! అది సాఁగినది కాదు. అంతవఱకు సిద్ధపడి యున్న దానికి నీ కీడుమాట లెక్క యేమి?

శ్రీని—నీ విటకు వచ్చి యైదుమాసములు దాఁటిపది కాఁబోలు నేమి?

దేవ—అయిన నేమి?

శ్రీని—పాపము! నేఁటితో నీకు గురుసేవఋణము తీఱిపోయినది!

దేవ—రంగ రంగా! గురువులవా రాకస్మికముగఁ బరమపదించినారా?

శ్రీని—(చెవులు మూసికొని) పాపము శాంతించునుగాక!

దేవ—లేక భ్రష్టు లైరా?

శ్రీని—నీవింక నిచ్చట నుండిన నేమగునో కాని, నిన్నిటనుండి మఱి యెక్కడకైనఁ బొమ్మనినారు.

విప్ర—(తనలో) పాపము! వెడలిపోవును గాఁబోలు! అయిదు మాసములనుండి రంగనామస్మరణమున, రంగగాథాగానమున, రంగభక్తిప్రేరితతాండవమున నెంతయో తోడ్పడి యున్నది. చీ! చీ!

పుట్టిననాఁటనుండి పోషించి భక్తినొసఁగిన రంగనికంటె నాకుఁ దో డెవ్వఁడు? రంగనికంటె దిక్కెవ్వఁడు? రంగ రంగ రంగా! (లెంపలు వైచుకొనును.)

శ్రీని—మాట లాడ వేమి? అది గుర్వాజ్ఞ గావున నెంతశీఘ్రముగఁ బోయిన నంత విధేయుతఁ గనఁబఱచినవాన వగుదువు.

దేవ—నాకుఁ బరమసంతోషకర మగు వార్తను జెప్పితివి. (తనలో) ఇది నాకు నిశ్చయముగ సంతోషకర మగు వార్త. నామనోరథ మింక నెఱవేఱఁగలదు. ఇప్పటికి నేను స్త్రీనని యాతనికిఁ దెలిసినది. నా స్త్రీత్వప్రభావ మిప్పటికి బ్రహ్మరంధ్రమున కెక్కినది. నే నిదివఱకు వెల్లడించిన శృంగారభావచేష్ట లిప్పటికి జీర్ణమై రక్తమునఁ గలిసి ప్రవహించుచున్నవి. నూటమొండితత్త్వము కావున నింతయాలస్యమైనది. ఇఁక భయము లేదు. ఇఁక నొకటి రెండు మోతాదులతో వ్యాధి తిరుగును. ఐహికవ్యాధి కుదిరిన నరుఁడు మంచమునుండి దిగును. అప్రాపంచికవ్యాధి యైన భక్తిరోగము నశించినవాఁడు మంచమెక్కును. ఇది మాత్రమే భేదము. కాని రోగము కుదురుటమాత్రము నిశ్చయము. (ప్రకాశముగా) శ్రీనివాసా! నేను బోయెదను గాని పొమ్మనుటకు గురువులవారికిఁ గారణ మేమి?

శ్రీని—కారణమునుగూర్చి నాతో నాతఁడు చెప్పియుండలేదు.

దేవ—నీ వేల యడుగక పోయితివి?

శ్రీని—నీవు నన్నడుగుదు వని తెలియక.

దేవ—నాకుఁ జెప్పకపోయిన నీకైనఁ దెలిసియుండ నక్కఱలేదా?

శ్రీని—పొమ్మనువాఁ డాతఁడు; పోవుదానవు నీవు. నడుమ కారణజ్ఞానముతో నాకుఁ బ్రయోజన మేమి?

దేవ—అయినను గారణ మే దని నీ వూహించితివి?

శ్రీని—ఇదివఱ కూహించి యుండలేదు.

దేవ—ఇప్పుడు యోజింపఁగలవా?

శ్రీని—ఏ మున్నది ? ఇట నీ వుండుట కిష్టత లేకపోవుటచేత—

దేవ—ఏల ?

విప్ర—(తనలో) పొమ్మనుట నా కంత యిష్టమే కాదు. శ్రీనివాసుని ప్రోత్సాహ మెక్కువగు మనది. ఆ మెనలనం దప్పేమియుం గానంబడదు. నిశ్చలభక్తియు స్థిరాలు ! అది రంగనామస్మరణముం జేయు వీణ మీటుచున్నంగ నుండునది. అది యేమో కాని— కొలందిదినములనుండి — నాకు—ఒకవిధమైన యస్థిమితము— అభూతపూర్వమైన యొకయుత్సాహము — విచారపూర్వకమైనదీర్ఘాలోచన మొకపుడు—రేలం దఱచుగ నిద్రాశూన్యత— మనసు మఱియొకదారినిబోవుచున్నదేమో యను వెఱ్ఱిభ్రమము—అంతలోనే ద్విగుణీకృతభక్తిప్రబోధితగాఢతాండవప్రారంభము—తాండవించుచుండఁగనే యంతలోఁ బరాకు — ఏదో పోయినట్లు వెదుకుకొను బుద్ధి — చూపుల కొకవిధ మగు చలనము — తొట్రుపాటు — నిర్వర్ణింపలేని యొకవిలాసము — అభిముఖమార్గాభిగమనముగాక—తఱచు పార్శ్వగమనము — అంతలో నట్టి సంకోచము — ఏదియో వచ్చి యానందింపం జేయు నను నొక పెద్దయాస—నా కింక నభోగతియే యని యకారణముగ లోనం గలిగిన గుబులు—దేహమున కట్టి యట్టి యొకపు టుత్కృష్టత—ఒడలు చల్లఁగ నుండియు లోనం దాపము—. నిష్కారణ నిశ్శ్వాసములు — భక్త్యుద్రేకము లేనపుడుకూడ బాష్పనిష్యందము—మన సేమో యూఁగిన ట్లొకపుడు—గిరగిర తిరిగిన ట్లొకపుడు—పామువలె నడచిన ట్లొకపుడు—ఉత్సాహమునం బొంగున ట్లొకపుడు—ఏదియో దాటిన ట్లొకపుడు —. లోనికి దిగిపోవుచున్న ట్లొకపుడు — ముడుచుకొని ముడుచుకొని మూల దాఁగిన ట్లొకపుడు — నన్ను విడిచి యెక్కడికో పోయిన ట్లొకపుడు — గట్టిగఁ బట్టుకొనఁజూచినకొలఁది మంచు గడ్డవలెఁ బట్టు జాఱిపోవున ట్లొకపుడు—ఏమి ? ఇది యూధియా?

వ్యాధియా? రెండునా? చిరకాలమునుండి కనిపెట్టుకొని కష్ట నిష్ఠురతల కోర్చిన శ్రీనివాసునిజూడ నేమో యుదాసీనత!— నన్నుఁగాక మొన్న వచ్చిన దేవదేవిని జూడ నేమో యుత్సాహము! ఇందులకుఁ గారణ మే మనుకొనను?

దేవ—శ్రీనివాసా! మాటలాడ వేమి? గురువులవారికి నాపై నిష్ఠ లేకపోవుట యేల?

శ్రీని—నీపై యిక్కలి యిష్ట ముండుటచేతనే నిన్నుఁ బొమ్మనినారు.

దేవ—అది న్యాయమేనా?

శ్రీని—అభక్తుల కది విరుద్ధము గాని, భక్తుల కది న్యాయమే! భక్తుని కిష్టపదార్థ మొక్క శ్రీరంగఁడుతక్క నేదియు నుండఁగూడదు. ఇదిగో! నీవుగూడ భక్తురాలవే కదా! నీ కీ తత్త్వము నేఁ జెప్ప నేల?

విప్ర—(తనలో) అది యిట్టిదని యిదియన్న యిట్టి యననుభూతపూర్వావస్థలు కలిగినవేమో యని—భ్రమపడి—మనశ్చలనము కాదు—భక్తి సంకోచము కాదు—ప్రాపంచికాభిముఖత కాదు—ఒకటి తలఁచుకొనఁబోవ నొకటి వచ్చుట—అనఁగ—రంగని దలఁచు కొనఁబోవ, భక్తునిపై బుద్ధి పారుట—రంగనికి రంగరంగా యనుచుఁ బూలుగ్రుచ్చుచుఁడ, భక్తురాలి వినయవిధేయతా గురుశుశ్రూషతా సద్గుణసంపత్తిని గూర్చి యకారణముగఁ దలఁపు వచ్చుట—ఒకటి యన నేమి? మన సేమో రెండు భాగము లైనట్లును—దేహమునకు మును పెఱుఁగని విచిత్రసుఖ మేదియో కలుగుటచేత—నీ దేహము తత్పునరనుభవము నపే క్షించుచున్న దేమో యను సందేహ మాత్మకుఁ గలుగుట చేత—ఎందుల కైన మంచి దని—ఆమె నిశ్చలభక్తురాలు కావున నామె కెక్కడ నుండినను లోపము లేదని—ఇప్పటివఱ కంతబాధ యేదియు లేకున్నను—ముం దేది కలుగఁబోవునో యని సందేహించి—కొంచెము దూరముగ నుంచిన సర్వవిధ

ముల మంచిదే యని యెంచి—యీమెను స్వగ్రామమునకే వెంచేయఁ బ్రార్థించితి నని చెప్పు మని శ్రీనివాసు సంపితిని. ఈసరి కామెతోఁ జెప్పి యుండును. ఆమె నన్నుఁ గూర్చి యే మనుకొనునో? లోప మేదైన నున్నయెడల నది నాది కాని యామెది కాదు. (ముక్కు మీఁదఁ జేవైచుకొని) రంగరంగ రంగా! రంగా! రంగనామస్మరణమును నిరభ్యంతరముగఁ జేసికొనవలయు నని యిచ్చటఁ గూర్చుండి తదితరవిషయముల నన్నియుఁ దలఁచితిని. ఇట్టి మనోవికారమే—ఇట్టి యస్వాధీనచిత్తతయే యిప్పుడు ముఖ్యముగ నా కున్న బాధ. ఇది యెట్లు కలిగినను మాన్పుకొనక తప్పదు. అందులకుఁ బ్రశాంతత—నిరుపహతస్థలస్థత కావలసియున్నవి. శ్రీనివాసుఁ డింతకాలము నుండి యున్నాఁ డనుమాటయే కాని యతనిదారి యతనిది. అతఁడు నాకు లేనట్లుగనే ప్రవర్తించినాఁడు. కాని—యీ భక్తురాలు—భక్త్యత్యంతతచేఁ గాఁబోలు!—గురుసేవామహత్త్వచేఁ గాఁబోలు!—నాతో స్మరించి—నాతోఁ బాడి—నాతో నాడి—సర్వోపచారముల నాకుఁ జేసి—యనవరతముఁ గనిపెట్టి యుంటచేతఁ గాఁబోలు—నిట్టి విచిత్రావస్థ కలిగినది. కాన—ఈమెను దూరమున నుంచుటకంటెఁ బ్రస్తుతమున మార్గాంతరము గోచరింపదు. రంగరంగరంగా! రంగ!

దేవ—నీవు నాతోఁ జెప్పవలసిన దేదియు లే దంటివి కాన నేమఁబోయి గురువులవారినే యడిగెదను.

శ్రీని—నీ వింక నాయనతోఁ జెప్పుకొనవలసిన దేమున్నది?

దేవ—ఏమియుఁ జెప్పకపోయిన సెలవైనఁ దీసికొన వలదా?

శ్రీని—ఆయన సెలవును మదీయాముఖమున నీకుఁ బంపిరి కాదా!

దేవ—నీ మొగముసెలవుతో నాకుఁ బనిలేదు. నే నిచ్చట నుండుట నీకు మొదటినుండియు నిష్ట మున్నదా? నన్ను వదల్చుకొనఁగ నీవే యిట్లు మోసము చేయుచుంటి వేమో?

శ్రీని—నీబాధ నాకేమి యున్నది?

దేవ—గురువులవారి కేమున్నది?

శ్రీని—ఆయన కేదియో భయ ముండుటచేతనే పొమ్మనినారు.

దేవ—అది స్పష్టపఱచుకొనుటకే గురువులవారిదగ్గఱ మొకప్పు వలయును.

శ్రీని—ఆయన నిన్నుఁ దీసికొని రమ్మని నాతోఁ జెప్పియుండలేదు.

దేవ—తీసికొనిరావల దని చెప్పియుండకపోవుటచేత వచ్చెదను.

శ్రీని—అటులైన రమ్ము. నీవు వచ్చితి వని యాయనతోఁ జెప్పవలయును నీ వాతనియెదుట నిలువక చాటున నుండుము.

దేవ—ఆతని కీ దొంగభయ మేమి? నాకు దోఁచుచుండుట లేదు! నడుమ నీ సంధాన మేమి?

శ్రీని—ఏమియు లేదు. కూడ రమ్ము.

(ఇద్దఱును విప్రనారాయణునియొద్దకుఁ బోవుదురు.)

శ్రీని—నీ వీతులసికోటచాటున నుండుము. నేను గురువుగారితో మనవి చేసెదను. మహాత్మా! దేవదేవి యిటకు వచ్చినది.

విప్ర—ఏదీ!

శ్రీని—తులసికోటచాటున నిలువఁబెట్టితిని.

విప్ర—నేఁ జెప్పినయంశమును దానితోఁ జెప్పితివా?

శ్రీని—చెప్పితిని.

విప్ర—ఏ మనెను?

శ్రీని—ఏ మున్నది? పోయెద ననెను.

విప్ర—సంతోషపూర్వకముగనే యనినది కద!

శ్రీని—ఎట్లో యొక ట్లనినది.

విప్ర—ఎటులయిన నేమి? పోవుట కావలసినది. సరే! కాని యిప్పుడు దీన్ని నిట కేల తెచ్చితివి?

శ్రీని—ఆమెయే వచ్చినది.

విప్ర—ఏల?

శ్రీని—మీదర్శనముచేసి సెలవు తీసికొనుటకు—

విప్ర—సెల విదివఱకే యీయఁబడినది. నాదర్శనముతో నేమి పని యున్నది? నే నొక్కరంగనిదక్క నితరులఁ జూడ దలఁచుకొనలేదు. అట్టి వ్రతనిశ్చయుఁడ నైతిని. కావునఁ బోవచ్చునని చెప్పుము.

శ్రీని—(దేవదేవియొద్దకుఁ బోయి) మహాత్ముఁడు దర్శన మీయఁడఁట. వెడలి పొమ్మఁట.

దేవ—సరే! నీవు గురువులయొద్దకుఁ బొమ్ము.

(శ్రీనివాసుఁడు విప్రనారాయణునియొద్దకుఁ బోవును.)

దేవ—(తులసికోట చాటుననే యుండి) దర్శన మీయ నంటిరా? మహాత్మా! కోరెడది దర్శనమాత్రమే కదా! ఇంతలో మీకుఁ జెడిపోవున దేది? నాకు లాభించున దేది? మొగము చూపుటతోడనే నాకు మోక్షప్రాప్తి యగు ననుకొంటిరా? ఈ మాత్రమునకే యింతనిర్దాక్షిణ్యముగ నిరాకరింపఁ దగునా? చూచినంతమాత్రమున మిమ్ముల నే నెత్తికొని పాఱిపోవుదు ననుకొంటిరా? ఏల మీకీ సందేహము? భక్తశిఖామణు లగు మీకీ పట్టుదల యేల? దర్శనమే యీయరా? ఆఁ! ఎంతమాట! రంగనిమొగము ప్రసన్నముగ నుండలే దని గిజగిజ కొట్టుకొని దేవులాడితిరే! జ్ఞప్తిలేదా? తారకమార్గమునకై మీ రొకనిదర్శనమును గోరి పడరానిపాటులు పడుచున్నారు గదా! మీరే సర్వ మని యెంచి మీవలననే కడతేఱవలయు నని నమ్మి యున్న నాకు మీరు దర్శనమీయకుండ నిరాకరించిన నెంత క్షోభముగ నుండునో పరతంత్రతాకష్ట మెఱింగిన మీకే తెలియకపోవుట యేల? ఒక్కపూట రంగనియాలయములోనికి మిమ్ము రానీయకుండ నిరాకరించినచో మీమన సెటు లుండునో? ఇదియేనా మీభూతదయాపాటనము! సర్వసము లని,

జ్ఞానసంపన్ను లని, కరుణాప్రపూర్ణులని, శేషగుణసనాథు లని మి మ్మాశ్రయించితినిగాని యధికారతారతమ్యమును జూతు రనుకొంటినా? ఆశ్రితజనేంగితజ్ఞానశూన్యతగ నిరాకరింతు రనుకొంటినా? క్రూరమనస్కతచేఁ బొమ్మందు రనుకొంటినా? పాదములపైఁ బడినదానిని, పరిబలగర్వాతిరేకమున మొగమునఁ జూపక పాఁఱదోలుదు రనుకొంటినా ? అందఱిమొగములందుకంటె మీతిరుముఖమందు లావణ్యాదు లధిక మని చూడ వచ్చితినా! ఈ మాత్రపు మొగమునకు దృష్టిదోషము తగులు నని నిరాకరించితిరా ? మీ కెంగంటి చూపులతో నా పాపము లన్నియు నొకమాఱు భస్మము లగునని యే చూడ వచ్చితినా ! అందులకే వచ్చియున్నను మీ రిట్లు మొగమోటమి లేక నిరాకరింపఁదగునా ! దర్శన మఁట ! ఈయరఁట ! ఏమో? దర్శనమేమి తత్త్వజ్ఞానమా ? కైవల్యమా ? పరమపదమా ? భక్తులకు దర్శన మిచ్చి సంతసింపఁ జేయ లేని మీ తిరుముఖమండల మిఁ కెందులకు ? రంగమూర్తియే సమస్తజనసందర్శనప్రదాతయై, యఖిలభక్తవత్సలుఁడై, సర్వసులభుఁడై దుర్లభమైన పరమపదమును సహితము భక్తుల కిచ్చెద నని శపథము చేయునట్లు తిరుత్తుళ్ళాయిని శిరముపై ధరించియుండ రంగభక్తులగు మీ కీ స్వత్వస్వచింత లేల ? చతుష్పాదజంతు వగు గజేంద్రుఁడు భక్తితో భూమినుండి కేకలు వేయ, వైకుంఠమునుండి, భార్యతోఁ జెప్పక, పెరియ తిరువడిని చూడనే చూడక, పైన నుత్తరీయ మైన నున్నదో లేదో యెఱుఁగక, పాదచారియై పరుగు లిడుచు ధావనావేగమునఁ గట్టుబట్ట యట్టె చలించుచుఁ గొజ్జనుండి జారిపోవ, నిలువఁబడి బిగించుకొనిన నాలస్య మగు నేమో యని చేతితోడనే కుచ్చిళ్ళు సడలిపోకుండఁ బట్టికొనుచు నెందులకో యేమి చేయవలయునో కూడ నెఱుఁగని మహోత్కంఠతచేఁ దనకొంప మునిఁగిపోయినట్లు, తలపుట్టి మునిఁగినట్లు శ్రీమహావిష్ణువు వచ్చి తన దివ్యముఖార

విందసందర్శనసేవ గజేంద్రునకు సాయించి యుండ, నష్ట విష్ణుని పాదదాసు లని, భక్తు లని, ప్రపన్ను లని లోకముచే నెన్నంబడుచుండు మీరు—అట్టిమీరు—అయిదు మాసములనుండి మిమ్మాశ్రయించి, సేవించి, పూజించి, మిమ్మే మహావిష్ణునిగ నమ్ముకొని తరింపవలయు నని యెంచి — తులసికోటచాటున నిలువంబడి "దర్శనమో, దర్శనమో" యని పెరుమాళ్ళకోవెల చుట్టు గోపురములు ప్రతిధ్వను లిచ్చునట్లు మొఱ్ఱో యని యఱవ — చెక్కు చెదరకుండ — నలుసంత యావేగమైన నొందక — పాపము! అస్వతంత్రురా లెందులకు దర్శనము వాంఛించుచున్నదో తెలిసికొంద మను కొంచెము చింతయైన లేక — "దర్శనమునకు వీలు లేదు" అని, యాహా! ఆహా! వార్త నంప సాహసించితిరి! సెబాస్! ఇది మీకే తగును! మీ మొగమువంటి మొగములు లోకమున నెన్నికోటులు లేవు. తుచ్ఛులగు విటాధముల మొగము చూడనొల్లక మీ మొగము దంతకంటె దైవకటాక్షవిశేషమున నేదియో కించిదాధిక్య మున్న దనియేకదా యిచ్చుటకు వచ్చితిని. ఆ మాత్ర మాలోచించుకొన నక్కఱ లేదా?

విప్ర—రంగరంగరంగా! దాని నిచ్చుటకు రమ్మని చెప్పుము.

శ్రీని—వలదు. వలదు. అందువలన నేమి ప్రయోజన మగునో?

విప్ర—ప్రయోజన మే మున్నది? ఆమె చెప్పినట్లు, దర్శన మిచ్చుటలో మహాకష్ట మే మున్నది! ఇచ్చుట యిచ్చుట యనుటే కాని యేమి యీవలయును? తలందీసి యామె చేతిలోఁ బెట్టవలయునా! మొగ మెత్తుకొని యొక నిముస ముండలేనా? కన్నులు తెఱచుకొని యొకయింతసే పుండలేనా? కష్ట మేమియు లేదు. వైష్ణవులమైన మన కిది తగదు. ఆమె మాటలు సహేతుకములుగ నున్నవి.

శ్రీని—దేవా! నామనవి వినుఁడు. వలదు. ఎదుటకు వచ్చిన తరువాత నామె తిరిగి పోదు. మీరు కఠినముగఁ బొమ్మన లేరు.

విప్ర—అదేమి మాట? ఇదివఱకు నేను బొమ్మనకుండనే నీవు చెప్పితివా? తిరిగిపో దని యెట్లు చెప్పఁగలవు? దర్శనమునకు రావలదనిన నిన్ని మాటలు తులసికోట చాటున నిలువఁబడియే యాడినది కాని యెదుటఁ బడినదా? తల నెట్టు వంచియుండఁ జూచినదా? అట్టి గుణవంతురాలు—

శ్రీని—అయ్యయ్యో! అది కనఁబడునో లేదో యని యట్లు మీరు చూచుచున్నారా?

దేవ—అయ్యా! మహాత్మా! ఇఁకను దర్శన మీయరా? నావలన పాప మేమి కలిగెను? విటుల కీ దేహము నమ్ముకొనకుండ మీ కర్పణము సేయుట పాప మయ్యెనా? దుష్కృతిభూయిష్ఠమైన యిల్లు వదలుకొని మీ పుణ్యవనమునకు వచ్చుట పాప మయ్యెనా? త్రాగుడును మాని తులసి తీర్థమును పుచ్చుకొనుట పాప మయ్యెనా? జారుల తెంపలు వాయించుట మాని వీరవైష్ణవుని పాదము లొత్తుట పాప మయ్యెనా? బూతుకూఁతల మాని పాశురములఁ బఠించుట పాప మయ్యెనా? మిరియాల పూసల పేరులు పారవైచి తామరపూసల పేరులు వహించుట పాప మయ్యెనా? చీనాంబరము వదలి చినుఁగుల జేగురుగుడ్డను గట్టుకొనుట పాప మయ్యెనా? మీకుఁ దిరుమంజన మొనర్చితినే! మీకాళ్లు గడిగి తీర్థముగఁ ద్రావితినే! మీబట్ట లుదికితినే! మీయెంగిలిమెదుకులు శ్రీమహావిష్ణు ప్రసాద మని కనుల కద్దుకొని భుజించితినే! —ఇట్టిసేవలో బదునాలుగవభాగము శ్రీరంగమూర్తికే నేను జేసియుండినయెడల నాతఁడు — నన్ను — నన్ను—నిష్కపటహృదయనైన నన్ను — దిక్కుమాలిన యేకాకినైన నన్ను—అనన్యశరణ్యనైన నన్ను — ఆపన్ననైన నన్ను — ఆఁ! ఆఁ! ఇట్టి నన్ను—

విప్ర—భక్తురాలా! ఇటు రమ్ము.

దేవ—(పరుగునం బోయి) ఇదిగో! వచ్చితిని. శ్రీ విప్రనారాయణ మహాగురవే నమః. (చుట్టు తిరిగి సాష్టాంగ మాచరించును)

విప్ర—అడియేన్ దాసోహం. (తనలో) ఈమె నాచుట్టు నెట్లు గిరగిర తిరిగెనో నా చిత్తమట్లే తద్గమన మనుసరించి లోన స్వప్రదక్షిణము చేసెను.

శ్రీని—(తనలో) ఇక్కడినుండి యింక నేను బోవలయును గాని యీ హా కాసిముండ పోదు. గురువుగారికి రంగనిపై భక్తి పోవలయును గాని దీనిపై నభిమానము పోదు.

దేవ—స్వామీ!

శ్రీని—ఇంక స్వామి యెందులకు? దర్శన మైనది కాదా! పొమ్ము.

దేవ—దర్శన మైనది కాని, సెలవు పుచ్చుకొనుట యయినదా?

శ్రీని—ఇచ్చుట కాయన కే మున్నది? పుచ్చుకొనుటకు నీ కేమి కావలయును? దయయుంచి వేగ దయచేయుము.

దేవ—ఏమి మహాత్మా! నేను సెలవు తీసికొని పోవలసినదేనా?

విప్ర—భాగ్యము! (తనలో) రంగ రంగ రంగా! రంగ!

శ్రీని—సరి! సెలవైనది. నడు; నడు!

దేవ—ఊరక తొందరపడెద వేమి? మీ కిష్టము లేనపుడు పోక యిచ్చటనే యుండెద ననుకొంటివా?

విప్ర—శ్రీనివాసా! అది పోదని చెప్పితివి కాదా! మనదొడ్డి దాని కేమి కాణాచియా? మన మేమి దానికిం బంచభక్ష్యపరమాన్నములతో నారగింపు లిడుచుంటిమా? మనము దానిచేత దాస్యము చేయించుకొనుటయే తక్క నది యానడుమ రోగముతోం బడి పోయినప్పుడైనం గాసంత యుపచార మొనర్చితిమా? ఇల్లును, దల్లిని, దోంబుట్టువులను విడిచిపెట్టిన దిట్టి మనల నేల విడిచిపెట్ట లేకుండు నని యెంచితివి?

శ్రీని—ఇప్పుడు దేవరవారి నైచ్యానుసంధానము, స్వదూషణమును దానికిఁ దగినంతయుపచారములు చేయలేదనుటనుగూర్చియా?

విప్ర—రంగ రంగ రంగా! ఎట్లు గ్రహించితివి? భక్తురాలా! నీవు మా కంటె గుణసంపన్నురాలవు. మా కంటె దైన్యానురాగాధిక్యయుక్తురాలవు. మాకంటె నిశ్చలచిత్తవు. అయిన నేమి? సంసారులలో నొకనితో నొకఁడు కలసి విడిపోవుట యెట్లో భక్తులలోఁ గూడ నట్లే. మాయందు దయయుంచి నీవు దయచేయుము. అన్యథా యెంచకుము. (తనలో) రంగ రంగ రంగా! ఏదో యొకటి శీఘ్రముగఁ దెగతెంపు చేసికొనినఁ గాని మనస్సు శాంతిగ నుండదు. అబ్బ! రంగ రంగ రంగా! రక్షింపు. అపరాధుఁడను. అవగుణుఁడను. చంచలచిత్తుఁడను. రంగ రంగ రంగా!

దేవ—ఇఁకఁ బోవలసినదేనా?

శ్రీని—కిక్కురుమనకుండ—

దేవ—రంగ రంగ రంగా! రంగా! (ఏడ్చును)

విప్ర—అయ్యయ్యో! నిష్కారణముగ నిర్దోష నేడ్పించితిమి గదా! శ్రీనివాసా! నాగుండెలు తల్లడిల్లుచున్నవి. దాని నిఁక నేమన వల దని చెప్పుము.

శ్రీని—మన కేవఁడు చెప్పు నయ్యా!

విప్ర—అట్లాడెద వేల? మన కంతపట్టరాని చింత యే మున్నది? ఏమో! కొలఁదిదినములనుండి కన్నులయెదుటఁ దిరిగినది గదా యని కాని—ఇంతకుఁ బరమయోగ్యురాలు! పరమ శాంతాత్మురాలు!—

దేవ—రంగ రంగ రంగా! (ఏడ్చుచున్నది)

విప్ర—రంగ రంగా! ఎంత పాపము! నాకు బుద్ధివచ్చిన దాదిగ నేడు పెట్టిదో వినలేదు. అట్టిచో నాతులసీవనములోనే, నాకన్నుల యెదుటనే నాకు సర్వోపచారము లొనర్చిన రంగదాసురాలే

కినమగు నాయాజ్ఞమూలముగనే యేడ్చుచుండ నేను సహింపఁ గలనా? శ్రీనివాసా! నీవు పోయి యూరకుండుమని చెప్పుము. లేదా నే నెచ్చటికైనఁ బోదును.

శ్రీని—(తనలో) ఈతఁ డిటనుండి పోయిన మంచిదే కాని కదలనిచ్చిన నీతని వెంట యీామె పడిన మహాప్రమాదము సంభవించును. (ప్రకాశముగ) మహాత్మా! తాము మఱియొకరోటికె దయ చేయ నేల? దేవదేవీ! ప్రశాంత మగు నాశ్రమవనమును రోద నమున నపవిత్రమును జేయుచున్నావు. పో! పో! శీఘ్రముగఁ బో!

దేవ—(కోపమును నటించుచు బిగ్గఱగ) పోక పోవుదునా? పోకపోవు దునా? ఇదిగో! (వేగముగ నడచును)

విప్ర—(తొందరతో) శ్రీనివాసా! ఆఁగుమని చెప్పుము. ఈమె నెఖరిఁ జూడ భయముగ నున్నది. ఎచ్చటికిఁ బోవునో శీఘ్ర మడుగుము.

శ్రీని—ఎచ్చటికిఁ బోయిన మన కేమి మహాత్మా! పిశాచమును వదలనీయరా!

విప్ర—శ్రీనివాసా! నీకుఁ దెలియదు. దేవదేవీ! ఎచ్చటకు బోఁ దలఁచితివి?

దేవ—ఎచ్చటకుఁ బోయెదనా? రంగ రంగ రంగా! మీయొద్దనుండి నిష్కారణముగ మీరు గెంటివైచుటయే కాక నాప్రయత్న మును విఘ్నముగూడఁ జేయున ట్లపశకునపుమాటలఁగూడ నాడుచున్నారా?

విప్ర—చూచితివా? శ్రీనివాసా!

దేవ—స్వామీ! ఎచ్చటకుఁ బోవలయునో చెప్పవలయునా? స్వామీ! శిష్యుల కాచార్యాభిమానమే కాని యాచార్యు నకు శిష్యాభిమాన మక్కఱలేదా? ఆహా! దిక్కుమాలిన యీాబొందిలో నున్న యాత్మ నెంత సంతోష పెట్టితివి? చాలు, చాలు! ఎక్కడకుఁ బో నుంటినో చెప్పవలయునా?

మీ పాదసేవ నాకు లభింపదు గాని నాకష్టము లెట్లో కడ తేఱకపోవునా? కడుపుచల్లని కావేరమ్మ లేదా? శ్రీరంగ మూర్తి కిన్ని గోపురమండపాదులు గట్టుటకు భక్తు లిన్ని కోటులరాళ్లు సంపాదించినప్పుడు నాగొంతుకకుఁ గట్టుకొనుట కంతరాయి తెచ్చుకొనలేక పోవునా?

విప్ర—వింటివా? శ్రీనివాసా! నామూలమున నామె కెంత పర్యంతము వచ్చినదో!

శ్రీని—ఆమెమూలమున మీకు వచ్చినంతముట్టున కింక రాలేదు లెండు. ఆత్మహత్యలో మొదట నశించునది శరీరము. భక్తిభ్రష్టతలో ముందుగ నశించునది యాత్మ. లోకము మీకొఱకు విచారపడవలసిన స్థితికి రాకె యుండ మీ రామెకొఱ కేల విచారింతురు?

విప్ర—రంగరంగరంగా! నాకు భక్తి నశించుచున్న దనుచుంటివా?

శ్రీని.—నే ననుట యెందులకు? మీకుఁ దోఁచుట లేదా?

విప్ర—నీ వాలోచింపకుండ నేల మాట లాడెదవు? మనము పోమ్మనుటచే నామె మరణింపఁబోవ నున్నది. కాన భక్తాభిమానమున, భూతదయాప్రోత్సాహమున, ప్రత్యక్షదుష్కార్యారంభ విఘ్నకరణాపేక్షచే నట్లంటిని గాని, లోకములో నందఱికంటె నామె నా కెట్లధిక యగును? నాకన్నుల యెదుట జగత్తున నెందఱు స్వాభావికమరణము లొందలేదు? ఎందఱు బలాత్కారమృతుల నొందలేదు. వారందఱకొఱకు నేను విలపించితినా? మా తలిదండ్రులు నాయెదుటఁ బరమపదించినపుడు నేను గంట నీరైనఁ బెట్టితినా? అంత నిర్లిప్తతగఁ గాలక్షేపము సేయుచున్న నేను దీని చావుకొఱకు వగ నొందుదు నను కొంటివా? నేను జచ్చినఁగాని నారంగభక్తి నశించునా? అది చచ్చిన సరే! లోక మంత వినాశ మందిన సరే!

శ్రీని—(తనలో) పాపము ! జ్ఞాని మరణ మీమహాత్మునకు లోకవినాశముగ నున్నది కాఁబోలు ! స్త్రీసాన్నిధ్యమువలన బుద్ధిపూర్వకముగ నీతనిలోఁ గలిగిన మార్పును భూతదయామాహాత్మ్య మని, కష్టదర్శనాసహిష్ణుత యని, పరిచయసంజాతాభిమాన మని యీఁతడు భ్రమపొందుచున్నాఁడు. పాపము ! ఋశ్యశృంగునివంటివాఁడు ! అయిన నేమి? చెడిపోవ నున్నాఁడు.

విప్ర—వింటివా ? శ్రీనివాసా ! నా కిప్పుటు రంగేశసేవ తక్క నితర మేమియు నక్కఱ లేదు. అక్కఱ లేదు. రంగరంగరంగా ! (లెంపలు వైచుకొనును)

శ్రీని—(తనలో) ఇప్పటివఱ కింక స్వహస్తములతోఁ గొట్టుకొను నదృష్టము పోలేదు.

విప్ర—రంగరంగరంగా ! రక్షించు, రక్షించు ! చంచలచిత్తమునఁ బందుక్రోఁతిని — కఠినహృదయుతను గటికవానిని—రంగరంగ రంగా !

శ్రీని—(తనలో) భాగవతోత్తము మర్యాదకై తిట్టుకొనెడు తిట్టులు క్రమక్రమముగ సార్థకతలోనికి వచ్చుచున్నవి ! (ప్రకాశముగ) నేను బందుక్రోఁతి తోఁకచివరనుండు పేనను. కటికవానిపృష్ఠము క్రింది కొయ్యదిమ్మను. నారాయణ ! నారాయణ !

విప్ర—వ్యర్థుఁడను. అనర్హుఁడను. నిరుపయోగుఁడను. రంగరంగ రంగా ! (లెంపలు వైచుకొనును.)

శ్రీని—నేను గరిధూపమను. కుండపెంకును. గబ్బిలపుఁబెంటను. నారాయణ ! నారాయణ ! ఇదిగో ! భక్తురాలు ! ఆత్మహత్య మాట పరాకుపడి మా యుబుసులు వినుచున్నది కాఁబోలు ! నడు; నడు !

దేవ—నీ వెందులకుఁ గులికెదవు ? చచ్చినకంటె నెక్కువపని జరుగక తీఱదు. భాగవతోత్తమా ! తమయొద్దకు శుశ్రూషనిమిత్తము నన్నుఁ బంపిన భక్తిసారమునీంద్రుని నేను దర్శించునెడల మీ కా

మహాత్ముని తోఁ జెప్పవలసినమాట లేమైన నున్న యెడల జెప్పుఁడు.

శ్రీని—(తనలో) ఆహా! యిందితోఁ బరమపద మేగ నుంటివి! నీ కా మహాత్ముని దర్శనమే! సెబాస్! ఎంతదాన వైతివి. ఏ తెలుకులవానితో డనో! ఏ దూదేకులనాహేబుతో డనో! ఏ కుంభీపాకమునవో, ఏ యినుపగానుగ నడుమనో!—

విప్ర—ఈమె చక్రాంశసంభూతుఁ డగు మహాభక్తవరునిచే నిచటికిఁ బంపఁబడిన దనుమాట మఱచియేపోతిని. ఆహా! గొప్ప ప్రమాదము! ఇప్పు డెట్లు? దీనిని వదలుకొందుమా? పూర్వాచార్యశాసననిరాకరణ మొనర్తుమా? రంగ రంగ రంగా! క్షమింపుము. నిన్ను సంతతము తలఁపకపోవుటయేకాక యీ దుర్మార్గుఁడు నీ భక్తశిఖామణుల మర్యాదలుగూడఁ దీసివైచుచున్నాఁడు. రక్షింపుము. రంగ రంగ రంగా! రంగా!

దేవ—బ్రతికియుండి పాదుగడియక్రిందవఱకు బానిసతన మొనర్చితివి గాన నీ భక్తురాలను జేతిమీఁదుగఁ జంపఁదలఁచుటకు సాహ సించితిరి. కాని మీకు మంచిగాని చెడ్డగాని చేయక, మీ జోలికే రాక, చిరకాలముక్రిందట వైకుంఠగతుఁ డగు మహా చార్యపురుషుని మఱల నిట్లేల చంపెదరు? భగవంతుని కార్యము భక్తరక్షణము కాఁగ భాగవతుని కార్యము భక్తమారణమా?

విప్ర—శ్రీనివాసా! నా కీమాటలు వినఁ జైతన్య మెడలుచున్నది? ఈమె యిచ్చటికి వచ్చుటలో రంగదాసోత్తమాజ్ఞయే కాక రంగనియాజ్ఞ కూడను. ఇఁకను దాని నుపేక్షింపఁ దగదు.

శ్రీని—మహాత్మా! తిరిగి యిట్లాడెద రేమి? ఇది యంత దొంగవేస మని నేను మీతో నెన్నిమాఱులు చెప్పియుండ లేదు. మీ కేల జ్ఞప్తి లేదు?

విప్ర—నీవు చెప్పినది నచ్చకపోవుటచేఁ గాబోలు! అయినను దొంగ వేసము వేసిన మోసకత్తె యిచ్చటనే యున్నది కాదా? ఆమె దొంగతన మామెచే నొప్పుకొనఁజేసి పొమ్మను.

శ్రీని—వలదు. వలదు. ప్రాణము విసిగి అదియే పోవును.

విప్ర—అట్లు కాదు. నీకుఁ దెలియదు. నీవు దానిఁగూర్చి యూహించినదంత కేవల మూహాము. అది సత్య మని చెప్పుటకంటె నసత్యమని చెప్పుటకుఁ గారణము లధికములుగ నున్నట్లున్నవి. నీ యూహ యసత్యమై, యది భక్తురాలే యగు నెడల మనకు భక్తసంహారణపాపము, భగవద్ద్రోహపాపము, భాగవతాజ్ఞానిరసనమహాపాపము నిశ్చయముగ వచ్చును. బాగుగ నాలోచించుము.

శ్రీని—కాన నామెను బిలువక తప్పదా?

విప్ర—న్యాయముగఁ దప్పించుకొనుటకు దారి కనఁబడదు.

శ్రీని—(తనలో) ఆహా! ఎంత ప్రారబ్ధము సంభవించెను. (ప్రకాశముగ) దేవదేవీ! ఇటు రమ్మీ.

దేవ—పో! పో! నన్నుఁ బిలుచుటకు నీ వెవఁడవు?

విప్ర—భక్తురాలా! నేను బిలువు మంటిని. క్షమింపుము.

దేవ—మహాభాగ్యము. ఇదిగో! వచ్చితిని.

విప్ర—నీవు చెప్పఁదలఁచిన దేదియో చెప్పుము.

శ్రీని—దేవదేవీ! ఇచ్చటకు నిన్నుఁ బొమ్మని భార్గవులు స్వప్నమున సాయించి రని నీవు చెప్పినమాట ప్రథమకల్పితము. రంగనిముఖ మప్రసన్నముగ నున్నదని విచారించు గురువులవారిమాటలను నీవు ప్రచ్ఛన్నముగ విని స్వప్నసాక్షాత్కృత శ్రీరంగ రంగ దాజ్ఞా ప్రబంధానల్పకల్పవల్లిని నీవు మఱొకదాని నల్లితివి. నా కవి నమ్మకము లేదు.

దేవ—నీవు నీతండ్రికిఁ బుట్టితి వని నీకు నమ్మక మున్నది కద!

శ్రీని—మహాత్మా! ఎందులకు మీకీబాధ, నాకీ తిట్లు? ఋజువు కాఁదగని యంశము లెల్ల ఋజువుపడఁగలవు? పూర్వపశ్చాదంశములఁ బట్టి కొన్ని సత్యము లని గ్రహింపవలయును. అటులే కొన్ని యసత్యములుగ గ్రహింపవలయును. కాని నిదర్శనమెల్ల చూపవచ్చునా?

విప్ర—కొన్ని సత్యములుగఁ గొన్ని యసత్యములుగ గ్రహింపవలయునని యంటివే? ఇది సత్యముగనే గ్రహింపఁదగిన దేమో?

దేవ—గ్రహింపఁదగిన యావశ్యకత లేదు. మీ శిష్యుఁడనిన ట్లన్నియు నసత్యములే. మీకు స్వప్నములు లేవు. తిరుభక్తిసార భగవానులు లేరు. శ్రీరంగదేవుఁడు లేఁడు. సరియేనా?

విప్ర—రంగరంగరంగా! రంగ! ఎంత పాపము! (చెంపలు వైచుకొనును.) ఎంతపాపము! మేము నాస్తికుల మగుదుమా?

శ్రీని—(తనలో) వేశ్యాదాసు లగుటకంటె న ట్లగుటయే మంచిది. అందులో మతము లేకున్న నీతియైన నున్నది.

దేవ—నాస్తికులు మ తెక్కడనో యుందు రనుకొంటిరా? ఇక్కడనే యుందురు. నాస్తికు లనఁగ మ తెవ్వరో యనుకొంటిరా? వారును నరులే. నాస్తికులకుఁ గొమ్ములు తోఁక లుండు ననుకొంటిరా? వారు మీవంటివారే. నాస్తికత యనఁగ మ తెట్టిదోనా! ఇట్టి చిత్తస్థితియే.

విప్ర—భక్తురాలా! నాకు రంగభక్తియే క్షయించిన దని లోలోపల నడికి యేడ్చుచున్న నన్ను నాస్తికుఁడని పిలిచి చంపివేయకుము. నీ చరిత్రస్వచ్ఛతనుగూర్చి యవిశ్వాస మింతనికిఁ గాని, నాకుఁ గాదు. రంగనిపాదములతోడు. నీవు పరిశుద్ధురాల వని—పరమభక్తురాల వని—నాకుఁ బూర్ణమైన నమ్మకము. కాని నా ప్రారబ్ధమువననో, నాకుఁ దెలియని మఱి యేకారణమువననో కాని నాకు రంగభక్తిలోఁ జలనము కొంత గలుగుచున్నది. మహాభక్తురాల వగు నిన్ను శ్రీరంగమూర్తి నాకంటె నెక్కువగఁ

గటాక్షించుటచే నా కన్నులు తెరవఁబడిన దేమో? లేక నే నెఱుఁ గనిదోషముచే నాపై రంగని కాగ్రహము కలిగినదేమో! ఎటులైన నిప్పుడు భక్తిలో నీకు లొంగిపోయితిని. రంగ కృపాధికతచే నీవు కృతార్థతను బొందగలవని నా యసూయా రహితమైన యభిప్రాయము.

దేవ—సరే. అయ్యా! శ్రీనివాసా! నా యాగమనముఁగూర్చి నీతోఁ జెప్పిన శ్రీరంగభక్తసారాచార్యప్రసంగ మంతయు నీకు నమ్మకము లేదు. కాన నది యాతయు నసత్యమనుకొందము. కాని—ఇటు చూడు—నేను నీ కెదుటఁ గనఁబడుచుంటినా!

శ్రీని—కన్ను లింక నున్నవి కాదా!

దేవ—ఇట్టిదుర్భాష లాడిన నీ కది యాశ్చర్యమే—కాని, యది యటుంచుము. నేను నీవలెనే నరకోటిలోదాన నను నమ్మకము నీ కున్నదా?

శ్రీని—ఆ!

దేవ—నే నిక్కడదానను గాక యెచ్చటినుండియో వచ్చితి నను దృష్టి నీ కున్నదా?

శ్రీని—సందేహ మేమి?

దేవ—అక్కడ నా కొక యట్టె కొంపయో, నొంతయిల్లో యుండు నని నమ్మఁగలవా?

శ్రీని—కలను.

దేవ—నే నొకతల్లిగర్భమునఁ బుట్టినదాన నని విశ్వసింపఁగలవా?

శ్రీని—ఆ!

దేవ—నాకు సోదరులు, బంధుగులు మొదలగువా రుండిరనునమ్మకము న్నదా?

శ్రీని—అది నా కెట్లు తెలియును?

దేవ—పోనీ! మీరు నాకు సోదరులు కారుగద? బంధువులు కారుగద?

శ్రీని—కాము.

దేవ—నే నిటకు రాకమునుపు నన్ను మీరు, మిమ్ము నేను నెఱింగి యుండలేదుకద ?

శ్రీని—నిన్ను మే మెఱుఁగము. నీవు మ మ్మెఱుఁగుదువేమో ?

దేవ—సరే. నే నెఱుఁగుదును. ఐహికసంబంధముచే మీకు నా కభిమాన ముండఁదగినకారణము లేమైన నున్నవా ?

శ్రీని—లేనట్లే.

దేవ—సందేహింతు వేల ? ఏకశాఖాసంబంధముగాని, ఏకగ్రామనివాస సంబంధముగాని, సంతతసందర్శనసంబంధము కాని, ఏకమిత్ర గ్రహణసంబంధము గాని, మఱియేసంబంధముగాని మీకు నా కున్నదా ?

శ్రీని—లేదు.

దేవ—సరే ! మీరు కట్టుకొన్నవి కాషాయములే కద ?

శ్రీని—ఔను.

దేవ—నేఁ గట్టుకొన్నది జేగురుపాతకాదా ?

శ్రీని—ఆఁ !

దేవ—ఇంతకంటె మంచిబట్ట దొరుకక కిది కట్టుకొన లేము కద ?

శ్రీని—లేకపోవచ్చును.

దేవ—మీమెడలోనివి నా మెడలోనివి తులసిపూసలపేరులేనా ?

శ్రీని—ఆ !

దేవ—చిన్నమెత్తు బంగారము నాఁడుదాననయ్యు మెడఁ గట్టుకొనుటకు దొరకకపోవుటచేఁ గాదుకద ?

శ్రీని—కాదు.

దేవ—మీ రేకభుక్తదీక్షులేకద ?

శ్రీని—ఔను.

దేవ—నేనో?

శ్రీని—నీవును.

దేవ—ముష్టి యెత్తుకొనినను రెండవపూట మెతుకులు దొరుకక పోవుటచేతఁ గాదుగద?

శ్రీని—కాదు.

దేవ—మీరు బ్రహ్మచర్యవ్రతనిష్ఠులే కదా?

శ్రీని—దైవకటాక్షముచే నిప్పటివఱకు—

దేవ—నేనో?

శ్రీని—నీపూర్వపు తగులాటములు మే మెఱుఁగని విట్టిఁగలవు?

దేవ—నే నిచ్చటకు వచ్చినతరువాతనైన నాబ్రహ్మచర్యవ్రతదీక్షలో భంగ మేమైన మీరు గాంచితిరా?

శ్రీని—లేదు.

దేవ—నేను యౌవనవతినైనట్లు నీకుఁ గనఁబడుటలేదా?

శ్రీని—నే నది యెట్లు చెప్పఁగలను? పొంగలి గంగాళమువలె నున్నావు.

దేవ—సరే. నేను సురూపను గానట్లు నీకుఁ గనఁబడుచుంటినా?

శ్రీని—సురూపలను జూచి యేడ్చితినా యేమి?

దేవ—పోనీ! నే నింద్రియలోలత గలదాననైనయెడల నాకుఁ దగిన మగని నెవనినో చూచుకొనఁగలనా?

శ్రీని—వైష్ణవాలయ మున్నచోట మగలకు మాలకాకులకు లో టేమి?

దేవ—నేను మన గురువుగారికి సర్వోపచారములను జేయుచుంటినా?

శ్రీని—అందులకు గురువులే సాక్షులు.

దేవ—తుచ్ఛమైన యీ శరీరమును పోషించుకొనుటకే నే నీ దాసితనమున కొప్పుకొంటినా?

విప్ర—రంగరంగరంగా! ఎంతమాట!

దేవ—శ్రీనివాసా! నీవు మాటలాడ వేమి?

శ్రీని—గురువుగారు ప్రత్యుత్తరమును సాయించిరికాదా?

దేవ—ఉండుకొనుటకు మా గ్రామమున నిండ్లు లేవా? తోముకొనుట కట్లు లేవా? పట్టుకొనుటకుఁ గాసులే దొరకవా? సేవించుటకు నరులే దొరకరా? ఇట్టి నీచత కొడఁబడి పరమనీచమైన యీ దేహమునే పోషించుకొనఁదలఁచినయెడల నింతకంటె సుఖకరమగు సేవావృత్తి మఱియొకచోట లభింపఁగలదు కద!

విప్ర—రంగ! రంగ! ఒకనికి దాస్య మొనర్చినదనుక నీ కేమి?

దేవ—శరీరపోషణమునకుఁ గాక—శరీరముకంటె భిన్నమైన ఏక తత్త్వమును బోధించుకొనుటకు మన గురువులవారికి నీ వలెనే యిల్లు వదలి వనముఁ జేరి కాషాయధారణముఁ జేసి బ్రహ్మచర్యవ్రత మొనర్చి యైహికేతరానందముకొఱకు నీ కంటె నెక్కువసేవఁ జేసితి నని స్పష్టపడుచున్నదా?

విప్ర—రంగరంగరంగా! చెప్పవలసిన దేమి?

దేవ—శ్రీనివాసా! నీవు రెండుమాటలనుండి యామోదించుట లేదేమి?

శ్రీని—గురువులవారి యామోదములు హెచ్చగుటచే నానోరు పడిపోయినది.

దేవ—శరీరభిన్నమైన తత్త్వ మాత్మయే కద?

శ్రీని—ఆ!

దేవ—ఆత్మను సుప్రసన్నముగ, బరిశుద్ధముగ, శేషగుణ సంపన్నముగ, గురుజనానురాగ యుక్తముగఁ జేసికొనువాఁ డెవఁడు?

విప్ర—రంగరంగరంగా! వాఁడేకదా భక్తుఁడు!

దేవ—అట్టిచో నీవు భక్తుఁడవు? నేను దొంగనా?

విప్ర—రంగరంగరంగా! ఎంతమాట!

దేవ—అట్టి భక్తుఁడు స్త్రీ యైనప్పుడు దాని నేమందురు?

శ్రీని—భక్తునిభార్య యందురు.

విప్ర—ఆమె యట్లు సహేతుకముగ మాటలాడుచుండ నీవు పరిహసిం
చుట తగునా ?

శ్రీని—ఈమె చెప్పిన దంతయు నసత్యమని నాకు లోనఁ బ్రబలముగ
దోఁచుచున్నప్పటికి నీమెకుఁ దగిన ప్రత్యుత్తర మీయలేని
యశక్తివలనఁ గలిగిన దుర్జనత్వమునఁ బుట్టిన [illegible]
వెల్లడించితినిగాని యీమెను బరిహసింతునా !

దేవ—మహాత్మా! వింటిరా? కార్యకారణభావ మంతయు నీతఁ
డొప్పుకొనినాఁడు. కాని పర్యవసానమునుగూర్చి నమ్మఁడఁట !
దీనిపేరు తలతిక్కకాదా ? దీనిపేరు నాస్తికత గాదా ?

విప్ర—ఆతనిజోలి నీ కెందులకు ? నీవు మహాభక్తురాల వని నాకు
సంపూర్ణవిశ్వాస మున్నది.

దేవ—భక్తురాలికి బహుమానము పరిత్యాగమా ? ఈతఁడుకూడ
భక్తుఁడేకదా? భక్తియే పొమ్మనుటకుఁ గారణమగు నెడల
నీతని నేల పొమ్మనలేదు.

శ్రీని—అనని వేళ దాఁటినదా ? మీ రిద్ద రొకటియే యగుదురు. నన్నే
వేఱుచేయుదురు.

విప్ర—ని న్నేల పొమ్మంటినో కారణము చెప్పెదను వినుము. నీవు
భక్తురాలవు. నీవలన నెంతమాత్రమును లోపములేదు. కాని
నీ విటకు వచ్చిన రెండుమూఁడుమాసములనుండి నా కేమో
కాని యొకవిచిత్రమైన...

శ్రీని—(అపవారించి) ఆమాట చెప్పకొండు రేమయ్యా ! అది గృహచ్ఛి
ద్రమయ్యా ! ఆత్మదోష మయ్యా ! అది చలితేంద్రియత
యయ్యా ! అందుచేతనే భక్తిచ్యుతి యయ్యా ! (నోరు మూసి
కొని) దాచఁదగినది వెల్లడించుకొందు రటయ్యా !

విప్ర—నాకు రహస్యము లేదు. నామన సాకాశమువలె నందఱికి బట్ట
బయలు కాఁదగినదే. అది నాదోషమే యగునెడల నిర్భీతిగ
నొప్పుకొనెదను. దోషమును నిష్కపటముగ నొప్పుకొనుటయే

దోషప్రాయశ్చిత్తము. హృదయమున నున్నదోషములు వెళ్లిం చుకొనక లోననే దాచుకొన్నయెడల వ్యాధివలె వృద్ధినొంది నశింపఁజేయదా? భర్తృరాలా! అనిర్వచనీయమైనయొకమనస్థితి నీదర్శనమున నాకుఁ గలిగి వృద్ధియగుచున్నది. అది యవాఙ్మనసగోచరమగుసుఖము నిచ్చుచునేయున్నది, కాని—చూడు! ఏమార్గము ననుసరించి తరింపఁదలచితినో యామార్గమునుండి యట్టె యిట్టె తప్పి—మఱల పడి—మఱల తప్పి—క్రమక్రమముగఁ దత్పథమునకు దూరముగఁ బోవుచుంటినో లేక యింకఁ బోదునో యనుభీతిచేత—

దేవ—శ్రీనివాసా! చీ! చీ! చీ! కుక్క అదిగో! తిర్వారాధనపుమడి సంచిని ముట్టుకొనినది.

విప్ర—అయ్యయ్యో! పొమ్ము! పొమ్ము!—

శ్రీని—(తనలో) కుక్క సాలగ్రామసంపుటము నైదుమాసముల క్రిందటనే స్పృశించినది. ఇఁకను నోటఁ గఱచుకొనిపోవుటయే తరువాయి! చీ! చీ! చీ! (లోనికిఁ బోవును)

దేవ—(విప్రనారాయణుని రెండుచేతులు గట్టిగఁ బట్టికొని) మహాత్మా! నన్ను వదలకుఁడు. నేను మిమ్ము వదలను.

విప్ర—అయ్యయ్యో! రంగరంగరంగా! నాచేతులను వదలుము. లోపల నేదియో యాపాదశిరఃపర్యంతము జల జల లాడుచున్నది, ఒడలు పులకిత మగుచున్నది. రంగరంగరంగా! నన్ను వదలుము. నే నిదివఱకు నీతోఁ జెప్పుకొనినవికార మిదియే. ఇది నీవలననే కలిగినదికాన నీవు దూరముగ నుండి నను క్షమింపుము.

దేవ—నావలన లోప మేమైన నున్నదా? నాయొడలు పులకితమైనదో లేదో చూడుఁడు. (ఆతనిచేతితోఁ దన్ను స్పృశింపఁజేయును.)

విప్ర—రంగరంగరంగా! నీవలన నెంతమాత్రమును లోపములేదు. నీకు నావంటిమనస్థితి లేదు. నాప్రారబ్ధమున నాకుఁ గలుగుచున్నది.

దేవ—లోపము మీదైయుండ శిక్ష నా కేల?

విప్ర—రంగరంగరంగా! రంగ! నా కేమియుఁ దెలియకున్నది.

దేవ—ఇంద్రియనిగ్రహమున నాశక్తని కూర్చి నన్నెఱిఁగినంతవఱకందఱెఱుఁగుదురు. నేను మిమ్ముల నాశ్రయించుటకు వచ్చితినని లోకమంతయు వెల్లడియైనది. ఇప్పుడు మీరు నన్ను వదలుకొనఁగనే భక్తుఁడగు విప్రనారాయణుఁడు దేవదేవిని జూచి పంక్తిగిలింపఁబోవ దేవదేవి యాతని నిరాకరించి, తిరస్కరించి, వెడలిపోయిన దని మీకుఁ గలుగఁదలఁచినయప్రతిష్ఠ నేను గాదు కదా? లోకమైన సహింపలేము. నామూలమున నట్టిదుర్వాక్యము ప్రబలుటకంటె నే నిప్పుడిక్కడనే ప్రాణత్యాగ మొనర్చుట మంచిది. నేను సర్వసిద్ధముగ నున్నాను.

విప్ర—అయ్యయ్యో! ప్రాణత్యాగ మేల?

దేవ—అట్లు లంటిరి కాన మీ వనములో నే నుండెదను. మీకుఁ దఱచుగఁ గనబడను. చెట్లచాటునఁగాని శ్రీనివాసునిచాటునఁగాని కూరుచుండెదను. నేను లేనట్లే మీరు భావింపవచ్చును. మీయాత్మను రక్షించుకొనుఁడు. నా యాత్మను గాపాడుఁడు.

విప్ర—నీవు తఱచుగ నాకుఁ గనబడకపోవుటచేత నిట్టి మనస్స్థితి క్రమముగ నశించు నని నీ యభిప్రాయమా?

దేవ—నశింపనే నశించును. నశింపక వృద్ధియగునెడల నటుపైనఁ జూచుకొనవచ్చును.

విప్ర—వృద్ధి యగుటయే! రంగభక్తిచే నిర్మూలన మొనర్తునుగాని—

దేవ—చిత్తము. మఱింత మంచిది.

విప్ర—నాచేతు లింక విడువుము.

దేవ—(తనలో) ఇప్పటి కింతతో సరిపెట్టెదను. (విడుచును)

విప్ర—నీవు తులసికోటచాటున కింకఁ బొమ్ము.

దేవ—చిత్తము. (పోవును.)

విప్ర—రంగరంగరంగా! (లెంపలు వైచుకొనును.)

చేన—(తనలో) లెంపలు కొట్టుకొన్న సరే, ఇంకఁ దల నేలను వ్రచి మోదుకొనిన సరే, గొంతుకవఱకుఁ బూడ్పించుకొని గోతిలోఁ గూరుచుండినసరే, కాళ్ళపైఁ దలక్రిందుగ వ్రేలాడినను సరే! రంగభక్తి జబ్బున జాఱిపోక మానదు. దేహమునఁ బ్రవేశించిన విషము జరజర తల కెక్కక మానదు.

విప్ర—రంగరంగరంగా! రంగ!

గీ॥ కష్టదశ వచ్చెనయ్యా! రం♦గయ్య! నాకు
నిశ్చలంబుగ నీభక్తి ♦ నిలువ దయ్యె!
నాదుప్రారబ్ధ మేమొ రం♦గా! శుభాంగ!
యెట్లు నిలువఁబెట్టెదొ నన్ను ♦ నింకమీఁద.

ఆ॥ వె॥ బుద్ధి దొంగగొడ్డు ♦ పోలిక నట్టిట్లు
పరుగు లిడును దుష్ఫ♦ఫలముఁ గోరి
దాని మెడను గుదియఁ ♦ దగిలించి నీయెట్ట
యెదుటఁ గట్టిపెట్టు ♦ మింక రంగ!

చేన—(తనలో) దొంగగొడ్డునకు గుదియ వైచినంతమాత్రమునఁ బరుగు లడఁగవు. అంతకంటె దొంగదగు మఱియొక గొడ్డుతో లంకె వేయవలయును. అదియుఁగూడ సిద్ధముగనే యున్నది కాదా!

విప్ర—శ్రీనివాసుఁడు లోనికిఁ బోయి యింకను రాకున్నాఁడు — ఇది యేమి? నిశ్చలభక్తితో రంగని దలఁచుచుండఁ నింతలో శ్రీనివాసుఁ డేల స్మృతికి రావలయును? (ఆలోచనము నటించుచు) అదిగో! దొంగగొడ్డు—పాఱిపోవుట— యనుమాటలు, కుక్క—మడిసంచి— తగులుట— పాఱిపోవుట— యనుసంశయములు జ్ఞప్తికిఁ దేఁగ నందుపైఁ గుక్కను గొట్టఁబోయిన శ్రీనివాసుఁడు స్మృతికి వచ్చినాఁడు. భక్తినిశ్చలత్వమే ఖరి యిట్లున్నది. రంగ రంగరంగా! ఏమి చేయుదును? నాబ్రదు కింక నధోగతియేనా? అయ్యయ్యో! రంగా! రంగ! నీపవిత్రనామమును నోట స్మరించు చుండ మనసులో దొంగకుక్క సంచరించుచున్నది. ఇట్ట

పరమపాపిష్ఠుఁడనైన నేను నిన్నింక స్మరించిన వినియోగ మే మున్నది? మఱింతమిక్కిలి పాపముకూడ నేమో! అయ్యయ్యో! రంగ! రంగరంగా! (తలఁబట్టుకొనును.)

దేవ—(తనలో) నీవు నెత్తిపైన నీ చేతులతోఁ గొట్టుకొనిన రసము లేదు. నేను ముందు నాట్యము సేయుచుండ, మాయక్క వెనుక తాళప్రహారము సేయ, నీవు వెనుకఁ దిత్తి నూఁదుచుఁ గుక్క పాటులు పడి యూఁదఁ బూనివేయ, నప్పు డెడమచేతి తాళపుఁ జిప్పతో మాయక్క నీ నెత్తిపై టంగున బ్రహ్మరంధ్రస్థానమునఁ గొట్టినప్పుడు—అది రసయుక్తమగు దెబ్బ! ఆదెబ్బతో గిరగిరఁ దిరిగి తలప్రాణము తోఁకకు వచ్చినప్పుడు రంగభక్తి తిరుగఁ గుదురవలయును గాని యిప్పుడు నిప్పులలోఁ బడి పొరలినఁగాని వినియోగము లేదు.

విప్ర—రంగరంగరంగా! రంగ! నాబుద్ధి నిశ్చలముగ నుంచవా! (కొంతుక బాగుగ సవరించుకొనుచున్నాఁడు) రంగా! (కేక వేయును.) గొంతేమో బొంగురుపోయినను జీరగలిగినట్లును వచ్చుచున్న దేమిచేతనో? ఆహా! మృదుమధురనాదము చెప్పవచ్చినప్పుడు దేవదేవిదే. అది రంగనామము స్మరింప నాయెడలు జలజలమని యమితానంద మిచ్చుచుండెను. దానిని నాప్రక్క నుంచుకొని దానిచే రంగనామమును స్మరింపఁజేయుచు నేను సుఖముగ వినుచుండిన యెడల నేను స్మరించుటకంటెను నెక్కువఫలప్రద మేమో యనుకొందును. కాని యిది యొక ప్రారబ్ధము సంభవించెను. అది నా కంటఁ బడుటకు వీలు లేదు. ఆ సమయమున నేను గన్నులుమూసికొని వినువేడల నదియు కనఁబడదు. చిత్తమునకుఁ జక్షువుల గుండ బాహ్యప్రవర్తనము లేకుంటచే మఱింత నిశ్చలత గుదుర వచ్చును. చూడు! దేవదేవీ! అక్కడనే యుంటివి కాదా?

దేవ—(ఎదుటికి వచ్చి నిలువఁబడి) ఏమి సెలవు?

విప్ర—(కన్నులకుఁ జేయి యడ్డము పెట్టుకొని) నిన్ను నాయెదుటకు రమ్మంటినా?

దేవ—"ముందు దేవదేవీ!" యని మీ రంటిరి కాదా? ఎదుటకు రాకుండ నెట్లు చూడఁగలను?

విప్ర—(ఒక్కసారి దానివంకఁ జూచి) సరే,—సరే! నీవు పోయి చాటుననే యింకఁ గూరుచుండుము.

దేవ—(తనలో) ఇప్పుడు నావంక నీతఁడు చూచినచూపు వెఱ్ఱిచూపే! ఏమియు సందేహము లేదు. ఇట్టిచూపు చూడఁగ నీతని నెన్నఁడును జూచియుండలేదు. ఫలములు పూర్ణముగఁ బండని యుత్తరకంపు బిళ్ళలోవలె నీతనికంటిచూపులో నొక చిత్రమైనతళుకు, కొలదిపాటిరక్తియు, గానఁబడినవి. అయ్యవారులగారిభక్తికింక నాశ్వాసాంతము!

—"ఉహూ" అనుసరికే పాపము! పిలిచితి నేమో యని పరుగున వచ్చెను. ఏమి గురుభక్తి! ఏమి యాజ్ఞావిధేయత! ఏమి గురూపచారాభిలాషోత్కృష్టత! శ్రీనివాసుఁడుకూడ మంచివాఁడే అతఁడు కూడ నాసుఖమును జూచువాఁడే కాని, ఏమున్నేమి? పురుషోపచారములకొలఁది కేర్పరుపఁబడు స్త్రీ యొసర్చిన ప్రేమమునా? కాని, ఆతనికి నీనికిఁ బెద్దవైరముగ నున్నది. నా ప్రారబ్ధఫలములలో నీ గృహకలహ మొకటి. చెప్పినట్లు శ్రీనివాసుఁడు వినఁడు. దీనితోఁ జెప్పుటకే మన కొప్పదు. శ్రీనివాసుఁ డిదిగో వచ్చుచున్నాఁడు.

(శ్రీనివాసుఁడు ప్రవేశించును.)

విప్ర—ఏమైనది?

శ్రీని—అంతయు ధ్వంసమైనది.

విప్ర—తిరిగి యింకఁ బనికిరాకుండఁగనే?

శ్రీని—సంచిని నోటఁ గఱచుకొనిపోవ నే నడ్డగిలితిని. దాని నింట నుంచి స్నానము చేసి వచ్చితిని. స్నాన మొనర్చెఁగాని తాఁకఁ

దగనిపవిత్రవస్తువును దాఁకి స్నానముచేయవలసిన దుర్గతి యేల్ల పట్టినదో ? మహాత్మా ! దేవదేవి యేది ?

విప్ర—దానిమాట కేమిగాని ముం దీమాట చెప్పుము. అయ్యయ్యో ! ఎన్నిసాలగ్రామసంపుటములు ! ఎంత దేవతార్చనార్హసామగ్రి ! ఇది యంతయుఁ దిరిగి పరిశుద్ధి యింతట నగునా ?

శ్రీని—దానిమాట కేమి ? అది చెడినమాత్ర మేమి? నిముసములో బాగు చేయవచ్చును. పులికాపో, తిరుమంజనమో, నాగ్రోదమో యేదో యేడిచి నేను బాగుచేసెదను. దేవదేవిమాట యేమో ముందు చెప్పుఁడు. ఇది పోయినఁగాని మనకు గతులు నిలువవు. భర్తృల మైనతరువాత మాత్రము మఱల గడ్డిమసితోఁ దోమిన సరే, తడిపిన సరే, అరగఁదీసిన సరే, సాగఁదీసిన సరే, చంపిన సరే, తగులఁబెట్టినసరే కాని మడిసంచివలెమాత్రము మఱల పవిత్రము గాలేము.

విప్ర—నిమ్మళము ! అది యా చాటుననే యున్నది.

శ్రీని—అయ్యయ్యో ! పోయినది కాఁబోలు నని సంతసించితినే ! ఎంత ప్రారబ్ధమయ్యా ! ఎందుల కుంచితిరి ?

విప్ర—మ తేమియుఁ దొందరలేదు. కారణ మేదో సావకాశముగఁ జెప్పెదను. నాతో లోనికి రమ్ము. చూడు ! అక్కడ దేవదేవి యున్నది. దానిని నేను జూడను. కాన ముందు దానిని జట్టునఁ బొమ్మని చెప్పుము.

శ్రీని—మన కీ స్త్రీవిద్యోపాసన మెందుల కయ్యా ? దేవదేవీ ! ముందు నీవు పొమ్ము. (దేవదేవి పోవుచున్నది)

శ్రీని—మహాత్మా ! గడియగడియకుఁ గ్రిందిక్రిందికి జారుచున్నారు. మి మ్మాపుటకు నాతరము గాకున్నది. మహాత్మా ! మీరే కొంత పూర్వచింత చేసికొని మనసు గుదుటఁ బఱచుకొనినఁ గాని యెంతమాత్రమును వినియోగము లేదు. మహాపత్తు రానై యున్నది. మిమ్ముఁ గాపాడుకొనుఁడు. నన్ను రక్షింపుఁడు!

విప్ర—వెఱ్ఱివాఁడా! నే నంత చపలుఁడ నగుదు ననుకొంటివా? తొందర యేమియు లేదు. లోనికిఁ బోవలయును. చూడు! దేవదేవి వెళ్ళిన దేమో?

శ్రీని—అప్పుడే వెళ్ళినది.

విప్ర—అఁ! కాలిచప్పుడైన వినఁబడకుండ నెట్లు పోయినది?

శ్రీని—అది కనఁబడకపోయినను గాలిచప్పుడైన వినఁబడినదికాదుగదా యని విలపించుచుంటిరా? ఆహా! ఈ దిక్కుమాలినతలుపు చాటుతారుటలు, సందుగొందుల నిక్కిచూచుటలు మొదలైన ఘోషకూడ నేదులకు?

విప్ర—ఇటులా నీవు నన్ను గ్రహించితివి? కాని నియమ మెంత పట్టుదలతో జరుపుకొనుచున్నదో యని నేను సంతసించుచుంటిని.

శ్రీని—ఆ పట్టుదలలోఁ బదునాల్గవవంతయిన మీకు లేకపోయెనే యని నే నేడ్చుచుంటిని.

విప్ర—తొందర లేదు. మడిసంచి బాగుచేసికొని మఱల నిప్పుడే యిక్కడకు వత్తము రమ్ము.

శ్రీని—మనసు బాగుచేసికొనుట యంతకంటె ముఖ్యమైన పని.

విప్ర—సరే! మఱల వచ్చి చూచుకొనవచ్చును. రమ్ము.

(ఇద్దఱును నిష్క్రమింతురు)

ఇది తృతీయాంకము.

శ్రీ

విప్రనారాయణ చరిత్రము

చతుర్థాంకము

ప్రదేశము—విప్రనారాయణుని పుష్పారామము.

(ప్రవేశము—విప్రనారాయణుఁడు.)

విప్ర—గీ॥ నోరు రంగరంగా! యనఁ ♦ జోరబుద్ధి
యందు నా దేవదేవి య♦ల్లాడుచుండుఁ
గన్నులను మూసి రంగని ♦ గాంచఁబోవఁ
దొయ్యలియె నవ్వుచు నెదుటఁ ♦ దోఁచుచుండు.

గీ॥ దానిపై బుద్ధి మానఁగఁ ♦ దలఁపడినకొ
లంది తద్యోజనమె ప్రబ♦లముగ నయ్యె
మఱవఁ దలఁచినయంశంబు ♦ మఱవఁబూను
కొలఁది స్మృతిలోన బిగ్గఁ డా♦ర్కొనినయట్లు.

గీ॥ చిత్తమందు వేశ్యారక్తి ♦ చేరుకొలఁది
రంగభక్తి దూరం బయ్యె ♦ రసము కచిక
పిల్చినకొలంది తన్మధ్య♦విలసితమగు
వాయుమూర్తి యెగసి పోవు ♦ వైఖరిగను.

గీ॥ దివ్యముగఁ బూర్ణముగ రంగ♦దేవుఁ డిచ్చు
నాస్యసేవ ముత్ప్రదము; కా♦దనఁగఁ దప్పు
(లెంపలు వైచుకొనును.)
కాని పూలమాటున నింత ♦ గానఁబఱచు
తిరుమొగముసేవ ముద మెంతొ ♦ తెలియఁదరమె?

గీ॥ ఎప్పుడు కనఁబడ దొకవేళ ♦ నెదుటఁ బడఁగ
వలయునప్పుడైన మాసిన ♦ పైఁటచెఱఁగు
మాటునఁ దళుక్కు మని మెల్ల ♦ మాయ మగును
జలదగతశతక్రతుధనుః ♦ కలిక వలెను.

(దేవదేవి ప్రవేశించును.)

దేవ—ఈతఁ డేదో పైకి ననుకొనుచున్నాఁడు. ఇచ్చటనుండి విందును.

విప్ర—ఈదిన మిచ్చట నేదో యొకచిన్న పురాణకాలక్షేపమును నన్నుఁ జేయుమని శ్రీనివాసుఁ డూరక బలవంతపెట్టు చున్నాఁడు. కాలక్షేపకర్తను గాలక్షేపప్రియుఁడ నగునాకు భక్తిరహితముగనే కాని కాలక్షేపము గాకయున్నది. పూర్వాచార్యప్రసాదితగ్రంథములలో దేనినైనఁ జదివినయెడల నాకుఁ దిరిగి మనసు కుదుటపడునేమో యని శ్రీనివాసుఁడు దేవులాడుచున్నాఁడు కాఁబోలు !

గీ॥ చదివినంగాని చిత్తంబు ♦ కుదుటఁబడదు
హృది కుదుటఁ బడకుండఁగఁ ♦ జదువు టెట్లు ?
పెండ్లి కాకుండఁగ మదపుఁ ♦ బిచ్చి పోదు
పిచ్చి కుదరకయుండినఁ ♦ బెండ్లి కాదు.

ఏమి సేయవచ్చును.

దేవ—(తనలో) ఇట్టిసంధిని వారకాంత నుంచుకొనుటకంటెఁ దారక మార్గమునుమఱియొకటిలేదు. (తులసికోటచాటునఁగూరుచుండును.)

విప్ర—ఆహా ! శ్రీనివాసుఁ డింక నేదో పూర్వాచార్యకృతగ్రంథ మొక్కటి దెచ్చి చదువుమని చెప్పును గాఁబోలు! శిష్యుఁడు గురునికిఁ జదువు మంచి దని బోధించుట గురువు చదువుకొన కుండ మూల్గుట ! ఇట్టిరీతిగా నాబ్రదు కున్నది ! (శ్రీనివాసుఁడు ప్రవేశించును.)

శ్రీని—స్వామీ ! వచ్చితిని. నామనవిని మన్నింపవలయును.

విప్ర—దేవదేవి యింక రాలేదేమి ?

శ్రీని—(తనలో) ఈతని కెంతసేపును దృష్టి దానిపైననే నిల్చియున్నది. (ప్రకాశముగ) స్వామీ! పురాణశ్రవణమును నే నపేక్షించి యుండఁగ దేవదేవీదర్శనమును మీరు వాంఛించుచుంటిరా!

విప్ర—పాపము! అదిమాత్రము వినవలదా ? ఉన్నవా రిద్దఱు శిష్యులు. వారిలో నొకఁడు వచ్చి యొక్కతె రాకుండునెడల నాకుఁ గాల క్షేప మెట్లు జరుగఁ గలదు? కావున దానిని గూడఁ బిలువుము.

శ్రీని—ఇదిగో! వెళ్ళివచ్చెదను.

విప్ర—అక్కఱలేదు. ఇక్కడనుండియే బిగ్గఱగఁ బిలువుము.

శ్రీని—దేవదేవీ! దేవదేవీ!

దేవ—(ఎదుటఁ బడుచున్నది)

శ్రీని—అయ్యయ్యో! ప్రమాదము! స్వామీ! ఈవిసరుకఱ్ఱను మీ మొగమున కడ్డముగ నుంచుకొనుఁడు. (ఇచ్చును) దేవదేవీ! నీ విచ్చుటకు వచ్చి యెంతసే పైనది!

దేవ—నీవు రాకముందే వచ్చినాను.

శ్రీని—నీవు రాలేదని యింతసేపు గురువుగారు నాతో ముచ్చటించు చుండఁగ వినియుండియు వచ్చితి నని చెప్పలేకపోయితివా ?

దేవ—చెప్పినయెడల నీతోఁ బ్రసంగింపనిదే యేల యుత్తర మిచ్చితి నని నీ వధిక్షేపింతువేమో ? అదిగాక నాకుఁ గునికిపాట్లు కూడ వచ్చిన ట్లున్నది.

విప్ర—అసురసంధ్యవేళఁ గునికిపా ట్లేమి ? దేహములో నేమైన నారోగ్యలోపముగ నున్నదా యేమి ?

శ్రీని—ముందు జరుగఁబోవు పురాణ మీయఁదగిన ఫల మిప్పుడే యావే శించినదా ?

విప్ర—మాటలాడ వేమి ? ఏమైన జబ్బుగా నున్నదా?

దేవ—ఉన్నయెడల నెవనితోఁ జెప్పుకొనను ?

శ్రీని—వైద్యునితో—

విప్ర—అదేమి మాట? దేవదేవీ! నీవు మాకు సకలోపచారములు చేయుచుండ నీ క్షేమముమాత్రము మే మరయ నక్కఱలేదా? మే మంత యవిశ్వాసముగ వర్తింతుమా?

శ్రీని—అయ్యో! విసరుకఱ్ఱ జారిపోవుచున్నది. కొంచెము పైకుంచు కొనుడు.

విప్ర—(తనలో) విసరుకఱ్ఱకా దోయి! మనసు.

దేవ—మ రేమియుం దొందరలేదు. కాలక్షేపమును గానిండు.

శ్రీని—స్వామీ! ఇదిగో కోశము! (విప్పుచున్నాఁడు) అయ్యో! తిర్వధ్యయనమంత్రములకట్ట పట్టుకొని వచ్చితిని. పోయి యాచార్యగ్రంథములఁ దెచ్చెదను. (పోవును)

విప్ర—(తనలో) తద్దినపుమంత్రములా? అయిన నేమి? నా భక్తి కింకఁ జరమకైంకర్యమే కావున శ్రాద్ధమంత్రమైన సమయోచితముగనే యున్నది. (ప్రకాశముగ) ఈ దిక్కుమాలిన విసఱుకఱ్ఱతోఁ బ్రయోజన మేమి? (పాఱవైచి) దేవదేవీ! నీ దేహములోని బాధ యేదో చెప్పెదవా లేదా?

దేవ—చెప్పెదవా లేదా యని యడిగితిరి. చెప్పవలయు నసయే యున్నది. చెప్పలేకుండ నున్నాను.

విప్ర—ఏమి? సిగ్గుపడుచుంటివా?

దేవ—మహాత్మా! సిగ్గు విడిచిపెట్టి యెంతకాల మైనది? సిగ్గు గలిగి యుండినయెడల నింత సాహస మొనర్చి యిల్లును బంధువులను సంపదను వదలి యొక్కతె నై బురుషు నాశ్రయింప నింత దూరము వచ్చియుందునా? అప్పు డున్న భక్తితీవ్రతచే నాకు స్త్రీత్వము, సిగ్గు, భయము కూడఁ గనఁబడలేదు. నన్నుఁ బ్రాపంచికసమస్తసంబంధదూరముగఁ జేసిన యా భక్తి యిప్పుడు నిలువరాదా? నా మహాకర్మము!

విప్ర—నీభక్తి నిశ్చలముగనే యుండెను గాదా!

దేవ—ఉండెను. ఎప్పుడో!

విప్ర—ఇప్పుడో!

దేవ—పోనిండు. మీ కేమిలుకు? నా ప్రారబ్ధ మెట్లున్నదో యట్లే జరుగును. మీ కేమి! హృదయపటుత్వము గల పురుషులు. రంగభక్తి జాతి రక్తి హృదయమును దెక్కుచున్నను బలవంతముగఁ ద్రోసివైచుచుందురు. మనసు వెంటనే త్రిప్పుకొని తిరిగి భక్తిలోఁ బడి గానమో కాలక్షేపమో చేయుచు భక్తిని స్థిరపఱుచుకొందురు.

విప్ర—దేవదేవీ! ఏమి? నీకుఁగూడ నాకు వచ్చినస్థితివంటి దే వచ్చినదా యేమి?

దేవ—అట్టిదే యైన యెడల నింతబాధ యేమి? నెత్తిపై కి సూర్యుఁడు వచ్చినప్పు డక్కడకు వచ్చి యిప్పటివఱకు నే నేడ్చినయేడుపు నేమి చెప్పఁగలను? అబలను. అందఱిని వదలి యిచ్చటకు వచ్చినదానను. అందులోఁ గేవల మమాయికను. అదిగాక నాదుర్గతిచే నమితానురాగపూర్ణహృదయను—

విప్ర—నిజమే. అనురాగాధిక్య మున్న హృదయమందే కాని భక్తి నిలువదు.

దేవ—నిలిచిన దేదీ? తల్లికి సోదరులకు శత్రువునైతిని. ఊరివారిదిట్లు లకుఁ బాత్రమనైతిని. సర్వము మీరే యని మీపాదములఁ బడితిని. నాపుణ్యావశమున భక్తి ప్రబలుచున్న దని పొంగి పోయితిని. ఇంతలో నిట్లు బోరలఁబడుదు నని యెఱుఁగక పోయితిని. హా! స్వామీ! నా కింక నేది గతి?

విప్ర—నీ కిప్పుడు కలిగిన మనోవికారము నావలననే కలిగిన దని నీకు నమ్మకమా?

దేవ—అయ్యో! స్వామీ! భక్తి భగ్నమై పోవుటచేఁ గాఁబోలు! సిగ్గు తిరిగి నన్నావహించుచున్నది. ఈ మనోవికార మెట్టిదో

యిది యెందులకుఁ గలిగెనో నేనుమాత్ర మెఱుఁగుదునా? పెద్దదాననై నది మొద లిప్పటివఱకు సన్యాసమ్మవలెనే కాలక్షేపము చేసితినిగాని యూఁడుదానిముద్దుముచ్చట లెన్నఁడైన నెఱుఁగుదునా? అయ్యయ్యో! నాయీడువారలు పట్టుబట్టలని — కోసుల పేరు లని — కాటుక రేఖ లని — చందనపుఁబూఁతలని, — యత్తరువు లని — ముద్దుముద్దుగ మగ లని — ముద్దులని — కౌఁగిలింత లని — యెడలు తెలియని మహానందములతోఁ జిలుకగోరువంకవలెఁ గిచకిచలాడుచు, గలకలలాడుచు, గుబగుబలాడుచు, మురియుచుఁ, గులుకుచుండ —

విప్ర — అబ్బ! ఒడలు పులకాంకిత మగుచున్నది!

దేవ — నాప్రారబ్ధము! నాకుఁ దులసిపూసల పేరులు! జేగురుపాతలు! తల నల్లుకొనిన జడలు! ఏకభుక్తులు! బ్రహ్మచారిణీవ్రతములు! దాసరమ్మవేసములు! అధశ్శయనములు! పరదేశగమనములు! బానిసతనములు! — ఇంతే కాదా! ఇన్నిఁటికిని బ్రధానమైన యారంగభక్తిగమైన నిలువఁబడ నాయంతది లేనేలే దని సంతోషించియే యుందును. అట్లు కాక —

విప్ర — అట్లుగాక — ఇప్పుడు క్రొత్తగాఁగలిగిన చిత్తస్థితిని నిర్వర్ణింపలేవా?

దేవ — పురుషులు, ప్రాజ్ఞులు, విద్వాంసు లయిన మీరే యశక్తులై యుండినప్పుడు స్త్రీని, నప్రాజ్ఞను, ప్రపంచసుఖానుభవ మెట్టిదో కూడ నెఱుఁగని పెద్దమ్మను, నే నెట్లు నిర్వర్ణింపఁగలను? మొట్టమొదట నిది యేమో కొంచెము స్థిమితత లేకపోవుట యని, తోఁచకపోవుట యని, యేదో యొకవిధమైన బెంగ యని యనుకొంటినిగాని —

విప్ర — సరిగా నట్లేనుమా నాకుఁగూడ ప్రారంభమైనది!

దేవ — ఆరంభించుట మీ మనస్స్థితివలెనే ప్రారంభమై వృద్ధియగుటలో మీ యవస్థకంటె మఱింత శీఘ్రముగను దృఢముగను పెరిగినది. —

విప్ర—ఆఁడుదాన వగుటచేఁ గాఁబోలు !

దేవ—అందులోను శుద్ధసత్త్వకాలపు వెఱ్ఱిగోలను.

విప్ర—నిశ్చయమే. చూడు ! మనస్సు నిశ్చలముగ నుంచఁదలఁచిన కొలఁది నా కట్టె యట్టె నీపై బుద్ధి పాఱినట్లే నీకునుగూడ— ఏది!—నీకునుగూడ—నాపై—ఆలాగే—ఊఁ !—ఊఁ !

దేవ—మీ రనుటకే సందేహపడుచున్న యంశమును నానోట నేల యనిపింతురు ? అదిగో ! కాలిచప్పు డగుచున్నది. శ్రీనివాసుఁడు వచ్చుచున్నట్లున్నాఁడు. విసఱుకఱ్ఱ నడ్డుపెట్టుకొనుడు.

(శ్రీనివాసుఁడు ప్రవేశించును)

విప్ర—(తనలో) విసఱుకఱ్ఱ గాదు. వింధ్యపర్వత మడ్డుగ నుండిన నింక విసియోగ మున్నదా ?

శ్రీని—ఈ కోశము కనఁబడుసరికి నాత్రాడు తెగినది.

దేవ—(తనలో) దానిని దాఁచి తద్దినాలమంత్రముల పొత్తను పైని బడవైచితిని.

శ్రీని—దేవదేవీ! నీ వింతసేపటినుండియు నిచ్చటనే యుంటివా?

దేవ—నేను నిచ్చటనే యుంటిని. విసఱుకఱ్ఱయు నిచ్చటనే యున్నది.

శ్రీని—చూడు! నీవు తిరిగి తులసికోట చాటునకుఁ బొమ్ము.

విప్ర—దానికి మాత్రము వినఁబడ వలదా? అది యిచ్చటనే యుండిన మంచి దేమో !

శ్రీని—మొట్టమొదటినుండియు నాలాగుననే యెంచి యింత ముంచుకొంటిమి.

విప్ర—సరే! గ్రంథ మిటు తెమ్ము.

శ్రీని—(ఇచ్చును)

విప్ర—ఏమి యిది?

శ్రీని___ఒకటి యనినమాట యేమి? పూర్వాచార్యరచితము లగు కొన్నిగ్రంథము లీ సంచికలో నున్నవి.

విప్ర___ఇందులోఁ గావలసినభాగము నీరాట్టమా? పూచ్చూడలా? తిరుప్పల్లాండా?

శ్రీని___తిరుప్పల్లాండు విశేషభక్తియుక్తముగ నుండు నని నేననుకొందును.

విప్ర___భక్తిలో నన్నియు నొకటే. దేవదేవి కేది కావలయునో?

శ్రీని___నీరాట్టము దాని కక్కఱకువచ్చుట కది సాలిది కాదు; సానిది. మీరు చెప్పిన పూచ్చూడలు పొగచుట్టలైన యెడలఁ గావలయు నేమో? (తనలో) తన బుద్ధిపరిమితతకొఱకు గ్రంథమును జదివించు చుండ దేవదేవి కేది కావలయునో యని యడుగుచున్నాఁడు. రంగరంగరంగా! ఎంత కర్మము!

విప్ర___దేవదేవీ! తిరుప్పల్లాండు నీ కిష్టమేనా?

దేవ___పూర్వమున నది నా కిష్టమే కాని భక్తి కుదిరిన తరువాత దాని వాసనయైన గిట్టకున్నది.

విప్ర___అ దేమి?

శ్రీని___పల్లాం డనఁగ నుల్లిపాయ యనుకొనుచున్నది కాఁబోలు!

విప్ర___ఆలాగా! ఇది లాక్రింద లా.

దేవ___ఉల్లిలోను నంతే కద!

శ్రీని___ఆరంభింతురు!___లేనిపోనిమాట లేల?

విప్ర___శ్లో॥ పల్లాణ్డు పల్లాణ్డు పల్లాయిరత్తాండు
పలకోడినూఱాయిరమ్
మల్లాణ్డ తిణ్డోళ్ మణివణ్ణావున్
శేవడి శెవ్వితిరుక్కాప్పు.

శ్రీని___ఆహా! పెరియాళ్వారు భక్తిమాహాత్మ్యము! ఆహా! ప్రపన్నత! ఆహా! కవితామాధుర్యము!

విప్ర___దేవదేవీ! వినఁబడుచున్నదా?

శ్రీని—వినఁబడక దానిచెవులలోఁ జెట్టులు మొలిచె నటయ్యా! మీరు గ్రంథమును దదేకదీక్షగాఁ జదువుచుంటిరు!

దేవ—వినఁబడిన లాభ మేమున్నది? నా కేమి తెలిసినదా?

విప్ర—ఓహో! అటులైన లఘువుగఁ దాత్పర్యముఁ జెప్పెదను వా!

శ్రీని—(తనలో) గురుత్వము గోడగడ్డ యైనది కాదా!

దేవ—మహాభాగ్యము!

శ్రీని—(తనలో) రంగభక్తికి—

విప్ర—(రాగధోరణిగ) పాండ్యమండలమందుఁ దిరువిల్లిబుత్తూరులోఁ దిరుమహావిష్ణు పెరియతిరువడియంశమున జన్మించిన తిరువిష్ణుచిత్తులవారలు లీలావిభూతిలోఁ జేరియుండ నొక్కనాఁడు తమ యిష్టదైవమైన వడపెరంగోయి లుడయాను దమకు స్వప్నమున సాక్షాత్కరించి యీవిధమున సాయించిరి.

దేవ—స్వామీ! పెరియాళ్వారునిగూర్చి సాయించెద మని విష్ణుచిత్తుని గూర్చి సాయించుచున్నా రేమి?

విప్ర—విష్ణుచిత్తుఁడే పెరియాళ్వారు. ఆయనకు భట్టనాథుఁ డని కూడఁ బేరు. ఆ మహానుభావుఁడే శ్రీరంగదేవునికి మామగారు.

దేవ—(తనలో) ఒకభక్తుఁడు విష్ణునకు మామగా రైనప్పుడు మఱి యొకభక్తుఁడు వేశ్యకు మగఁ డేల కాఁగూడదు? క్రమము తప్పినప్పు డొకవిధముగనే యున్నమాట యేమి?

శ్రీని—అయ్యా! సెలవిండు.

విప్ర—ఇదివఱ కెచ్చటకుఁ జెప్పితిని?

శ్రీని—ఇంతలో మఱచిపోయితి రేమి! నడుమ నూరక ప్రశ్నము లుండఁ గూడదు. శ్రీవిష్ణుమూర్తివారు స్వప్నమున—

విప్ర—సరి, సరి! (రాగధోరణిగ) దేవతాంతరమంత్రాంతరసాధనాంతరోపాయాంతరరహితుండును, స్వస్వరూపపరస్వరూపోపాయ

స్వరూపఫలస్వరూపవిరోధిస్వరూపార్థపంచక జ్ఞాననిక్షేపుండును, నాకారత్రయసంపన్నుండును నగు భక్తశిఖామణి కట్లు శ్రీనెంబెరుమాళ్ళువారు సాక్షాత్కరించి "నేను నీ వారాధించు విష్ణుస్వరూపుఁడను. నీతో నొక్కమాట చెప్పవచ్చితిని. ఓభక్తురాలా! — తలయెత్తి కన్నులు తెఱచి బాగుగా నావంకఁ జూడుము."

శ్రీని—అయ్యయ్యో! అయ్యయ్యో! పెరియాళ్వారుని భక్తురాలా! యని సంబోధించుచుంటి రేమి?

దేవ—శ్రీనివాసా! భక్తులలో లింగభేదము లేదని కాదా మనసిద్ధాంతము!

విప్ర—సరే, పొరఁబాటు! (రాగధోరణిగ) ఓ భక్తశిఖామణీ! ఓ భక్తశిరోవతంసమా! నీవు మధురాపురంబునకు విచ్చేసి పాండ్యభూపాలుం డగు వల్లవదేవరాయనిం గాంచి తద్విద్వత్సభామండపంబునఁ బ్రతివాదిపక్షవిక్షేపణ మొనర్చి, శ్రుత్యంతప్రతిపాదితం బగు పరతత్త్వంబు నిర్ణయించి, స్వమతస్థాపనం బొనర్చి, తత్సభామండలమధ్యస్థరత్నమయతోరణస్తంభస్థలవినిక్షిప్తవిద్యాశుల్కంబు గ్రహించి, తెచ్చికొమ్మని గంభీరఘోషణంబుల నానతీయు, నంత— నా భక్తశిఖామణీ —యావిప్రోత్తంసుఁడు—తద్దేవదేవీముఖారవిందనిష్యందమాన—

శ్రీని—అయ్యయ్యో! "దేవదేవి" కాదు. దేవదేవముఖారవింద. ఇది వఱకుఁ బెరియాళ్వారుకు అవికఁ దొడిగించినారు. ఇప్పుడు పురుషోత్తమునకే గాజులు దొడిగించుచున్నారు. అయ్యో! "దేవదేవ"—

దేవ—(తనలో) తలకట్టెగిరినది. గుళ్ళో దీర్ఘము పెట్టినాఁడు.

విప్ర—నడుమ నడుమ నీవిట్లు లడ్డువచ్చుచుండ నే నెట్లు చెప్పఁగలను?

శ్రీని—నడుమఁ బ్రమాదములు సెప్పుచుండ మనవి చేసికొనవలదా?

విప్ర—ప్రమాదశూన్యముగ నీవు చెప్పరాదా?

శ్రీని—క్షమించుడు. మీరే కానిండు. "తద్దేవదేవ"—

విప్ర—అది వలదు. మఱియొకదారిని చెప్పెదను. (రాగధోరణిగ)
ఆ శ్రీమహావిష్ణుని సంభాషణమును విని భక్తుఁ డిట్లు మనవి చేసికొనెను. అయ్యా! స్వామీ! నేను నిరక్షరకుక్షుఁడను. ఇట్టి మహాకార్యము నావలన నెట్లగునని, నీ కేమియు భయము లేదు. నీజిహ్వాగ్రంబున మేము వసింతు మని భక్తవత్సలుఁడు సాయించి పంప, నాతఁడు పాండ్యరాజసభాంతరంబున వైష్ణవ మతస్థాపన మొనర్చి విద్యాశుల్కంబుఁ గైకొని యారాజుచే గంధగజేంద్రం బెక్కింపఁబడి తిరువీథుల వేంచేయింపుచుండఁ గుమారునియున్నతస్థితిఁ గాంచి యుప్పొంగుతండ్రివలె భక్తుని జూచుటకై పరమపదమునుండి శ్రీస్వామివారు లక్ష్మీవక్షస్కులై, శంఖచక్రగదాపాణులై యధిష్ఠితగరుడసంధులై యెదుట సేవ సాయింప—

శ్రీని—స్వామీ! ఇదియే రసమైన పట్టు. ఆ దివ్యమంగళవిగ్రహసౌందర్యమును పెరియాళ్వా రెట్లు భావించిరో యట్లే మీరు భావించి యితరచింతల నన్నిఁటిని దిరస్కరించి చిత్తమును గుదుటఁ బఱుచుకొనుఁడు.

విప్ర—సరే! అట్లే భావించెదను. (కన్నులు మూసికొని రాగధోరణిగ)
పెరియాళ్వారు వారలఁ గాంచి ఓహో! ఓహో! ఇట్టి దివ్యమంగళ విగ్రహముతో నేల దయచేసితిరి? అయ్యయ్యో! ఈ స్వరూపమునకు దృష్టిదోషము తగులునేమో! (దేవదేవివంక దిరిగి) ఆహా! ఆ కన్నులతీ రేమి? ఆ ముక్కుసొగ సేమి? ఆ కనుబొమల వక్రత యేమి? ఆహా! ఏమి చక్కఁదనము? — ఉబుకుచున్న యా పైఁటలోని—

శ్రీని—(తలపైఁ గొట్టుకొని) అయ్యో! చాలు చాలు! పురాణము నాపిండ కూడువలె నున్నది. పెరియాళ్వారు లేరు, పెరుమాళ్ళు లేరు. అయ్యయ్యో! దేవదేవిని వర్ణించుచున్నా రేమి?

విప్ర—చిత్తము స్వవశము కాకుండ నున్నది.

శ్రీని—ఒకప్పుడైన, సలవాటుచొప్పుననైన నిప్పుడు "రంగరంగా" యనుట మానినైచినా రేమి?

విప్ర—చిటపట లాడుచున్నది. అది యేమి? చినుకు పడుచున్నదా?

శ్రీని—గాఢముగ మబ్బుపట్టినది. పెద్దవర్షమే వచ్చునేమో?

దేవ—గాలివాన వచ్చుటచేతఁ గాలక్షేప మికఁ గట్టివేయవచ్చును. బట్ట లారనైచితిని. తడిసిపోవు నేమో విప్పి జాగ్రత్తపెట్టెదను.

విప్ర—పోయి శీఘ్రముగ రమ్ము. తడిసిపోవుదు వేమో సుమా!

(దేవదేవి పోవును)

శ్రీని—(విప్రనారాయణుని కాళులు పట్టుకొని) స్వామీ! పడిపోవుచున్నారు. భక్తిని నిలుపుకొనరా? అయ్యయ్యో! దేవదేవిముండ మిమ్ములఁ బాడుచేయుచున్నది. మీసెల వగునెడల దానిని జెప్పునఁ గొట్టి యీడ్చివైతును. లేదా మన మెక్కడకైనఁ బోవుదము రండు.

విప్ర—నామూలమున దానికిఁ గూడ భక్తి జాలుచున్న దఁట! నేను భ్రష్టుఁడనైనను నాకు నీవు దోడుందువు. కాని పాపము! అది భ్రష్టత నొందిన దాని కింక దిక్కెవ్వరు? మనల నింత కాలమునుండి కనిపెట్టుకొనియున్న దానినే మనము నిరాకరించుట న్యాయమా?

శ్రీని—అది ఇప్పుడు భ్రష్టురా లగుట యేమి? పుట్టినప్పుడే యైనది. వంశానుక్రమముగ నైనది. అది మీకొంపఁ గూల్చుట కిక్కడకుఁ జేరినది. అయ్యయ్యో! రక్షించుకొనుఁడు.

విప్ర—నన్నుఁ బాడుసేయుటకు దానియుద్దేశ మేమి? వారకాంతకుఁ గావలసినది ధనముకద! అది నాయొద్ద లేదుకద! స్వరూపలావణ్య మంతకంటె లేదు కదా! ఏమి మూటగట్టుకొనవలయునని యది నన్నుఁ బాడుసేయ నున్నదో చెప్పు.

శ్రీని—పాపము. మహాపాపము!

విప్ర—ఐహికఫలవాంఛాలేశమైన లేకుండ బుద్ధిపూర్వకముగఁ బాపము మూట గట్టుకొనుట ప్రాణికోటికి సహజమా?

శ్రీని—నేను మీ కుత్తర మీయఁజాలక యున్నాను. కాని దానిచే మీరు పాడగుట నిశ్చయము.

విప్ర—అకారణముగఁ బాడుకావలసివచ్చినప్పుడు — ఈ జన్మమునఁ గనఁబడనికారణముచేఁ బాడుకావలసినప్పుడు — అనఁగఁ బూర్వ జన్మప్రారబ్ధకారణమే భ్రష్టత కీడ్వవలసినప్పుడు — ఎవఁ డేమి చేయఁగలఁడు? ఏ మగునో, కానీ!

శ్రీని—ఏ మగుట కే మున్నది? ఇఁక వేశ్యావీథిని నెత్తిమొగము వేసికొని మీరు విటాధములు కానై యున్నారు.

విప్ర—ప్రారబ్ధ మటు లుండఁ దప్పునా?

శ్రీని—మనమతముల కన్నిఁటికిఁ బూర్వజన్మప్రారబ్ధ మను నీదిక్కు-మాలినయంశ మొకటి దాపురించి యందఱిని భ్రష్టులఁ జేయుటయే కాక, తిరిగి బాగుపడకుండ భ్రష్టతలోనే యొకసంతుష్టిని గలుగఁ జేయుచున్నది.

సీ॥ ద్యూతంబునను గోఁచి♦పాతరాయం డయి
ప్రారబ్ధమున నిట్టు♦లైతి ననును
కలుద్రావుమత్తునఁ ♦ గొంతగొంతుకఁ గోసి
ప్రారబ్ధమున నుఱి♦వచ్చె ననును
ప్రబలదురాశఁ జౌ♦ర్యం బాచరించుచుఁ
గారలోఁ బడఁ బూర్వ♦కర్మ మనును
వ్యభిచారమున నొడ♦లంత పుచ్చినఁ బురా
కృతకర్మమునకు న♦డ్డేది? యనును
ఇట్లు మగనాలిఁ జెఱిపితి♦వేల యనిన
నిది వెనుకజన్మమున నన్ను ♦ నిట్లొనర్చెఁ

బూర్వకృతఫలం బిది కాని • బుద్ధికృతము
గా దనును — బుద్ధి లేకుంట • కల్ల గాదు.

సీ॥ చదువు లేకుండ న•జ్ఞత నుంటివే లన్న
యోగ ముండిన నన్ని • భాగుపడును
ముసలిపందకుఁ గూఁతు • నొసఁగుట తగదన్న
దళ మున్న నైదువ•తనము నిలుచు
వ్యాధికి వైద్యంబు • వలదందువే లన్న
నాయువే తగ మందు • లబ్బుపడునె
దైవముం దలఁపమి • తగ దన్నఁ బుణ్యమా
గతి యున్న సద్బుద్ధి • కలుగు నను
జనుఁడు; దైవ మొసంగిన • స్వల్పబుద్ధి
నైన వినియోగమును జేయు • కకట! సౌఖ్య
మంద లేక యీఁయఁగ లేక • వ్యర్థుఁ డగుచు
నన్నిఁటికి నెత్తిగీతనే • యెన్నుచుండు.

స్వామీ! ఏమో పరాకుగా నున్నా రేమి?

విప్ర—నీ వేమంటివో వినుటకు నా కిప్పుడు తగినంత చిత్తశాంతి లేదు. చూడు! ఈవర్ష మెందుచేతనో కాని నాకు మనోవికారమును వృద్ధిచేయుచున్నది సుమా!

శ్రీని—ఆలాగా! మీ మనసునుండి భక్తి నశించినది. శృంగారరస మంకురించినది.

గీ॥ వర్షపాతము స్త్రీవాంఛ • ప్రబలఁ జేసి
తుదకు విరహుని స్త్రీప్రక్క • నదుకు పెట్టు;
నెట్టునీటిప్రవాహంబు • వెట్టికుక్క
విసము వెలిపుచ్చి మృతిప్రక్కఁ • బెట్టు నరుని.

(నేపథ్యమున) ఉరుములు మెఱుపులు.

విప్ర—శ్రీనివాసా! నీ కొకమాట చెప్పెదను విందువా?

శ్రీని—హితమును నిరాకరించుటకు నా కేమివికారము సంభవించినది?

విప్ర—ఇఁక నట్టి ప్రశంస వలదు. ఉరుములు మనకే భయంకరములుగ నున్నవి. పాపము! మనబట్టలు తడిసిపోవు నేమో యని పరు గెత్తిన దేవదేవి యింక రాకున్నది. తడిసిపోయినదో! గాలిచే నెక్కడ నైనఁ బడిపోయినదో ! నీవు పోయి యామెను దీసికొని రమ్ము.

శ్రీని—దానిని వదలుకొనవయ్యా యని నేను దేవులాడఁగ దానిని దీసి కొనివచ్చి నాయెదుటఁ బెట్టుమని మీ రాడ న్యాయమా ?

విప్ర—దానిని గాఢాంధకారమున నశనిపాతభయంకర మగు నిట్టి వర్షమున నొక్కతెను నిరాచ్ఛాదనస్థితిని ద్యజించుటమాత్రము న్యాయముగ నున్నదా !

శ్రీని—అది తడువనే తడిసినది. నన్నుఁగూడ నేల తడిపెదరు ?

విప్ర—పురుషుఁడవు, దానికంటె నెక్కువ వస్త్రములు గలవాఁడవు. నీ కేమి? పొమ్ము. ఇఁక నాలస్యము చేయకుము.

శ్రీని—అటులైనఁ బోయెదను. అయ్యా! నమస్కారము. ఇఁక మి మ్మెఁపుట బ్రహ్మతరము గాదు. (పోవును)

విప్ర—ఇంక రాలేదు. చెట్లకొమ్మ లేమైన విఱిగి మీఁదఁ బడినవో ? దారిగానఁబడక నేదైనఁ గాలికిఁ దగిలి పడెనో?

(నేపథ్యమున) హాహాహా! చలి, చలి, చలి! హాహాహా !

విప్ర—అదిగో! అదిగో! దేవదేవీ! తడిసిపోయితివా ?

(నేపథ్యమున) చలి, చలి, చలి! హాహాహా!

విప్ర—ఆహా ! దైవకటాక్షమున నిప్పుడే మెఱుపు మెఱయుటచేఁ గనులును, దత్కాంతివలన నార్ద్రవస్త్రధారిణి యగు నామెదర్శ నమున హృదయము నొక్కమాఱు తళుక్కు మని పోయినవి. చలిచేత బాధపడుట యేల ? ఇదిగో ! నాయుత్తరీయమును జుట్టఁబెట్టుకొనుము. (అటు పాఱవైచి తనలో) పాపము! చలిచే

నెంత బాధ పడుచున్నదో! (ప్రకాశముగ) కట్టుకొనుచున్నావా?
(నేపథ్యమున) ఆ!

దేవ—(ప్రవేశించి) చలిచలిచలి! (వడఁకుచు దగ్గఱకు వచ్చును)

విప్ర—సందేహింపకు, సందేహింపకు. దగ్గఱకు రమ్ము. మనుష్యుని వేఁడిమి మంచిది.

దేవ—హాహాహా! (కౌఁగిలించుకొనును)

విప్ర—హాహాహా! ఏమి యానందముగ నున్నది! హాహాహా!

దేవ—మన మా ప్రక్కనుండు గదిలోనికిఁ బోవుదము. శ్రీనివాసుఁడు వచ్చునేమో?

విప్ర—శ్రీనివాసుఁడు నీకుఁ గానఁబడ లేదా?

దేవ—నా కాతఁడు కానఁబడినాఁడు. కాని నే నాతనికిఁ గనఁబడకుండ వచ్చితిని.

విప్ర—సరే, రమ్ము.

దేవ—(తనలో) విష్ణుదాసుఁ డిప్పటికి వేశ్యాదాసుఁ డైనాఁడు. ముకుత్రాడు వేసి యితని నిఁక మాగ్రామములోని వేశ్యావీథి కీడ్చుకొని పోవుటయే తరువాయి—

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

ఇది చతుర్థాంకము.

శ్రీ

విప్రనారాయణ చరిత్రము

పంచమాంకము.

ప్రదేశము—"తిరుక్కరంబనూరు" అనుగ్రామమున వేశ్యావీథి.

(ప్రవేశము—శ్రీనివాసుఁడు, విప్రనారాయణుఁడు.)

విప్ర—దానియి ల్లింక నెంతదూర మున్నదో చూడు! ఆ మలు పెట్లై యుండునో?

శ్రీని—అదియే నండి! వేశ్యావీథికిఁ దొడ్లక్కము.

విప్ర—పవిత్రములగు వైష్ణవనామముల నేల యపరిశుద్ధి చేసెదవు?

శ్రీని—పవిత్రతము లగు వైష్ణవులు భ్రష్టులై పోవునప్పుడు మాటల లెక్క యేమి?

విప్ర—అట్లు కాదు. భాగవతోత్తములు శాశ్వతులు కారు. ఎందఱు పుట్టిరో! ఎందఱు భ్రష్టులైరో, ఎందఱు నశించిరో! కాని వైష్ణవసాంప్రదాయవాక్యములుమాత్రము శాశ్వతములు.

శ్రీని—వాక్యములకంటెఁ జేష్టలు శాశ్వతములు కావా? మొగము కానఁబడకుండ మేలుముసుఁగు వైచికొని సందెచీఁకటిని వేశ్యయింటికిఁ బోవు మి మ్మెవరు చూతు రని యనుకొనుచున్నా రేమో! ఎవఁడో యొక పనిలేని చలపాదికవి ద్వాదశోర్ధ్వపుండ్రధారు లైన మిమ్ము, దగ్ధాసనధారుఁడ నైన నన్ను మన మిప్పు డిక్కడ నున్నట్లువలెనే వేశ్యావీథిరంగమున వెఱ్ఱిమొగములతోఁ బ్రవేశింపఁజేసి, యెదుటఁ గూరుచుండు సామాజికులచేత "ఛీఛీ!" యని పించి, వెకవెక వెడనవ్వుల నవ్వించి "థూథూ" యని మీఁద

నుమియఁజేయు కుండునెడల నేను బ్రాహ్మణజన్మమునఁ బుట్టిని వాఁడ నని ప్రమాణము చేయఁగలను. లోకప్రఖ్యాతమై యా చంద్రతారకముఁగ నిలువవలసిన యీ మీచేష్ట మాపటిమత్తులో మాసిపోవు ననుకొంటిరా ? సూర్యునివలె దివ్యతేజమునఁ బ్రకాశించి యవతలి ప్రపంచార్థమునందుఁగూడ వ్యాపించును గాని—ఆహా ! అట్టిపనిని జేసినారు మహాత్మా ! చాలుచాలు ! ప్రపంచ మున్నంతకాలము భక్తలోకమునకు మీచేష్టవలనఁ గలిగిన తలవంపు చాలు ! చాలు ! నాకు మిమ్ముఁ జూడ నేవపు వచ్చుచున్నది. ఆహా ! ఎట్టి మహోన్నతస్థితినుండి యెట్టియధోగతికిఁ గ్రుంకిపోయినారు ! ఆహా ! ఆకాశమునుండి చుక్క యూడి పడినట్లయ్యెనే ! ఇఁక నొక్కమాట కడపటిసారి చెప్పుచున్నాను. నేను మి మ్మిట్టిస్థితిలోఁ జూడలేక— నామన సుండఁబట్టలేక— వెఱ్ఱిచేఁ జెప్పుచున్నాను. ఇదివఱకుఁ దిగ్వారాధనపుగదిలో నేమి జరిగినదో జరిగినది. దానినిగూర్చి లెంపలువైచికొనియో, తల నేలను మోదుకొనియో, కావేరిలోఁ బడి మృత్తికా స్నానములేడ్చియో యెట్లో యొకట్లు చూచుకొందము. ఇఁక నొక్క యడుగైన ముందుఁ బెట్టక వెనుకకు రండు, పోదము.

విప్ర—నీకు నాయందుఁ గల ప్రీతికి సంతసించితిని.

గీ॥ భక్తిరక్తులు వేఱుత ♦ త్త్వములు కావు;
భక్తి దైవానురాగము, ♦ వనితపైని
రాగమగు రక్తి; యది యిది ♦ రాగ మొకటె;
తత్ప్రవాహాదిగతులె భే♦దములు సుమ్ము!

గీ॥ భక్తి యెమరెత్తుగాన నిం♦పాదినడక,
రక్తి పల్లపువాల్గానఁ ♦ బ్రబలవేగ
యుతము, మార్పడిచేత నా ♦ సతతభక్తి
మఱలి తలక్రిందుగా నట్టె ♦ దొరలు నిపుడు.

గీ॥ కాలభేద జగతిభేద ♦ లీల కెదిరి
డీకొనుట యౌనె ? మంచిది ♦ మేకొనుటయె;

గాలివానకు నెదురెక్క ♦ గడఁగకుండ
నావికుఁడు దానిగతిఁ బట్టి ♦ పోవుఁగాదె!

గీ॥ అడఁచిపెట్టిన రక్తి హే ♦ త్వంతరమున
వెలిఁబడినయప్పు భీకర ♦ చలన మొందు
నట్టి బిగువుగ దట్టించి ♦ నట్టిమందు
రంజకం బంటి ధామ్మని ♦ ప్రబలునట్లు.

గీ॥ లో నడఁచిన రస మొక్క ♦ లోపమునను
బైట బడినయప్డు 'ప్రబలదు ♦ ర్భరతఁ బొంగు,
నావిరిని సిండుపాత్రకు ♦ నంతదారి
సీయ బుస్సను ధ్వనితోడ ♦ నెగసినట్లు.

గీ॥ అడఁపఁబడుచు హఠాత్తుగా ♦ నతిశయిల్లు
నట్టి రక్తికి దయ్యంబు ♦ పట్టినట్టి
మనుజునకుఁ గల్గు నంత సా ♦ మర్థ్య మొందు,
పిచ్చివానికిఁ గలయంత ♦ వేగ మమరు.

గీ॥ అస్వభావశక్తిని స్వభా ♦ వాల్పశక్తి
తో నెదుర్కొనఁ దరమౌనె? ♦ శ్రీనివాస!
చచ్చుపాపటగొట్టాన ♦ వచ్చునట్టి
చిన్నకాయకు ప్రేలడ్డు ♦ సేయఁగలమె?

గీ॥ కానఁ బ్రస్తుతావస్థార్థ ♦ మైన పనిని
జూడఁదగుఁగాని యెదురింపఁ ♦ గూడ దయ్య!
ఇద్ది మార్వడి యని యంటి ♦ నిద్ది యెంతొ
వఱకు నఁడిడు వడిలోనఁ ♦ బడుదుఁ దిరిగి.

శ్రీని—అందుచే దైవభక్తుల రగు మీరు దాసిదానియింటికి దానిదర్శనము నిమిత్తమై దయచేయుటయే తారకమార్గ మని తాఁదా యభిప్రాయము?

విప్ర—అభిప్రాయమే కాదు. ఆచరణముకూడ నటులే.

శ్రీని—సరే. అటులైన దయచేయుఁడు ఇక్కడనుండియే వేశ్యలకొంప లారంభ మని చెప్పితిని గాదా! తన యింటిగుర్తులఁ గూర్చి యాది మీకుఁ జెప్పినమాటలు జ్ఞప్తి యున్నవా?

విప్ర—బాగుగ నున్నది. అదిగాక యెంతయో మనస్సంభ్రమముతో నది నాకొఱకు గుమ్మములోఁ గనిపెట్టుకొని యుండదా! ఎప్పుడు వత్తునో, యెప్పుడు వత్తునో యని యెదురుచూచుచు నేమియుఁ దోఁచక మహాందోళనమున నుండదా? దానికిఁ గూడ నాయట్టియవస్థయే సిద్ధించినది. కాన దానికిఁగూడ నాపై ననురాగము ప్రబలముగ నుండును. తాను వచ్చి నన్నుఁ దనయింటికిఁ దీసికొని వెళ్ళెద నని చెప్పినదే! ఏమి తొందరచేత రాలేదో? దానిని జూచువఱకు నామనసు శాంతిగ నుండదు.

శ్రీని—సరే, రండు. నమస్కరించుచున్నాముగదా!

(నేపథ్యమున) అడియేన్ దాసోహం! అడియేన్ దాసోహం!

విప్ర—దాసోస్మి! దాసోస్మి! దాసానుదాసోస్మి!

శ్రీని—ఈ సమయమున మీరు రక్షలనఁగూడదు. (తనలో) ఇప్పుడు నమస్కరించిన ముండకొడుకు పిల్లివలెఁ జీఁకటిలోఁ గూడఁ జూడఁగలఁడు గాఁబోలు!

విప్ర—ఎందుచేత?

శ్రీని—మీరు సందెచీఁకటిని ముసుఁగువైచికొని పోవుచు మాటలాడుదురా?

విప్ర—సందెచీఁకటి తనయంతఁ దాఁ బడెనుగావున వచ్చితిని. నీవు ముసుఁగువైచితివి కావున నే నొప్పుకొంటిని గాని నా కేమి భయమా? నా కున్నదోషము దేవదేవీవాంఛ. అంతే కాని నాకుఁ బిఱికిదన మేమి? అదిగాక యాచార్యుఁడు నమస్కరింపఁ బ్రతినమస్కారము సేయకుండుట తప్పుగాదా!

శ్రీని—అతఁ డాచార్యుఁడఁటయ్యా? జారుఁడు! పరిహాసమునకు నమస్కరించుచున్నాఁ డని తెలియవలదా?

(మాధవుఁడు ప్రవేశించును.)

మాధ—ఓహో! ఓహో! భాగవతోత్తములు కాఁబోలు! ఈ పక్షి వర్ధనము లేమి, పణ్యవీథీసంచారము లేమి? వక్షమునఁ దట్టుఁడు తులసిపూసలపేరు లేమి, వారకాంతాదర్శనాభిలాష యేమి? కాషాయధారణ మేమి, కాంతానురాగ మేమి? ఆచార్యపురుషులు దిగ్విజయార్థమై వేంచేసితిరికాఁబోలు! హేహేహే! ఈ వాడసానులలో మీా కెవ్వరైన శిష్యురాం డ్రున్నారా?

విప్ర—ఒక్కతెయే! దేవదేవి యనునది మాత్రము.

శ్రీని—(అపవారించి) అయ్యయ్యో! ఆమాట యేల చెప్పవలయునయ్యా?

మాధ—దేవదేవియే! అప్సరస వంటి శిష్యురాలిని సంపాదించితిరే! దానికి సమాశ్రయణము చేయుటకు వచ్చినారు గాఁబోలు!

విప్ర—అది యిదివఱకే యైనది. తిరుమంత్రోపదేశమైనది. దాని బుద్ధి మంచిది. కాని, నావలెనే దానికిఁగూడ నన్యోన్యాశ్రయ మూలమున రంగభక్తి తగ్గినది. ఇప్పుడు దానిపై ననురాగమున నే నిటకు వచ్చితిని.

శ్రీని—(అపవారించి) బట్టబయలుసేయు టేల? ఈ కర్మ మెప్పుడైన నెఱుఁగుదురా? అయ్యయ్యో! ఎంత ప్రారబ్ధము!

విప్ర—(అపవారించి) శ్రీనివాసా! నీ కిది యేమి వెఱ్ఱి? నాదోషమున నేను గాంతానురాగుఁడను గావలసివచ్చెను గాని యసత్యవాది నగుటకు నా కేమి కర్మము?

మాధ—మీాకును దానికిని సంబంధము జరిగినది కాఁబోలు నేమి?

విప్ర—శారీరసంబంధ మింతవరకు జరుగలేదు.

శ్రీని—(అపవారించి) స్వామీా! ఇప్పు డేల యసత్యమాడితిరి?

విప్ర—(అపవారించి) అసత్య మే మున్నది?

శ్రీని—(అపవారించి) మీారు దేవతార్చనపుగదిలోనికిఁ బోయితి మని చెప్పితిరి కాదా!

విప్ర—(అపవారించి) ఔను. శీతబాధానివారణమునకై యది రమ్మనెను.

శ్రీని—(అపవారించి) అదియుఁగాని మీరుగాని యిచ్చటఁ దొందర యేమియుఁ బడలేదా ?

విప్ర—(అపవారించి) ఏమియుఁ దొందర లేదు. తనయింటికి నన్నుఁ దీసికొనిపోవుదు నన్నది. సరే యంటిని. ఇదివఱకు రాలేదు. అందుకొఱకు నేనే బయలుదేఱితిని.

శ్రీని—(తనలో) ఇది యేమి ? వింతగ నున్నది. అసత్యమాడువాఁడు కాఁడు. హా! దైవమా! ఈతని యీపరిశుద్ధత నింకఁ గాపాడుము.

మాధ—స్వామీ! అటులైన నిదివఱకు మీరు దానికి జరుగనే లేదు. దానికి మీపై ననురాగ మున్నదా!

విప్ర—దానికిఁ బూర్ణముగ నున్నది యదే కాదా ?

శ్రీని—(అపవారించి) నరుని దేహమును జంపువాఁడు పరమక్రూరకిరాతుఁడై యుండ నాతని యాత్మను శరీరమును గూడఁ జంపునది యనురాగప్రపూర్ణరా లనెద రేమి ?

మాధ—(తనలో) ఈ పంగనామాల బాపనయ్య యకాలపు వెఱ్ఱిముండ కొడుకు. దారితప్పి నూతనశృంగారమునఁ బడినాఁడు. ఈతని యొద్ద విశేషధన ముంటచేఁ గాఁబోలు టక్కులాఁడియైన దేవదేవి యీతని యజ్ఞపశువుగఁ బట్టినది. ఈతనివలన నాకుఁ గూడ నేమైన లాభింపవచ్చును. (ప్రకాశముగా) నే నీవేశ్యావీథిని రెండు పుష్కరములనుండి కనిపెట్టుకొనియుంటిని. మీవంటివారి పుణ్యమునఁ బొట్టపోసికొనుచుంటిని. వేశ్యలలోఁ బ్రకృతులు బహువిధములు. ప్రపంచమే యట్లేడ్చుచున్నది లెండు! పడుచుఁదనము గలిగినదానివలెఁ బైకిఁ గనఁబడినంత మాత్రమున నది యౌవనవతి యని మన మనుకొనఁగూడదు! చిత్రకాలము! ఊడిపోయిన పండ్లకుఁ గట్టుడు పండ్లు కద. నెఱసిన వెంట్రుకలకు రంగు కద! ముడుతల మొగమును సాఁగఁ దీయుటకు జిగుఱులు గద! పాలిపోయిన దౌడలకుఁ బూఁతలు

కద ! ఆశ్చర్యము ! మొక్కజొన్నపొత్తివలె నున్న మొగమున కైన మెఱుఁగులు కద ! ఇదిగాక, అత్తరువు లని—అగరు నూనె లని—మాదిమెత్త లని—కొబ్బరిచిప్ప లని—గోరంటాకు లని—ఇంక నేమో యని—పెద్దపెట్టె పట్టినంతసామగ్రి కద ! మేళములో నాడుచున్నంతసేపు కన్నులు మొగముమీఁదఁ గద ! ఇంటికి వచ్చిన తరువాతఁ జిలుక కొయ్యలను గద !

శ్రీని—అది యేమి ?

మాధ—అయ్యో ! ఎఱుఁగవా ? నూటికిఁ బదుగుఱుసానులకుఁ జేత కన్నులు ! ఇదికాక, కొందఱు కొబ్బరికాయవలెఁ గొఱుకరాని కొయ్యలుగఁ బైకిఁ గనఁబడి లోన రసపూర్ణహృదయమును గలిగియుందురు. ఇట్టివారిని నెత్తి వాయఁగొట్టి యనుభవింపవలయును. కొందఱు పనసతొనవలెఁ బైకి మధురముగను మృదులముగ నుండి యనుభవింపఁబోవుసరికిఁ గటుక్కునఁ గఠినవగు మనస్సు నడు పెట్టుదురు. ఇట్టివారల దేహాత్మవిచ్ఛేదముచేసి యనుభవింపవలయును. మఱికొందఱు పైకిఁ గఠినముగనే లోనఁ గఠినముగనే యుందురు. ఇట్టివారిని బటికబెల్లమును జప్పరించినట్లు మెల్లమెల్లగఁ గరఁగింపఁజేసి యనుభవింపవలయును. కొందఱు యెండి చచ్చిన ట్లుందురుగాని సీమమిరియపుఁగాయవలెఁ గారమునఁ గ్రిందిగ్రుడ్లు మీఁదికిరాఁ జేయుదురు. కొందఱు బుట్టమిరియపుఁగాయలవలె బుంగలై యుండుటయే కాని వీరి నూరఁబెట్టి యెండఁబెట్టి కాల్చినఁగాని యనుభవింపఁదగదు. కొందఱు సున్నితముగ శలాకవలె నున్నను దేశవాళిచెఱకువలె మిక్కిలి మధురముగ నుందురు. మఱి కొందఱు గొంతచెఱకువలెఁ బూర్ణలై యున్నను గానుగ నాడి యేదో యింత తుక్కుతోఁ ద్రొక్కి బుట్టలు కట్టి పాటకపుజాతి యనుభవమునకుఁ బాఱవైచి సొమ్ము చేసికొనుటకు మాత్ర మక్కఱకు వత్తురు. కొందఱు పండుగ్రోఁతులవలె నెఱ్ఱమొగములతోఁ—గొందఱు కొండముచ్చులవలె నల్లమొగములతోఁ

గొందఱు చిరుతపులులవలె నొడలినిండ మచ్చలతోఁ—గొందఱు దుప్పివలె శ్వేతపుడాగులతోఁ—గొందఱు తిర్యఙ్ముఖములతోఁ—గొందఱు పార్శ్వముఖములతోఁ — గొంద అధోముఖములతో—

విప్ర—అయ్యా! మాకీగొడవ యంత నెందులకు ?

మాధ—దేవదేవికి మీయెడలఁ బూర్ణానురాగము కల దని మీరు చెప్పుటచేత నింతగొడవ చెప్పవలసివచ్చెను. దాని యనురాగ మెట్లున్న నది మిక్కిలి జాణ. మీరు శృంగారవిద్యలో నింక నోనమాలలోనే యున్నారు. కావున మీకు నావంటివాని సాహాయ్య మావశ్యకము.

శ్రీని—మీ రింతకాల మిటనుండి చేయుపని యేమి ?

మాధ—పుసుగుఁడు.

విప్ర—నాకుఁ దెలియలేదు.

శ్రీని—పుసుగుఁ డనఁగ భక్తపరిభాషలోఁ గొంచెము హెచ్చుతగు పురుషకారము.

మాధ—పురుషకారమే కాదు. స్త్రీపురుషకారము.

శ్రీని—అయ్యా! పక్షి పశువులసంతలోనే కాక పణ్యస్త్రీవ్యాపార మునఁగూడ నున్నదా ?

మాధ—పెద్దల నధిక్షేపింపఁగూడదు కాని, యిదిమాత్రము పశువుల సంతకంటె భిన్న మెట్లగును ?

శ్రీని—రంగరంగరంగా ! అయ్యా ! వింటిరా ?

విప్ర—నీ యిచ్చటివ్యాపారమురీతి యెట్టిదో చెప్పుము.

మాధ—నా వ్యాపారమర్మములు తమ కేల ? నేను మీకు దేవదేవి ననుకూలముగ సంధానపఱిచి, తద్వేశ్యామాతవలనఁ దమకు బాధ లేకుండఁ జేసి—

శ్రీని—అది నీ వెట్లు చేయఁగలవు ?

మాధ—నే నట్టి మాతలక్రింది దూతను. వచ్చినసొమ్ము వారు నేను వయస్సునుబట్టి పంచుకొందుము.

విప్ర—మీరు నాకు రాయబారము సేయ నక్కఱలేదు.

మాధ—అట్లనకుఁడు. మనువులను స్థిరపఱచుటలో దూతలు— మహీనాథులకార్యములందు దూతలు— మనుజులవ్యాపారము లందు దూతలు— మదనతంత్రములందు దూతలు— మరణము లందు దూతలు— పుట్టినది మొదలు గిట్టెడు పర్యంతము పని యంత దూతలతోడనే యున్నది కాదా!

విప్ర—అయినను మాకు నీతో నేమియు లేదు క్షమింపుము.

మాధ—పురోహితుఁడు లేని వివాహమా? అధ్వర్యుఁడు లేని యజ్ఞమా? చారుఁడు లేని రాజనీతియా? మంత్రసాని లేని ప్రసవమా? వైద్యుఁడు లేని చావా? సంధానకర్త లేని సరసమా? చాలు!

శ్రీని—నీవు పోవయ్యా! మాతో నీ కెందులకు?

మాధ—నా సాహాయ్యములేనిదే మీకు శృంగభంగ మగుట నిశ్చయము. నేను బోయెదను. కాని నా కేమైన నొసఁగుఁడు.

విప్ర—ఇచ్చుటకు మాయొద్ద నేమి యున్నది?

మాధ—దర్భాసనఁపుఁగట్టలో నేమో యున్నదే?

శ్రీని—ఏమి యున్న నీ కేమి? పోవయ్యా!

మాధ—(తనలో) వీరియొద్ద ధన మున్నది. మొండిముండకొడుకులు. నా కీయకున్నారు. నేను ముందు దేవదేవి తల్లియొద్దకుఁ బోయి యీమాటఁ జెప్పెదను. (పోవును)

(నేపథ్యమున) స్యూ! స్యూ! (కుక్కలు మొఱుఁగును)

శ్రీని—చూచితిరా! కుక్కలను మనపై నీతఁ డుసికొల్పుచున్నాఁడు?

(నేపథ్యమున) స్వామీ! కుక్కలు మీదర్భాసనపుఁ గట్ట నెత్తుకొనిపోవును. జాగ్రత్త!

(మఱియొక ధ్వనితో) ఓహో! అయ్యవారులవారు కాబోలు! ప్రతివాదిభయంకరులు కాఁబోలు! హే హే హే! రావణసన్యాసమోయి! (చప్పటలు జరుగుచున్నారు)
(మఱియొక ధ్వనితో) రంగదాసు లనంగదాసులైనారు! ఓహో! ఆచార్యపురుషులు వ్యభిచారపురుషులైనారు! వేదమార్గప్రతిష్ఠాపకులు విటమార్గప్రతిష్ఠాపకులైనారు! తిరుప్పావు కాలక్షేపప్రియులు దేవదేవికొఱకుఁ దిరువీథులు వెంచేసినారు. లేవిడీ! కొట్టు! కొట్టు!

శ్రీని—మరల వీరు కొట్టుదు రేమో?

విప్ర—వారికి మన మేమి యపకార మొనర్చితిమి? భయము లేదు. కాని, వీరు విటులే—నేను విటుఁడనే! వీరును స్త్రీవాంఛచే నిటకు వచ్చినవారే—నేను నట్లే వచ్చినవాఁడనే! వారిచర్యయుఁ దప్పే—నాచర్యయుఁ దప్పే! వారు నన్ను దూర నేల? నన్నుఁ గొట్టఁ దన నేల? వారిని లోకు లేల యిట్లు నిందింపఁ గూడదు? కుక్కలు సహితము నన్నుఁ గాంచి యేల మొఱుఁగవలయును?

శ్రీని—గీ॥ విటతతిప్రవృత్తిగతు లంత ♦ వెగటు కావు,
గృహిణి గర్భధారిణి యోకి♦లింతవలెను;
సంగదూరభాగవతుని ♦ జారచర్య
విశ్వనింద్యంబు, విధవ వే♦విళ్ళఁబోలె.

గీ॥ సంగయుతులదుర్గతులు హా♦స్యంబులగునె,
యడుసులోనఁ బందుల పొర♦లాటలట్లు?
విగతసంగులరక్తి న♦వ్వించు నెగురఁ
బోయి పండ్లూడఁబడు వెట్టి♦మొగములాగు.

గీ॥ ఎంగిలాకున సోమరి, ♦ రంగనిగుడి
భక్తుఁ డుంటయె యుచితత; ♦ వాఁడు గుడి, ని
తండు పెంటపై నుండ నిం♦ద్యంబు గాదె?
యనుచితగతి యెల్లైన దూ♦ష్యంబు సుమ్మి!

(నేపథ్యమున) సాధనసప్తక స్థాపకాచార్యోత్తమా ! దాసోస్మి! దాసోస్మి !

విప్ర—అ దేమి ? అ దేమి ?

శ్రీని—ఏ మున్నది? దేవరవారిమహిమము నెవఁడో వర్ణించుచున్నాఁడు. అందఱికి మోక్షోపాయములుగ కర్మ, భక్తి, జ్ఞానము లుండ మన వారు ప్రపత్తి యని నాలుగవదానిని జేర్చుకొనిరి. వారి తరువాతి వా రది చాలక యాచార్యాభిమాన మని యైదవదానిని జేర్చు కొనిరి. దేవరవారు వ్యభిచారాభిమాన మను నాఱవదానిని గూడ స్థాపించిన మహాచార్యపురుషు లని యెవఁడో యను చున్నాఁడు. (నేపథ్యమున) ఓహో ! సామాన్యాచార్యపురుషుని వలెఁ గానఁబడుచున్న నీతఁడు నూతనవైష్ణవావతారమ మోయి ! "వందే విష్ణుం సదాఽఽనందం వాసుదేవం నిరంజనం" (లెంపలు వైచుకొనుచు) అపరాధుఁడ, నపరాధుఁడను.

విప్ర—నేను శ్రీమహావిష్ణునవతారమ నని కూడ హేళన మొనర్చు చున్నారా ?

శ్రీని—శ్రీమహావిష్ణువు కృష్ణావతారమున గోపికలయిండ్లఁ జేరి వారి నుద్ధరించినట్లు మహావిష్ణుఁడు తిరిగి దేవరవారి యవతారమును ధరించి సానియిండ్లఁ జేరి వారల నుద్ధరించు నని—

(నేపథ్యమున) ఇదే యిల్లు ! ఇదే యిల్లు ! లోనికి రండు!

విప్ర—అదిగో ! కర్ణామృతముగ దేవదేవిమాట వినఁబడినది.

శ్రీని—అంతటితో నైనదా? శ్రీరంగమూర్తివలె నది మీకు దివ్యదర్శన సేవకూడ నిఁక సాయించును.

(వెనుకఁ దెర యెత్తఁగా నింటిలో దేవదేవి ప్రవేశించును.)

దేవ—దాసురాలు నమస్కరించుచున్నది.

విప్ర—దాసోఽహం.

దేవ—తుదకు మాకుటీరమును బావనముసేయ దయచేసితిరా ?

శ్రీని—(తనలో) మావనమును శ్మశానమును జేసి—

విప్ర—కుటీర మనెద వేమి? ఓ! దివ్యభవనము!

శ్రీని—వైష్ణవమర్యాదచే న ట్లనుచున్నది లెండు!

దేవ—తా మీ యాసనమున దయచేయుండు. శ్రీనివాసా! నీవుకూడఁ గూరుచుండుము. (ఇద్ద ఱట్లు సేయుదురు)

అక్కా! నీమఱందిగారు వేంచేసినారు. ఇటు రమ్మా.

(మధురవాణి ప్రవేశించును)

దేవ—(అపవారించి) అక్కా! మనయమ్మ రాకుండ నీతనితో నీయెదుటఁ జెప్పవలసినమాటలు కొన్ని యున్నవి.

మధు—(అపవారించి) సరే! (ప్రకాశముగ) దాసురాలి నమస్కార మంగీకరింపవలయును.

విప్ర—ఓహో! ఈమెయేనా నీయక్క!

శ్రీని—(అపవారించి) నా నీయక్క యనెద వేమి? వేశ్య భార్య యగుటయే విరుద్ధమెయుండ వేశ్యయక్క నీయక్కగూడ నగునట్లు?

మధు—అమ్మ యిప్పుడే వచ్చునేమో!

వేశ్యమాత—(ప్రవేశించి) రావోయి! మాదిగయ్యా!

(మాధవుఁడు ప్రవేశించును)

మాధ—(అపవారించి) అత్తా! క్రొత్తవారియెదుటఁ గూడ వెనుకటి వలెనే తిట్టకుము. చూడు! నీకడుపునఁ బుట్టెదను.

వేశ్యమా—నా కడుపున మగలంజకొడుకు లేల? నోరు మూయుము.

మధు—అమ్మా! ఇదుగో! నీ చిన్నయల్లుఁడు.

వేశ్యమా—ఏఁడమ్మా! ఏఁడమ్మా! నానాయనే! నాతండ్రే!

శ్రీని—నేను గాదు. నేను నీయల్లుని శిష్యుఁడను. (తనలో) ఎంతనిర్భాగ్యముగ స్వస్వరూపనిర్ణయమును జేసికొనవలసివచ్చెను!

వేశ్యమా—తోడుపెండ్లికొడుకువా? నాయనా! దగ్గరచూపు బొత్తుగా నానదు! ఇదిగో! నాకన్నతండ్రి! ఇదుగో! నావరాలనాయన! నాయన బుల్లిబొజ్జనిండఁ బెద్దకాసులు!

శ్రీని—(తనలో) ఒకగడియక్రిందవఱకు నాయన పెద్దబొజ్జనిండఁ జిట్టి గారెలు!

మాధ—(అపవారించి) అత్తా! గురువుగారి సిగ్భాగ్యపుఁబొట్టలో కాదు. శిష్యుని దర్భాసనపుఁగట్టలో—

వేశ్యమా—అమ్మాయీ! నీవు లోనికిఁ బొమ్మా. ఒసే మద్దీ! నీవు పోయి చెల్లెలిని ముద్దుల మఱఁదిగారి ప్రక్కలోనికి సింగారింపవలదా?

శ్రీని—మాధవా! మధురవాణి ధ్వంసమైకాంబోలు మద్దిక్రింద దిగినదా?

మాధ—సేతుమాధవుఁడనైన నేను జచ్చుమాదిగను కాలేదా!

వేశ్యమా—ఒసే లోనికిఁ బోక యదేపనిగ నేమి చూపే! ఇఁకఁ దెల్లవారినదాఁక వలపుల మగనిని జూచుకొనక చేసికొనున దేమున్నది? అబ్బఅబ్బ! బెంగపెట్టుకొనిపోయితివే! నాల్గు జాములు నాలుగేండ్లయిపోయెనే? వచ్చునో రాఁడో! ఏమి పఱవరింతలు! పో పో! లోనికిఁ బో! కూడైనఁ దిన్నఁగఁ దినక నకనకలాడుచున్నావు. నీమగని గనిపెట్టుకొని నే నిక్కడ నుందునమ్మా! ఈ బంగారపుఁ బిచ్చుక నెవతెయైనఁ జెంగున మూటఁగట్టుకొని పాఱిపోకుండ నేఁ గాపుండెదను లే, నడు నడు!

దేవ—నేను సెలవు దీసికొని తిరిగి దర్శింతును.

విప్ర—శీఘ్రముగ రావలయును సుమా?

వేశ్యమా—అయ్యో! నాయనా! వలిచి వలచి, మురిసి మురిసీ, శ్రీరంగమునుండి తెచ్చుకొనిన శెల్వప్పిళ్ళరాయఁడవు కాదా? శీఘ్రముగ రమ్మని చెప్పనేల? మా కాలమునాఁడు మాకుఁగూడ మగలని, ముద్దుమగలని, బెదరింపుమగలని, తేరమగలని, వెచ్చపుమగలని, సంతమగలని, మంచముక్రింది మగలని, మారింటిమగలని ముద్దినుసు ముక్కాఱువారు సంక్రమణపు జంగాలవలెఁ దిరుగుచునే యుండువారు కాని మాఱుమంచము లేకుండ సానితనము చేసిన చచ్చుపెద్దమ్మలము గాముకదా! అయిననేమి మాకాలములో నీ మమకారములు మాత్రము మే మెఱుఁగమమ్మా!

మీలాగున మమకారముచేతనే మడఁగిపోవుమాట యుండునెడల నింతకొంప నొక్కతెక్కమీఁద నెట్లు నిలువఁబెట్టఁగలుగుదును ?

మాధ—(తనలో) ఉన్న దొక్కతెక్క యన్నమాట సత్యము. రెండవది కొయ్యచేయి.

దేవ—అమ్మా? ఒక్కటిసోది చదువకు.

వేశ్యమా—(అపవారించి) నే నెఱుఁగుదు నమ్మా! నీ కిది సోదిలాగు ననే యుండునమ్మ! కడుపునిండిన మగఁడు కంటఁబడినప్పుడు కడుపుఁగన్నతల్లి మంటఁ బడవలసిన దని నే నెఱుఁగనమ్మా? కాసంతయన్నఁ గస్సుమనెదవు కాని ఒసే నేను డెచ్చినదేదో దిగమ్రింకటయే కాదా మీప్రయోజకత్వములు ! పట్టుమని యొక సంసారమును మాపఁగలిగితివా ? ఒక్కకొంప దిబ్బచేసితివా ? మందుఁ బెట్టి యొకముండకొడుకునకు వెఱ్ఱి లెత్తించితివా ? ఎంతసేపు సరసులవెంట నీవు తిరుగుటే సరిపోయెను. ఇఁకసాని తన మేమిటి, నాశ్రాద్ధమా ? మమకారములతో నోఁటలు నిండునా ? ఇల్లు నిండునా ? నగాయిముద్దులు పఁటిక్రింది యొక పోఁకబద్ద విలువచేయవు. గంపెఁడు కౌఁగిలింత లొక్కకంబళి పాతవిలువ చేయవు. ప్రేమలఁట ! పొలయల్కలఁట ! విరహవేదనలఁట ! నాపిండకూడఁట ! నల్లమదుగఁట !

మాధ—అమ్మా ! వేశ్యామాతగారూ !

శ్రీని—(తనలో) శాస్త్రిలుగారు, రాజుగారు, పంతులుగారు అని బిరుదములను బఱించి సంబోధించినట్లు వేశ్యమాతగారూ ! యని పిలుచుచున్నాఁ డేమి ?

వేశ్య—ఎందులకోయి ! మాదిగపందగారూ ?

మాధ—నీవు దేవదేవిని గూఁకలు పెట్టకుము, చిన్నతనము.

వేశ్యమా—చిన్నతనముకావుననే యేడ్చుచున్నాను. అది గాక సానిదానిసౌఖ్యపుబ్రదుకనఁగ నెన్నాళ్ళు ? వేసవి యమితముగఁ

గాచి యుడుకువాన లారంభించువెంటనే కలుగు విసూచిరోగపుఁ దహతహవలె నది నాలుగుమాసము లుండుసరికి మహాకష్టము. ఆ సమయములోనే యందినంతవట్టున కందటితలలు గొట్టవల యును! ఆ పుణ్యకాలము దాఁటిపోయినతరువాత సానియమ్మ వారియింటిలోను, జామలమ్మవారిగుళ్లోను, నిండ ధూపదీప నైవేద్యము లిద్దఱకు సున్నయే.

మాధ—దేవదేవిమాత్ర మూరకున్న దేదీ? నిక్షేపవిద్యాచార్యులవారిని దెచ్చికొన్నదికదా! ఇంతటిమండి దానిప్రతిభ! దానిసంపాదన!

వేశ్యమా—అలాగున నంటివి. బాగుగ నున్నది. మానాయన! మా తండ్రి! మామొహరీలరాయఁడు! ఇదుగో! ఇక్కడనుండి దేవ దేవి తేలవలయును. ఇక్కడనుండి యేదో—పూసయని, పుట్ట యని, గుళ్ళని, గుఱ్ఱ యని, కాసని, కట్ట యని, నగ యని, సట్టయని, గుడ్డని, గుట్టయని, అవికయని, అట్టయని, మేడ యని, మెట్ట యని, భూమి యని, బుట్ట యని—

మాధ—(తనలో) మా కుపయోగించెడు ప్రతివస్తువుతో నొక నిరుప యోగమైన యువస్తువుఁగూడ సంధించినది. విటుఁడైన గురువుతో శుద్ధనిరుపయోగనిర్భాగ్యుఁడైన యీశిష్యుఁ డున్నట్లు—

శ్రీని—(తనలో) ఓసి! నీయిల్లు వల్లకాడుగాను. చావునకు సిద్ధమైన ముండవు సంయుక్తాక్షరము లెంత స్పష్టముగఁ బలికితివే. వస్తు వున కొక్కొక్క వట్టచొప్పునఁ బెట్టుకొని వచ్చితివి. నీగొంతుకఁ గోయ! మీ కిచ్చుటకు మాయొద్ద నే మున్నది? మాకున్న సర్వస్వము దర్భాసనము — దట్ట — పైట్టాడు — తట్ట — లోనమడిపంచ — మట్ట.

దేవ—అయ్యా! పోయెదను. అక్కా రమ్మా. (ఇద్దఱు పోవుదురు.)

వేశ్యమా—నాబాబునొద్ద నేను గూరుచుండెదను. మాదన్నా! నీ వచ్చుటఁ గూరుచుండుము.

శ్రీని—(తనలో) అగ్ని ప్రశాంతినొందుటవలనఁ గదా మెలుగుబంటి యీకట్టె నిట్టె సమీపించినది!

వేశ్యమా—అల్లుఁడని యడఁగి యత్తగారికి నమస్కరించుటకు, నత్తగా రని యాప్యాయనముగ నల్లు నాశీర్వదించుటకు—నంటి ముట్టరాని—అగ్రకులములోఁ బుట్టితివికదా! మన కింక ముద్దు ముచ్చట లెట్లు తీరును?

మాధ—(తనలో) ముడుపులతో—

శ్రీని—(తనలో) నాకు మరణము సిద్ధించునెడల నీసమయమున మహా ధన్యాత్ముఁడ నగుదును. ఈమాటలు వినలేకుండ నున్నాను. శ్రీరంగదేవునికిఁ దప్ప దేవతాంతరమునకే చేయి మోడ్పని యీమహానుభావుఁ డీముదిముండకు మ్రొక్కఁ దగునఁట! ఆహా! కాలవిపర్యయము! (లెంపలు వైచుకొనును.)

వేశ్యమా—నాయనా! నీ స్వేచ్ఛావృత్తి కభ్యంతరము సేయఁగల తల్లిదండ్రులు నీ కున్నారా?

విప్ర—లేరు.

వేశ్యమా—సంతోషమే. అదృష్టవంతుఁడవు నాయనా!

శ్రీని—(తనలో) తనకుఁ దల్లియుఁ దండ్రియు నైన శ్రీరంగమూర్తినే లేఁ డనుచున్నాఁడు.

వేశ్యమా—పాలిపంపులకు భ్రాతలుకూడ — ఉఁ?

విప్ర—లేరు.

వేశ్యమా—చెప్పినమాట విని, మఱియొకచోటికిఁ బోక — నిక్షేపము వంటిసొత్తును — గాడిదగత్తర కానీక—చూడు!—తోఁట, దొడ్డి కున్న పాయలేమో పత్రాలేమో! ఇప్పటి కున్న పిల్లికూన లేమో! అవి యన్నియుఁ దెచ్చికొని—అమ్మాయిగదిలో—ఉఁ నీపెట్టెలోనే—మా కొక్కపైస యక్కఱలేదు. నాయనా! ఆదీపముతోడు! మా సంపాదితములే మాకు సమృద్ధి! కుట్టిది!

పట్టివెట్టినది! రసపూర్ణతలో—నాయనోయి! చూడు!— లేత ముంజెకాయవంటిది. మా వస్తువు మంచిదైనప్పుడు మా కెన్నఁటికిఁ గొదువ లేదు. కాని, ఈ మణిపూసకు నీవు మగఁడగుట కంటె మహాదృష్టము లేదు. చక్రవర్తులకుఁ దగినది. మనకుఁ బెద్దపరుగు లేల? నాయనా! మీ కేయే గ్రామములలో నెంత లెంత వసతు లున్నవి?

విప్ర—ఎక్కడను లేవు.

మాధ—(అపవారించి) అసత్యము—నమ్మకుము.

వేశ్యమా—మాదిగా! అల్లుఁడుగారి క్రొక్కటేసిగ్గు—

శ్రీని—(తనలో) అది లేకపోవుటచేతనే యిచ్చట నున్నాఁడు.

మాధ—సిగ్గు కాదమ్మా!

వేశ్యమా—కాకపోయినయెడల భూము లెక్కడ నున్నవో తెలిసి నంతమాత్రమున నంతసొత్తు నెత్తుకొని పాటిపోవుదు మని భయమా!

విప్ర—అట్టి సంకోచము లేవియు లేవు.

శ్రీని—(తనలో) ఉన్నసొత్తెల్ల రంగభక్తి. అది దేవదేవి హరించుకొని పాటిపోయినది.

వేశ్యమా—శ్రీరంగములో గొప్పతోఁట మీ కున్నట్లు నేను వింటిని గదా! ఏల చెప్పకపోయితివి? అల్లుఁ డత్తగారియొద్ద నసత్యము లాడవచ్చును గాఁబోలు! అందులకొఱ కత్తగా రల్లుని బుగ్గపై హాస్యమున కొట్టి పొడువవచ్చును గాఁబోలు!

(పొడువఁబోవును.)

శ్రీని—ఆఁగు! ఆఁగు! అది యేమిపని?

వేశ్యమా—ఓసీ! ఇదేమి వింత? చాలు చాలు! ఎవఁడైన నవ్వుకొని పోవును. అబ్బ! దైవముఖమును జూచి తగినవానికిఁ జేతులార సాలంకారకన్యాదానము చేసికొనిన యత్తగారికిఁగూడ మాట

మోసికొని వచ్చిన నీకున్నమాత్రపుస్వాతంత్ర్యము లేదా ? (దగ్గఱగఁ బరిశీలించి, అపవారించి) మాఁగా ! ఇదేమో ! సుద్దతోను జేగురుతోను బరజాలువేసిన గోడవలె నీతఁ డున్నాఁడేమోయి !

మాధ—(అపవారించి) భాగవతోత్తముఁ డని చెప్పలేదా ?

వేశ్యమా—(అపవారించి) భాగవతోత్తముఁ డని నీ వనఁగ భామాకలాపమో, జలక్రీడలో యాడఁదగిన వేషధారి యనుకొంటిని. ఉన్నబండార మీూపట్టెవర్ధనములేనా యేమి ? ఒడలినిండ నల్లకజ్జలవలె నీ బొట్లేమి ?

మాధ—(అపవారించి) అసాంప్రదాయముగ బొట్లనఁగూడదు. తిరుమణికాపమ్మా !

వేశ్యమా—(అపవారించి) నీ తిరుమణికాపు తీర్థముబోను. చెమ్మకాయల వలె, లాంతరుచక్రములవలె, మూఁడు గొయ్యల యోడల వలె నిట్టి భయంకరములగు పంగనామా లేమిటోయి బాబూ ! ఈతనికి యథార్థముగ నెంత సొమ్మున్నదో కనుఁగొనవలయును.

మాధ—అయ్యో! శ్రీరంగములో నున్నతోఁట విూదగునో కాదో యత్తగారితో మనవిచేయక పోయితిరి.

విప్ర—అది నాదే.

వేశ్యమా—నాయనా! నాతోఁటలరాయఁడు! నాబంగారుతండ్రి! అందులోని ఫలవృక్షములవలన నెంతరాఁబడి?

విప్ర—ఫలవృక్షము లేమియు లేవు.

వేశ్యమా—ఆఁ! ఆఁ! అదేమి ?

విప్ర—పూలచెట్లు కొన్ని యున్నవి.

వేశ్యమా—పూలచెట్లేల ? స్వాలంకారమునకా ?

మాధ—(అపవారించి) శవాలంకారమునకు.

వేశ్యమా—ఆ భూమిని విక్రయించినయెడల నేమి వచ్చును ?

విప్ర—అది నాసొంతము కాదు. దేవస్థానపువారియొద్ద బాడిగకుఁ దీసికొంటిని.

వేశ్యమా—ఛీ! ఛీ! పోసీ! చరరూపకమైన సొత్తైన నున్నదా?

విప్ర—ఏమియు లేదు.

వేశ్యమా—నాతోడే?

శ్రీని—(తనలో) రంగపాదాలు పోయి వేశ్యపాదాలతో ఉనవలసి వచ్చినది. మహాదుర్గతి!

విప్ర—ఏమియు లేదు.

వేశ్యమా—చేతిలో చిన్నకాసైన నున్నప్పుడు గదా ప్రక్కలోనికి సాని?

మాధ—నిజమే! అక్షరమునకు నత్తిపై నేత్వ మున్నప్పుడు కదా క్రిందద్విత్వము?

వేశ్యమా—ఔనయ్యా! దాసరయ్య! ఏ మున్నదని నీ విచ్చటకు వచ్చితివి?

శ్రీని—(తనలో) రంగరంగా!

విప్ర—దేవదేవికి నాపై మహానురాగ మున్నదని వచ్చితిని.

వేశ్యమా—ఇదియూ నీకున్న సొమ్ము. ఇన్ని పంగనామాల మంగలి కత్తులతో మాబుఱ్ఱలు గొఱుగుటకు వేంచేసిన తిరుమంగలి యాళ్వారవా, నాయనా? నడు! నడు!

శ్రీని—(తనలో) రంగరంగరంగా? ఎంత మాట వినవలసివచ్చెను! (అపవారించి) స్వామీ! పోవుదము రండు.

వేశ్యమా—(అపవారించి) మాధవా! నేను బోయెదను. ఈదర్బా సనపుఁగట్టను నీవు తస్కరించుకొని రావలయును.

మాధ—సందేహమా? ఎంత దొరికిన నంతయే యగును.

వేశ్యమా—మాదా! ఈముష్టి పెద్దమ్మలను గుమ్మములోనికి రాకుండఁ గుక్కలను గొట్టినట్లు కొట్టుము, నేను పోయెదను.

(వేశ్యమాత నిష్క్రమించును)

మాధ—అయ్యా! గురువుగారూ! నామాట విని యీముసలి ముండ కేమైన నిచ్చినయెడల మీకు సర్వకార్యదిగ్విజయము కరతలామలకము. మీరు విద్వాంసులు. వేశ్యావీథి మర్యాద లెఱుఁగనివారా? ఏల మీ రుపేక్షించిరో తెలియకున్నది.

విప్ర—ఉపేక్ష కాదు. ధనాభావము.

మాధ—నిజముగ?

విప్ర—ఆ!

మాధ—అటులైన మీ రీ వీథికి రాఁదగదు. దానములకు, దక్షిణలకు, సంభావనలకు, సంతర్పణలకు నిది యేమి యజ్ఞవాటియా? అయ్యయ్యో! మాసవేతనములకు, వార్షికములకు, వస్త్ర బహుమాకృతులకు, ధనసత్కారముల కిది యేమి రాజసభ యనుకొంటిరా? అయ్యయ్యో! బందిపోటుదొంగల మఠమున కేల వచ్చితిరి?

విప్ర—వారిభయము మా కేమి? వారు హరించునది మా యొద్ద నే మున్నది?

మాధ—సరి సరి! అటులైన ధనాగమమునకుఁ గొంతఁ బ్రయత్నించుట మీ కిష్టమా?

విప్ర—ఏ మందువు? శ్రీనివాసా!

శ్రీని—మీయిష్ట మెట్లో య ట్లాచరింపుడు. అయినను—

విప్ర—ప్రయత్నము చేయు మని నీయభిప్రాయ మయ్యా!

మాధ—అయ్యా! శ్రీనివాసుఁడు దుప్పివలె నున్నాఁడు. నేను గసిగవలె నున్నాను. మీకు దేహబలము, దైవబలము కూడ నున్నది. ఊరు మాటుమడఁగినది. చీఁకటిరాత్రి—

విప్ర—ఇఁకఁ జెప్పకుము.

మాధ—వలదనుచున్నారు కాని యింతకంటె సద్యఃఫలదమైన ప్రయత్నము మఱియొకటి లేదు. దీనితరువాతిప్రయత్నము చెప్పనా?

విప్ర—వలదు.

శ్రీని—వల దందు రేల ? చెప్పనిండు.

మాధ—మీరు సంపూర్ణ పండితులు. స్వరూపగ్రంథములలో నిధులు. మంచి వైదికజ్ఞానసంపన్నులు. అదిగాక, కానీయకుండ వెల యాలిని వశపఱుచుకొనుటకుఁ దగినంతలౌకికజ్ఞానమున నస మానులు. మీ రొక్క గ్రంథమును రచియించినయెడల గాఁగరా కట్టిన భోగముముండచేతఁ దలకొక్క గ్రంథమును గొనిపించి మీకుఁ గావలసినంతధనముఁ జేర్తును. స్వతంత్ర జీవనోపాధు లలోఁ గన్నము వేయుట తరువాత గ్రంథకర్తృత్వమే యూరి వారిధనమును హరించుట కుత్తమమైనది.

విప్ర—ఏగ్రంథ మొనర్చుమని మీయభిప్రాయము ?

మాధ—అటు లడుగుఁడు. చెప్పెదను. లౌకికవైదికసాంప్రదాయ జ్ఞాననిక్షేపు లగుమీరు కళాశాస్త్రమునకు విశిష్టాద్వైతభాష్య గ్రంథమును రచించినయెడల—

విప్ర—అయ్యా ! దాసునిఁ గటాక్షించి వదలిపెట్టుఁడు.

మాధ—మీ రిక్కడ వీథియరఁగుమీఁదఁ జీఁకటిలో నుండఁదగునా ? మాయింటికి రండు.

విప్ర—క్షమింపుఁడు. మే మిచ్చటనే యుందుము.

మాధ—దేవదేవి తిరిగి యిచ్చటకు వచ్చు ననునాస మీ కేమైన నున్నదా ?

విప్ర—ఏమైనఁ గాదు. కావలసినంత—

శ్రీని—(అపవారించి) ఉండినయెడల నతనిసంగతి యెఱిఁగియుండియు నతనితోఁ జెప్పుదురఁటయ్యా ?

మాధ—ఏమి మీ కీవెఱ్ఱి ?

విప్ర—నావెట్టికంటె దానివెట్టిపెచ్చు — దానిహృద్వైఖరి నే నెఱుఁగుదును. ఈముసలియామెకుఁ గొంత భయపడినను గాక మానదు. ఆమె నన్నే విడుచునా? ఆమెవలన నాభక్తి చెడెను. నావలన నామెభక్తి చెడెను. ఇద్దఱు మన్యోన్యకారణమున భ్రష్టతను బొందితిమి. మా కిద్దఱి కొక్కటే యంతఃకరణవృత్తి. ఒక్కటే గతి. శ్రీనివాసా! నీయభిప్రాయ మేమి?

శ్రీని—నాకు మతిలేదు. న న్నేమియు నడుగకుఁడు.

మాధ—అది రసయుక్తహృదయ యనుమాట నిశ్చయము.

విప్ర—రసయుక్తహృదయ యని సామాన్యముగ ననెద వేమి? సంపూర్ణరససంయుక్తహృదయ. దానిహృదయ మట్టిదే కాని యెడల నే నిట్లైతె యుందునా? కాకపోవుటయే! ఎంతమాట— శ్రీనివాసా! కాలిచప్పు డగుచున్నది, చూడుము!

శ్రీని—కాలిచప్పుడు కాదయ్యా! గాలిచప్పుడు. అదిగాక నేను జూచున దెక్కడ? తలుపు వేసియే యున్నది.

మాధ—ఆమె వచ్చునెడల నీద్వారముగుండ రాదు. ఈప్రక్కతెరవులో దొడ్డిగుమ్మ మున్నది. అది నీకుఁ జూపించెదను. నాతో వచ్చెదవా?

శ్రీని—అంతయావశ్యకత యిప్పుడు లేదు.

విప్ర—శ్రీనివాసా! లేదందు వేల?

శ్రీని—ఆమె యిప్పుడే రానై యున్నదని మీనమ్మకమై యుండ నగత్య మేల?

విప్ర—ఈసారి గొళ్లెమును దీయు గళుకు వినఁబడినది. వేగఁ బొమ్ము.

శ్రీని—ఇది మనసులోని యులుకు.

మాధ—అట్లు లనఁగూడదు. నేనుఁగూడ వింటిని.

విప్ర—చూచితివా?

శ్రీని—సరే! మంచిదే. రానేవచ్చును. ఇంకఁ బోవనేల?

విప్ర—నాయనా ! పోమ్ము. నామనసు మహానందోళన మొందుచున్నది.

శ్రీని—(పోవును)

మాధ—(సంచి తీసికొని) నామనసు మహానంద మొందుచున్నది.
(పాటిపోవును)

విప్ర—శ్రీనివాసా ! త్వరగ రమ్ము. (లేచును)

శ్రీని—(వచ్చి) వచ్చినదా ?

విప్ర—పోయినది.

శ్రీని—సాని వచ్చి యిప్పుడే పోయినదా ?

విప్ర—సాని కాదోయి ! సంచి—అందులో సాలగ్రామము లున్నవి.

శ్రీని—అయ్యయ్యో ! నేను బోయెదను.

విప్ర—నే నిప్పు డిక్కడ చేయున దేమి ? రేపు సాయంకాలమునకు తిరిగి వత్తము. అంతవఱ కెచ్చటనైన నుందము. తలుపు మూసియే యున్నది కద!

శ్రీని—ధనహీనునియెడల సానిదాని హృదయమువలె—

విప్ర—హా ! దేవదేవీ ! దేవదేవీ ! (ఇద్దఱు నిష్క్రమింతురు)

(దేవదేవి ప్రవేశము)

దేవ—అక్కా ! ఇటు రమ్ము.

మధు—(ప్రవేశించి) నాకు నిద్ర వచ్చుచున్న దని చెప్పిన వినక తిరిగి యిప్పు డిక్కడ కెందులకుఁ బిలిచితివి ? అదిగాక నీభర్తతో నాయెదుటఁ జెప్పవలసినమాట లేమి యున్నవి ?

దేవ—రమ్ము. ఎట్టిమాటలఁ జెప్పెదనో.

మధు—నా కాతని జూడ సిగ్గవుచున్నది !

దేవ—నేనుగూడ నుందును గాదా, రమ్ము! (గుమ్మమునొద్దకుఁ బోయి) హా ! ఇది యేమి ? ఆమహానుభావుఁ డేఁడీ ! ఏఁడీ ! ఎటకుఁ బోయెనో !

మధు—అమ్మ భర్తరా లంటివికాదా! అమ్మచేసినపనియే యిదియై యుండును. ధనశూన్యముగ రా నేల యని యేమి దుర్భాపలాడ సహింపలేక యాతఁ డెటకైనఁ బోయెనేమో? పాపము! నీకు మిక్కిలి సంతాపకరముగ నున్నది కాఁబోలు!

దేవ—నాకు సంతాపము లేదు. సంతోషము లేదు. ఆతని జూడ వలసిన యావశ్యకత స్వల్పముగఁ గలిగి వచ్చితిని.

మధు—నాయెదుట నీ వాతనితో నాడవలసినమాట లున్న వని చెప్పితివి. అవి యేమి? అదిగాక, మనసమయము ననుసరించి నా దాస్యమునకు నీ వేల యంగీకరింపకున్నావు?

దేవ—నాకు నీ దాస్య మక్కఱలేదు. నీ వక్కఱలేదు. మీయమ్మ యక్కఱలేదు. ధన మక్కఱలేదు. ఏమియు నక్కఱలేదు. ఈ యంశములు నీతోఁ జెప్ప రమ్మంటిని.

మధు—అమ్మతెలివితక్కువచేత నట్లు జరిగినది. ఆ మహానుభావుఁడే తిరిగి వచ్చును.

దేవ—నా కాతఁ డక్కఱలేదు. ఈ వేశ్యావృత్తితోడనే పనిలేదు. (నగ లొలిచి) ఈ నిర్భాగ్యపుఁ దుక్కుతో నాకుఁ బనిలేదు. (పాఱవైచును)

మధు—అయ్యయ్యో! ఇది యేమి? విప్రనారాయణునితోఁ గొంత యావశ్యకత గలిగి వచ్చితి నంటివే?

దేవ—ఔను! ఇక్కడ నున్నయెడల మాటలాడఁ దలఁచినాను. మాట లనఁగ నేమున్నవి? అతనితో నాతప్పు నొప్పుకొని క్షమించు మని కోరఁ దలఁచితిని. లేఁడు. అతనిదారి యతనిది. నాదారి నాది.

మధు—చెల్లెలా! అట్లందు వేఁల? ఏమో రోజుచున్నా వేమి?

దేవ—ప్రపంచమున నిదివఱకుఁ బుట్టినవేశ్య లందఱు తమ యావజ్జీవములలో సంపాదించుకొనిన మహాపాపముకంటె సహస్రాంశము లధికమైన పాపమును నే నొక్కతె నొక్కయాఱుమాస

ములలో సంపాదించుకొంటిని. అందులకు నాకుఁ జింత లేదు. జరిగిపోయినది. చింతపడిన వినియోగములేదు.

మధు—కాని యిప్పుడు నీ వేమందువు?

దేవ—చెప్పలేదా? నాకుఁ బ్రాపంచికసంబంధ మేమియు నక్కఱలేదు.

మధు—మహాభక్తుఁ డైనవానిని సంపూర్ణ భ్రష్టుని జేసియాతని నిప్పుడు విడిచిపెట్ట న్యాయమా?

దేవ—ఆతఁడు సంపూర్ణభ్రష్టుఁడు కాలేదు. చేయుటకు నాతరము కాలేదు.

మధు—నాకుఁ దెలియని మాటలఁ జెప్పుచున్నావు.

దేవ—విప్పి చెప్పెదను వినుము. ఎన్నరాని లంజెవేసములు వేసి యాతనిని మడిగదిలోనికిఁ దీసికొని పోయితిని.

మధు—తరువాత—

దేవ—ఆయన బ్రహ్మచర్యవ్రతమునకు భంగము కలుగఁజేయవలయునను దురుద్దేశముతోఁ గౌఁగిలించుకొనునరికి నాయొడలా పాదమస్తకము భగ్గుభగ్గున నిప్పులతోఁ గాల్చినట్లు మండిపోయెను. నిలువున నట్లు కాలిపోవుచుంటి నను మహాభయముచే నే నుండఁ జేతులు తమంత తామె పట్టువదలిపోయెను. వెంటనే యొడలియంట చల్లారెను.

మధు—ఏమి వింతగ నున్నది?

దేవ—మన కిది వింత గాని, దుస్సహతేజస్సంపన్నులైన భక్తుల కది వింత కాదు. అంతకుముం దనేకపర్యాయము లాతని స్పృశించితిని గాని యట్టియవస్థ నాకుఁ గలుగలేదు. ఆతఁ డప్పటికిఁ గొంత భక్తిచ్యుతిగలవాఁ డయ్యును రంగఁ డాతనిని — నీవు చెప్పినట్లు — సంపూర్ణభ్రష్టుఁడు కాకుండ రక్షించినాఁడు. అంతట నా కేమియుఁ దోఁచక గొంతుగఁ జెదరిపోయిన మతితో నిల్లు సేరితిని.

మధు—అందుచేతనా వచ్చినప్పటినుండియు నేమో వెఱ్ఱిదానివలె నుంటివి? విప్రనారాయణ విరహముచే నట్లుంటి వని యను కొంటిమి.

దేవ—అది మీ వెఱ్ఱి — శ్రీరంగము పోయి యాతనిని నాయింటికిఁ దోడితెత్తు నని యాతనిమహావాంఛపై మాటవరుస కంటిని. అట్లు నేను బోకపోవుటఁ జూచి యాతఁడే యిచ్చటకు వచ్చి నాఁడు.

మధు—బ్రహ్మహత్యఁ దెచ్చుకొంటిమి కదా! మనపంచలఁబడి దేవు లాడు నీబ్రాహ్మణు నిప్పు డేమి చేయవలసినది?

దేవ—మనమా చేయవలసినది! అజ్ఞానము — వేశ్యాకులమునఁ బుట్టి తరతరములనుండి వచ్చుచున్న పాపగంధవిషసంపర్కమును రక్తమునఁ బూర్ణముగఁ గలిగి పెద్దదాన నైనదిమొదలు నిరంకుశముగ వ్యభిచార మొనర్చిన నేనే భక్తుని సంపూర్ణ సంస్పర్శచే — అది యొక్కమిష — కాని యథార్థముగ నీవు చెప్పి నట్లు దైవేచ్ఛచే — ప్రాపంచికసుఖవిరాగినినై — భక్త్యంకుర సహితహృదయనై యున్నప్పుడు — మహాత్ముఁడు, పరమ భక్తుఁడు, లింగభేదమే యెఱుఁగని రంగదాసుఁడు, ఆహా, దైవసముఁడు—అట్టి లోకోత్తరుఁ డొక్కసారి — పురాకృతపాప లేశమున వేశ్యావీథికి రాఁగ ఇఁక నంతయేనా? తిరిగి భక్తుఁడు కాఁడా? అందులకు మన మేమి చేయవలసియున్న దనుచుంటివా? ఎంతమాట! తల గిఱ్ఱునఁ దిరిగి, దేహ మవశమై, పడిపోవుచు, గ్రుంగినప్పుడైన, నేలఁ బడకుండ నాతనిని రంగఁ డుద్ధరించి నాఁడే? ఇప్పు డారంగఁ డెక్కడకుఁ బోవును? ఆతనినిగూర్చి నీకు విచార మక్కఱలేదు. నన్నుఁగూర్చి యంతకంటె నక్కఱ లేదు. నేనుఁ బోయెదను. నమస్కారము.

మధు—ఎక్కడకు? తిరుగ విప్రనారాయణునియొద్దకుఁ బోయెదవా?

దేవ—అయ్యయ్యో! ఒకనితో లేశమైన నిమిత్తము లేదని చెప్పఁ దిరిగి యట్లడుగుదువేల? విప్రనారాయణునితో నా కేమి?

నాతో నాతని కేమి? నా కొక్క (శ్రీ) మహావిష్ణువుతోఁ దప్ప నితరవస్తువుతోఁ బని లేదు.

మధు—నీ విల్లు బోయితి వని తెలిసినయెడల నమ్మ బెంగపెట్టుకొని చచ్చిపోవునేమో ?

దేవ—అమ్మ పోయినయెడల జగ త్తంతమగు ననియా నీ యభిప్రాయము ? అట్లయినమాత్ర మేమి ?

మధు—అయినను దొందరపడక యాలోచించుకొనుము.

దేవ—ఆలోచించిన యాడుదాని కథోగతియే. పోవుచున్నాను. (తనలో) దక్షిణమున సారనారాయణ మను దివ్యక్షేత్ర మున్నది. అచ్చటఁ జేరి విష్ణుదాస్య మొనర్చుకొందును.

(దేవదేవి పోవును)

మధు—అయ్యయ్యో ! పోవుచున్నది. ఇఁక నాఁగదు. ఆహా ! భక్తి యం దున్న విశేష మెంత ! దొంగభక్తి నాలుమాసములు దెచ్చుకొనునసరికి సత్యమైనభక్తి కుదిరినది. ఆహా ! ఆహా ! ఇంటి కొక్కతెనై పోయితిని. దేవదేవి యొక్కడికో భక్త్యావేశమున నిల్లు విడిచిపోయిన దని నేను మా యమ్మతోఁ జెప్పను. విప్రనారాయణుఁడు దన కేమి తొందర యిచ్చునో యను భయమున సమీపమున నున్న పినతల్లిగారి గ్రామమునకుఁ బోయె నని చెప్పెదను. హా ! విప్రనారాయణా ! ఎంతపని జేసితి వయ్యా ! ఎక్కడ నుంటివయ్యా !

(నిష్క్రమించును)

ఇది పంచమాంకము.

శ్రీ

విప్రనారాయణ చరిత్రము

షష్ఠాంకము

ప్రదేశము—వేశ్యావీథి.

(ప్రవేశము—విప్రనారాయణుఁడు, శ్రీనివాసుడు.)

విప్ర—ఈసారి యేకారణముచేత లోనికిఁ బోవచ్చు నంటివా ?

శ్రీని—అది కారణ మంటిని గాని పోవచ్చు నని చెప్పలేదు. వేశ్యా మాతకు దూత నని యాతఁడు చెప్పలేదా? ఆతఁడే మనసంచి హరించినాఁడు. అందువలన నిర్భీతిగా లోనికిఁ బోయి యా ముండను బెదరింపవచ్చునని యుంటిని. సంచికొఱకు నే నేడ్చు చుండఁగ సానికొఱకు మీరు వాంఛించుచున్నారు.

విప్ర—సరే. "దేవదేవీ" యని పిలువుము.

శ్రీని—దేవదేవీ! దేవదేవీ!

(నేపథ్యమున) ఒసే! పెద్దీ! జంగమునూ కాలయ్యగారు కాబోలు! తలుపు దీయుము.

(మఱియొకధ్వనితో) ఎవఁడైన సరియే నే నిప్పుడు తీయుటకు వీలులేదు.

వేశ్యమా—(తలుపు తీసి) నాయనా! నాకు దగ్గునకు భూతపిల్లిగడ్డ తెచ్చిపెట్టెద నంటివి, తెచ్చితివా ?

శ్రీని—నేను శ్రీనివాసుఁడను.

వేశ్యమా—నాతండ్రే! శిష్టుకరణం శ్రీనివాసంగారా ? చూడు! మీ అమ్మమెడలోఁ బెట్టెద నంకించుకొనియే వచ్చితివి గదా ? నాయనే! ఏదీ ?

శ్రీని—(అపవారించి) అయ్యో! ఇక్కడకు దేవదేవి క్కిద్ద త్తెనారు. వింటివా? అడిగినకొలఁది నింక నొదలు బయలుదేరుచురో! బ్రహ్మచారిణి యని మీ యభిప్రాయము. (ప్రకాశముగ) నేను శిష్టంకరణమును గాను. విప్రనారాయణుని శిష్యుఁడను. వీరే మా గురువుగారు.

వేశ్యమా—ఏఁడీ! మీగురువు. జుట్టు పాయఁదీసి తన్నెదను. నిన్నను బొమ్మని చెప్పినను సిగ్గులేక తిరిగి యేల వచ్చినాఁడు.?

విప్ర—మాసంచిని నీదూత మాధవుఁడు హరించుటచేత నీతోఁ జెప్ప వచ్చితిమి! (మాధవుఁడు ప్రవేశించును)

మాధ—దొంగముండకొడుక! నీసంచిని నేను హరించితి నఁటరా? నీ బ్రదుకునకు సంచికూడనా? సంచి యున్న యెడల సందెబిచ్చ మైన నెత్తుకొందువు కాని తేరసరసమునకు వత్తువా?

వేశ్యమా—దాసరిముండకొడుక! త్రిశూలములవలె, సురికంబముల వలె పట్టెనామములు పెట్టి సిద్ధమైతివా? నీసుద్దబద్దెలు చూచి నిన్ను వాడసాను లిట్టె యిట్టె ముద్దుపెట్టుకొందు రనుకొంటివి కాఁబోలు! మొద్దుముండకొడుక! నీ జేగురుడాగులు చూచి భోగముముండ లందఱు రాగమొందెద రనుకొంటివి కాఁబోలు! బైరాగిముండకొడుక!

శ్రీని—రంగరంగరంగా! (చెవులు మూసికొనును.)

మాధ—అతనిధైర్య మది కాదమ్మా! అచ్చువిడిచినయాఁబోతావుల మందపై నిరంకుశముగఁ బడినట్లు శంఖచక్రచిహ్నితుఁడైన యీతఁడు సానిపడుచులపైఁ దేరతేరఁగ బడుట కధికార మున్నదని యనుకొనుచున్నాఁడు.

వేశ్యమా—ఊరివారికొంపలు మేము దీయుచుండ మాకొంపలు గూల్ప వచ్చితివా? ఊరివారి రక్తమాంసములు మే మనుభవించుచుండ మా రక్తమాంసములు నీపొట్టఁ బెట్టుకో వచ్చితివా? ఛీఛీ! అజ్రోసుజాయిలాగున మొగము నీవు! నడు! నడు!

మాధ—వట్టియబ్రోసుతాయి కాదమ్మా! నాలుగవయంకె వేసి యబ్రోసుతాయి యనునెడల కేవలము పాపమొగము కాకుండఁ బంగనామముకూడ గొంత పడును.

వేశ్యమా—పోకపోయినమొడల టోకలితోఁ బాడుతును.

శ్రీని—మాటలతోఁ బనిలేదు. మాసంచి మాకిమ్ము. పోయెదను.

వేశ్యమా—మీా సంచి యెక్కడ?

విప్ర—మాధవా! ఇదివఱకు నీతలక్రిందఁబెట్టికొనినది మాసంచికాదా?

వేశ్యమా—మాదిగా! నీకాలిజోడేదీ? (తీసికొని) నీసంచి నామగనితల క్రింద, నామగని పాదరక్ష నీతలపైని—(నెత్తిపైఁ గొట్టుచున్నది)

విప్ర—రంగరంగరంగా! కావేరిరంగా! కస్తూరిరంగా! దయచేసితివా? తిరిగి నాకంటఁ బడితివా? నీ కిప్పటికి నాయందుఁ గరుణ కలిగినదా? నాకష్టము లింకఁ దొలఁగినవా? నాయనా! తండ్రీ! రంగయ్యా! రంగయ్యా! ఓహో! ఎంతకాలమునకు నీ దివ్య దర్శన మిచ్చితివి! అపరాధుఁడను; దుర్మార్గుఁడను; భక్తవత్సలా! పరమపురుషా! దీనదయాళూ! సంసారోత్తారకా! నీల మేఘాంగా! రంగా! రంగా!

(క్రిందఁ బడును.)

శ్రీని—స్వామీ! స్వామీ! ఏమి యిది!

వేశ్యమా—రంగరంగా యనుచుఁ గావుకేకల వైచి యట్లయ్యవారి గాఁడు కొయ్యవారినాఁ డేమి?

మాధ—నీచెప్పుదెబ్బతోఁ గపాలమోక్షమై, విటజన్మము వదలి భక్తజన్మము వచ్చినది.

వేశ్యమా—(అపవారించి) చచ్చునేమో? నక్షత్రము మంచి దగునో కాదో! అరఁగుక్రిందనుండి యీడ్చివేయుము.

శ్రీని—స్వామీ! స్వామీ! లేవరా?

మాధ—(అపవారించి) మన మిక్కడ నుండక లోనికిఁ బోవుదము రమ్ము. ఈతఁడు వచ్చినయెడల మన కేమివిప్రమాదమో? ఈ సంచిలోని [illegible] కపేక్షించి యీతని జంపితి మనుదు రేమో! ఈసంచి వారికిఁ బాఱవేయుదమా?

వేశ్యమా—(అపవారించి) వాఁడు వచ్చిన సరే. నీవు వచ్చిన సరే. నే సొమ్ముల కొప్పుకోనను. రా! లోనికి రా!

మాధ—(అప) వచ్చినయెడల శ్రీమాన్ణపరిపాలనమున్నదఁ బనిక వచ్చును. తిరుమణిపెట్టెనుఁ బాఱవేయుము.

వేశ్యమా—(అపవారించి) ఇది ముప్పులు పెట్టుకొనుట కంతయాగనుగ నున్న దనుకొన్నావు. రా! లేకున్న నిన్నుఁ దన్నెదను.

(ఇద్దఱు నిష్క్రమింతురు)

విప్ర—అయ్యయ్యో! అయ్యో! మృదులమైన పాదమే. శిరీషపల్లవ సల్లలితమైన పాదమే — పరమమంగళరేఖా సంపూర్ణాంతికోమలమైనపాదమే. అరుణారుణలలితలలితమైన పాదమే — శ్రీదేవీకర పల్లవపరామర్శనార్హమైన పాదమే! శంఖచక్రచిహ్నాంకితమైన పాదమే. మునులు మూటగట్టుపాదమే — ప్రబలసంసారసముద్రోత్తారకసాధనమైన పాదమే — గంగామకరంద స్యందనసుందరారవిందమైన పాదమే — అట్టిపాదమే — నాకుఁ బ్రాణపదమైన పాదమే. నాతండ్రీ! రంగయ్యా! లలితలలిత—సుకుమార—కోమల—మృదుల — పేశల — మంజులారుణమైనయట్టి పాదమును — ఈ నిర్భాగ్యుని — ఈ పరమపాపాత్ముని — ఈచలితేంద్రియుని — పైన — మహాకఠినమైన యీ తలపై మోప — ఆహా! నొచ్చిన దేమో కదా! నాయనా! నాతండ్రీ! లోకనాథా! దాసరథీ! దీనబంధూ! సహజారుణమైన పాదము కందిపోయిన దేమో? అయ్యయ్యో! ఈ మహాపరాధమును నే నెట్లు భరింతునోయి రంగా! రంగా! రంగా! (బిగ్గఱగ నఱచుచు లేవఁబోయి గుండెలు కొట్టుకొని నేలఁ బడును.)

శ్రీని—ఆహా! ఈతనిభక్తి యాకస్మికముగా నుద్బోధమైనది. మహాదృష్టము సంభవించెను.

గీ॥ ఐహికాపేక్ష దిగలాగి నప్పు డితని
భక్తి మెల్లనఁ గ్రుంకి యీ పట్టు దైవ
కృపను వీడ హఠాత్తుగా నెగసెఁ బైకిఁ
గ్రుంగలాఁగి విడుము చెట్టుకొమ్మ బోలె.

విప్ర—గీ॥ బలిశిరంబునఁ దనపాదపద్మ ముంచి
యతని నిజభక్తుఁగాఁ జేసె నంబుజాక్షుఁ
డట్టి రంగయ్య కమ్మ! నాయందు నెంత
కృపయొ? నన్నుఁ గూడ నట్లాదరించినాఁడు.

(శిరముపైఁ జేతు లుంచుకొని) ఇదిగో! నీపాదపద్మము. మొక్కి మొక్కి నొత్తెదను. ఆహా! నాతండ్రీ! రంగా! రంగ! (తల నొత్తుకొను చున్నాఁడు.) నాయనా! నీపాదమును గన్నుల కద్దుకొందును. (అట్లు చేయును.) బంగరుగజ్జలతో గలగలలాడి యొప్పులకుప్పలగు నీపాదములు లోకరక్షకములు! రాధ, పూర్వమున ముద్దుఁగొని నట్లు మదీయ శిరోవతంసమైన నీపాదమును ముద్దుఁగొందును. (తలమోపి) అయ్యయ్యో! అందకున్నది. (తల తిరిగి పైకెత్తును) అందదేమి? హా! రంగరంగా! (గుండెలు కొట్టుకొనును.)

శ్రీని—స్వామీ! మెడ నొప్పులు పట్టును. మొగము వంచుఁడు. (తన చెయ్యి నతనిమోముపై నుంచును.)

విప్ర—సెబాస్! అందినది! అందినది! (లెక్క లేకుండ శ్రీనివాసుని చేతిని ముద్దు పెట్టుకొనును) రంగరంగరంగా! ఇదిగో! శ్రీపాదము. నాచేతులఁ బెట్టితివి! దీనిని స్పృశించుటకే నాత్వక్కు! దీనిని బూజించుటకే నాతోఁటలోఁ బూలు! ఈతీర్థమును ద్రావుటకే నానోరు! దీనిని గాంచుటకే నాకన్నులు! దీని నాఘ్రాణించుటకే నాకు నాస! దీనిని వదలకుండఁ గట్టిగఁ

బట్టుకొనుటకే నా చేతులు ! ఈశక్తి ! రంగరంగరంగా ! రంగ
రంగా ! రంగరంగరంగా ! (మొగిరి గంతులు వైచును.)

శ్రీని—స్వామీ ! నేను శిష్యుఁడనగు శ్రీనివాసుఁడను.

విప్ర—అదుగో ! రాయి ! అదుగో ! రమణి ! అదుగో ! రంగఁడు !

శ్రీని—పిలిచిన వినఁబడకుండ నున్నది. దేహస్మృతి లేక యున్నది.
ఆహా ! భక్తిపారవశ్యము !

విప్ర—గీ॥ చపలచిత్తత భక్తిన ♦ ష్టతను బొందు
నన్నుఁ దన్ని ప్రోచితివి రం♦గన్న తండ్రి !
చలితశిలత రాయియా ♦ నలయహల్య
నోమి భక్తుఁ జేసినరఘు♦రాముఁడట్లు.

అదుగో ! విభీషణాళ్వారులు. అదిగో ! కావేరి. అవిగో ! గోపుర
ములు. అవిగో ! పసిఁడికుండలు. అవిగో ! ధ్వజస్తంభములు.
అవిగో ! ముఖమండపములు. అదిగో ! సువర్ణబలిపీఠము.
అదిగో! ఆలయము. అదిగో! ఘంటారవము. అదుగో! ద్వార
పాలకులు. అదుగో ! విష్వక్సేనాదులు. అదిగో ! శేష
తల్పము ! అదిగో ! శ్రీదేవిపిరాట్టి. అదుగో ! భూనీళాదేవులు.
అవిగో ! అవిగో ! అవిగో ! దివ్యాళ్వులు. అదిగో రంగనితిరుమొ
గము హాహాహా ! (లెంపలు వైచుకొనును.) అవిగో ! మంగ
ళపుటారతులకాంతులు ! అదిగో ! మఱల నాతండ్రితిరుమొ
గము ! ఆహా ! ఏమిప్రసన్నముగ నున్నది ! (లెంపలు వైచు
కొనును) అదిగో ! మఱల నాయెయ్యారిరంగని ముద్దులొలుకు
వదనపుండరీకము. అదుగో ! నారంగఁడు ! నాభర్త ! నానాథుఁడు!
నాగురుఁడు ! నాతల్లి ! నాతండ్రి ! నాతోఁడు ! నాప్రభుఁడు !
నాదైవము ! నారంగనాథుఁడు ! నారంగయ్యతండ్రి ! నారంగ
మూర్తి ! ఓఓఓ (పెద్దకేకలు వైచును) దాసోస్మి ! దాసాను
దాసోస్మి ! దాసానుదాసాథమోస్మి ! రంగరంగరంగా !

(సాష్టాంగపడును.)

శ్రీని—ఆహాహా! తిరిగి యెంతభక్తిపారవశ్యమునఁ బ్రకాశించుచున్నారు. గురూత్తమా! దాసోహం! దాసోహం! (ప్రదక్షిణముచేసి నమస్కరించును.)

గీ॥ ఇతఁ డితనిశిష్యుఁ డని విటు ♦ లెత్తిపొడుతు
రేమొ యని మది జంకితి ♦ నింతకమును
యితనిశిష్యుఁడ నని యిప్డు ♦ డెంచుటకునె
తగను హా! నే నెచటను? భ ♦ క్తవరుఁ డెచట?

గీ॥ ఇతనిభక్తి కాంతాబలా ♦ త్కృతిని మెల్ల
నడలి, ప్రాపట్టు ఏడఁ ద ♦ క్షణమునందు
నట్టబింకమ్మె దాఁకొనెఁ ♦ బట్టి లాగి
విడుచునినుపబింకపుఁజుట్టు ♦ విధముగాఁగ!

గీ॥ జ్ఞాని ముక్కుమూఁతలు సాని ♦ దానికంటి
కెదుటఁ గన్నుగీటులుగ భే ♦ దించిపోవు
భక్తుచేతి తాళంపుఁజి ♦ ప్పలును వేశ్య
యెదుట గబ్బిగుబ్బ లయి హే ♦ ళించిపోవు.

గీ॥ పొగవలెను దుష్టపవనము ♦ పోల్కి తెలియ
రాకయుండఁగ సాని దు ♦ ర్మహిమము మన
మనములను దూరి పరిశుద్ధ ♦ మన్నుఁ జేసి
నాశ మెఱుఁగని యాత్మకు ♦ నాశ మిచ్చు.

గీ॥ దానితోఁ బల్కఁ బనిలేదు; ♦ దానిఁ గనఁగ
నక్కఱయు లేదు; మొద్దయి ♦ యద్ది యొద్ద
నున్నఁ జెడుట నిక్కము నల్లు ♦ లున్న మంచ
మువలనను మంచిదియుఁ జెడి ♦ పోవుఁ గాదె?

విప్ర—సాష్టాంగస్థితినుండియు, నీతిరుముఖమండలదర్శన మవిచ్ఛిన్నముగఁ జేయుటకుఁ గన్ను లిక్కడ నుంచలేకపోయితివా? (తలను జూపును) రంగా! రంగ! తిరిగి లేవనక్కఱ లేకుండును గాదా? మహాప్రభూ! (లేచును) ఆహా! మహాత్మా నీదివ్య

వైభవదర్శన మపేక్షించి యిచటికి వేంచేయుభక్తులపాద పరాగము నాకుఁ బాదాదిశిరఃపర్యంత మంటి యెల్లు ప్రకాశించుచున్నదో భక్తపాదరేణువులచే నీసన్నిధానమున నిట్లు పవిత్రుఁడనుగఁ జేయఁబడిన నే నింతటినుండి "భక్తాంఘ్రిరేణు" వను నామమును ధరింతును.

శ్రీని—గ్రామపౌరుషవ్యాపారాదిజన్యనామములఁ ద్రోసి తత్తదీయసంబంధసూచకాభిధానముల ధరించువాఁడే నిజమగుభక్తుఁడు కదా! భక్తాంఘ్రిరేణు వనఁగ ద్రావిడమునఁ "దొండరడిప్పొడి" యగును. అధోగతినుండి రంగకటాక్షమున హఠాత్తుగా మహోన్నతస్థితిగలిగిన యీతనిలోనిమార్పు నూతనజన్మము వంటిదే కాన నూతననామముగూడ నర్హమే. ఆహా! భక్తి మహిమము.

ఆ॥ వె॥ వేశ్యవీథి తేరు ♦ వీథి యయ్యెను; విటుల్
పరమభక్తు లైరి; ♦ వారిపాద
రజము పూతమయ్యె; ♦ రంగఁ డాలయముతో
నిట గుడిసెలనడుమ ♦ నిలిచినాఁడు.

విప్ర—(చేతు లెత్తుచు) అందవా? అందవా? తండ్రీ! తండ్రీ! (ఎగురును) అంద వేమి? రంగా! రంగా! రంగా! తండ్రీ! తండ్రీ!

ఆ॥ వె॥ దాసుఁ డెగురలేక ♦ గాసిల రంగయ్య!
యీవు వంగి నన్ను ♦ నెత్తవలదె?
ఎగిరి కరము లెత్తి ♦ యెగఁ బ్రాఁకుపుత్త్రకు
నిట్టె తండ్రి వంగి ♦ యెత్తుకొనఁడె?

(ఎగిరి, ఎగిరి) రంగరంగరంగా! (పడిపొరలుచున్నాఁడు.)

శ్రీని—ఈతనిభక్తి మునుపటిదానికంటె ద్విగుణముగ నున్నది. ఎందుచేతనో?

సీ॥ ఆకు దుల్చినఁగాని పు♦ష్పాంచితంబు
కాదు మల్లె; తలం గోయఁ♦గాని మొవ్వ
వేయ దరఁటి; చెప్పున రాచి ♦ విడువఁగాని
ధనియ మొదుగదు; భక్తి యా ♦ దారి యేమొ?

గీ॥ అనిలదేవుఁడు బైరయ్యె ♦ మనకముందుఁ
బలఁచబడి చప్పఁబడు, నిర♦భ్యంతరముగ
బొంగఁదలచు నట్టె వెనుకఁ ♦ బోవు, భక్తి
యుప్పొంగయుటకు ముందు వె♦న్కాడెను నేమొ?

ఆహా! భక్తపాదపరాగము దేహమునకు నెంత యంటుకొనిన నంత మంచిదని యీమహాత్ముఁడు నేఁడు దొరలుచున్నాఁడు.

గీ॥ గంధగజ మెక్కు భూపతి ♦ ఘనుఁడు గాఁడు,
ప్రాణవాయువులను బిగ్గ♦బట్టి మింట
నుండువాఁడు ఘనుండు కాఁ, ♦ డొడలు తెలియ
కిలను బొరలుచునుండెడు భక్తుఁ♦డే ఘనుండు.

ఆహా! ఎంతవిస్మృతిగ నున్నాఁడు. మహాత్మా! లేచెదరా?
(లేవఁదీయుచున్నాఁడు.)

విప్ర—ఓహో! నాతండ్రీ! నాతండ్రీ! నిన్నుఁ జేరుటకు నాకుఁ జేయూఁత యిచ్చితివా? ఎగరలేక పడిపోయిననన్ను నీయొద్దకెత్తితివా? రంగా! రంగా! రంగా! దేవరదాసుఁడను. (శ్రీనివాసునకుఁ బ్రదక్షిణము సేయును)

శ్రీని—ఆహా! నన్ను రంగనిగ భావించుచున్నాఁడు. నే నీతని వెనుకకుఁ బోవ నేమిచేయునో చూతును. (అట్లు పోవును)

విప్ర—భక్తుఁ డగు నాంజనేయుని గాఁగిలించిన యీ నీ తిరుహస్తములతో న న్నొకసారి స్పృశింపవా? ఏదీ! ఏదీ! (కౌఁగిలింపఁ బోయి పడును. తిరిగి లేచి) అదుగో! రంగఁడు! ఇదుగో! రంగఁడు! అదుగో! రంగఁడు! అదుగో! రంగఁడు! ఎక్కడఁ జూచిన రంగఁడే! ఎక్కడఁజూచిన రంగఁడే! నాయుఱచేతులలో

రంగఁడు! నావక్షస్స్థలమున రంగఁడు! (కన్నులు మూసికొని)
అదుగో! నాలోఁగూడ రంగఁడు! వెలుపల నంత రంగఁడు!
రంగనిలో నేను; నాలో రంగఁ డున్నాఁడు. నే నికఁ గన్నులు
తెఱవను. నాలోనున్న రంగదేవు నాంతరదృష్టిచేఁ జూచు
కొందును. (పడును)

శ్రీని—ఇది భక్తకవధి కాఁబోలు! ఈతనిభక్తిక్రమము నేను నాకుఁ
దోఁచినట్లు కనిపెట్టితిని. మొట్టమొదట నల్పజ్ఞానేంద్రియ మగు
స్పర్శయందు భగవదనుభవ మారంభమై పులకాంకురాదులు
కలిగినవి. అటుతరువాత జ్ఞానసంపత్తిచే నగ్రగణ్యమగు నేత్రేం
ద్రియమునకుఁగూడఁ దదనుభవము వ్యాపించి శ్రీరంగదేవాలయ
మెదుటఁ గానఁబడ దానిలో రంగని గాంచెను. తరువాత
నాలయాదిబహిస్సంబాధశూన్యముగనే నన్నే రంగనిగ భావిం
చెను. అటుపైన లోకమంతయు రంగమయమై కంటికిఁ గానఁ
బడెను. తరువాత బాహ్యేంద్రియవ్యాపార మక్కఱలేకయే
యాంతరదృష్టిచే రంగని దనలోను వెలుపలను గాంచెను.
ఆహా! వెఱ్ఱిలోఁగూడ నెంతక్రమ మున్నది!

గీ॥ ప్రకృతిక్రమ మెప్పు తప్పదు, ♦ క్రమము తప్ప
వెఱ్ఱి యందు, రసత్వంబు, ♦ వెఱ్ఱిలోన
ననుభవించువానికిఁ జూచు♦నతనికైనఁ
దత్క్రమ మతివేగమున బో♦ధంబు కాదు.

గీ॥ మనసు చెడుట వెఱ్ఱి యటంచు ♦ మనుజు లందు,
రది యమితవృద్ధి నందుట ♦ యగును వెఱ్ఱి,
జ్ఞానరాగంబులం దేది♦యైనఁ బొంగ
కుండ వెఱ్ఱిలే, దావెఱ్ఱి ♦ యుండ మేలు.

గీ॥ నమ్మికమువనో మెత్తఁద♦నమునవో పర
కష్టజాతినో యీవినో ♦ కరుణలోనో
కొలదియో గొప్ప దేవనో ♦ కొంతవెఱ్ఱి
గలుగువానికిఁ గాక ♦ సద్గతియె లేదు.

గీ॥ మనసుభాగము లన్ని తూ♦చినవడువున
గలిగి కొలఁబుఱ్ఱతోఁ దిని ♦ కొలిచి పరుని
కిచ్చి వేడి చల్వయును గా ♦ కెసఁగు నరుని
కచట నిచటను సద్గతి ♦ యరుదు సుమ్ము!

గీ॥ పరమపద మొందఁదలఁచిన ♦ ప్రతినరుండు
నిట్టిస్థితిని బొందకతీఱ ♦ దట్లు గాక
మెత్త లున్న కుర్చికి నాని ♦ యింటి తండ్రి
యని మొఱల్వెట్ట గళశోష ♦ మగుటె ఫలము.

గీ॥ అట్టిభక్తుఁడు దేవు నీ♦క్షించుఁ గనులు
మూసికొనియునుఁ; గడుపాఱ ♦ మేసి కనులు
మూసి ధ్యానించునరునకుఁ ♦ బొడముకుండో,
గరిటెయో, కుక్కతోకయో ♦ కానిపించు.

గీ॥ విగ్రహారాధనము, వర్ణ♦విభజనంబు,
లింగభేదంబు నిట్టి శ్రీ♦రంగభక్త
వరుల కక్కఱలే దన్ని♦పట్ల దేవు
పొడఁగనెడు నాతనికి భేద♦బుద్ధి యెట్లు?

గీ॥ ఇట్టిపరమప్రపన్నున ♦ కెట్టికర్మ
ములు పనియు లేవు; స్నానసం♦ధ్యలను మాని
విస్మృతికొఱకు చెడఁద్రాగి ♦ వీరవైష్ణ
వప్రపన్నుల మనుకొంట ♦ వట్టితప్పు.

గీ॥ కర్మశూన్యత్వము ప్రపత్తి ♦ గలుగవచ్చు,
గర్మశూన్యతను బ్రపత్తి ♦ కలుగఁబోదు;
కలితధీశక్తిభాగ్యంబు ♦ గలుగవచ్చు,
గాని సంపదచే బుద్ధి ♦ గలుగఁగలదె?

గీ॥ భక్తి యాత్మలో నిండెడు♦వఱకు స్మరణ
నృత్యములు తప్ప, వటుపైన ♦ నేమి లేవు;
నీటిలో ముంచఁబడు కూజ ♦ నిండువఱకుఁ
గుడుగు డనుఁగాని పిదప కి♦క్కు రనునొక్కొ!

ఆహా! ఈమహాత్ముఁ డింక స్మృతిలేక యున్నాఁడు. స్వామీ! దేవా! తొండరడిప్పొడియాచార్యోత్తమా! ఆహా! ఇంకఁ బలుక కున్నాఁడు. ఈ విస్మృతి యెప్పటికి వదలునో? ఇంత యొడలు తెలియక యుండువానిని నే నెట్లు శ్రీరంగక్షేత్రము నకుఁ దీసికొనిపోవుదును? హా! ఏమిదిక్కు! దేవదేవి యేమం సదో తెలియదు. ఆహా! ఎంతమహాత్మ్యగుణాలు! ఈతని సది యిట్లు భంగపఱచి యిట్లుపేక్షించుటకుఁ గారణ మేమో యనుగ్రహ్యమై యున్నది. ఆహా! రంగరంగరంగా! రంగ! -

(నేపథ్యమున) ఎవ రచ్చట! రంగనామస్మరణమును జేయుచున్నారు?

శ్రీని____నేను విప్రనారాయణభాగవతోత్తముని శిష్యుఁడను.

(నేపథ్యమున) ఆమహాత్ముఁ డచ్చట నున్నాఁడా?

శ్రీని____ఉన్నాఁడు. నీ వెవఁడ వయ్యా?

(నేపథ్యమున) నిచుళాపురభూపాలుఁ డాతనిని దర్శించుటకై వచ్చుచున్నాఁడు.

శ్రీని____ఆహా! రాజుగారే! దయచేయుఁడు.

(రాజు ప్రవేశించును.)

రాజు____(ప్రదక్షిణముచేసి) విప్రనారాయణాచార్యోత్తమా! దాసోహం, దాసోహం. భక్తపారవశ్యమున నిట్లుంటివా? అయ్యా! నే నీ మహాత్ముని శ్రీరంగమునకుఁ దీసికొనిపోవ వచ్చితిని.

శ్రీని____ఈతఁ డిచ్చట నున్నట్లు ప్రభువుల కెట్లు తెలిసినది?

రాజు____నా కీదినమున జాముప్రొద్దెక్కినసరి కీలేఖ చేరినది. ఇది దేవదేవి యను నొకవేశ్య వ్రాసినది. చదివెదను వినుము.

(చదువుచున్నాఁడు.)

"అయ్యా!

విప్రనారాయణుఁడు నిశ్చలభక్తుఁ డని మహాయశక్రియు జలితేంద్రియుఁ డని నేనును వాదులాడు కొని తుద కాతని భ్రష్టుని జేసెద నని నే నామెతోఁ బందెము

నైచితిని. అట్లు భక్తభంగము గావించి యాతని మావీథికి రప్పించితిని. కాని యాతనికి బ్రహ్మచర్యవ్రతము భంగము కాలేదు. ఆతని కీర్తి దురవస్థ నామూలమునఁ గలిగి నప్పటి నుండియు నా కేమో యమిత మగు నాందోళనము మనసునఁ గలిగి, ప్రపంచమును రోసి, విరాగినినై స్వేచ్ఛచే భక్తి లేశావృతనై యెచ్చటికో యీయుదయముననే పోవుచుంటిని. మీరు నన్ను వెదుకవలదు. మీకు నేను గనఁబడను. కాని శ్రీరంగభక్తుఁ డగు మహాత్ముఁడు మా వీథి నున్నాఁడు. ఆతనిని మీరు శ్రీరంగమునకు గౌరవపూర్వకముగఁ దీసికొని పోయి యాతనివనమునఁ బ్రవేశపెట్టుఁడు. ఆతనిని రంగఁడే సర్వవిధములఁ గాపాడు నను నిశ్చయవిశ్వాసము కలిగినదాన నయ్యును మీ కీ మహాత్ముని సేవవలనఁ బుణ్యము రాఁగల దని వ్రాసితిని."

తిరుక్కరంబనూరు. | చిత్తగించవలెను
దేవదేవి.

శ్రీని—(తనలో) ఇప్పటికి నాసందేహము తీఱినది. ఇంత కాలమునుండి గురుసేవఁజేసిన నాకుఁ బూర్ణభక్తి కలుగలేదు కాని, మహానాభక్తి యొనర్చినదేవదేవి యిట్లు భక్తురా లయ్యెనుగదా! అదృష్టము!

రాజు—ఈ దేవదేవి యెవ్వతెయో ఈ లేఖ యెంతసత్యమో యని నే నుపేక్షించి రేపు చూడవచ్చు నని యెంచి యీరాత్రి నిదురింప నొక నాల్గుగడియలక్రిందట శ్రీరంగేశ్వరుఁడు స్వప్నమున నిట్లు సాయించెను.

శ్రీని—ఎట్లు? మహాత్మా!

రాజు—"మదీయభక్తాగ్రగణ్యుఁ డగు విప్రనారాయణుఁడు తిరుక్కరంబనూర వేశ్యావీథి నున్నాఁడు. నీ విప్పుడ పోయి యాతనిని మా పల్లకిలో నుంచి సమస్తవైభవములతోఁ దెల్లవాఱకుండ మా సన్నిధికిఁ దీసికొని రావలయును" అని.

శ్రీని—ఆహా ! రంగని కటాక్షము.

రాజు—పల్లకి యట నున్నది. ఈతని నిమ్మళముగ లేవఁదీయుము.

శ్రీని—ఈతని కింక [illegible]రాలేఁడు.

రాజు—శ్రీరంగేశ్వ[illegible]ందన మీాతని దేహమునకుఁ
బూసి శ్రీపా[illegible]లిరాము. ఆల
సింపకుము.

శ్రీని—చిత్తము. ([illegible])

రాజు—ఇప్పు డింక నిచ్చుటఁ గావలసిన దేమి ?

శ్రీని—ఏమియు లేదు. ఐన నిట్లు కావలయును.

గీ॥ ధరణి యీతిబాధలులేక ♦ తనరుఁగాక
ప్రజల యన్యోన్యవైరముల్ ♦ పాయుఁగాక
కవిత రాజపోషణమునఁ ♦ గ్రాలుఁగాక
నీతిపాలనమున రాజు ♦ నెగడుఁగాక !

రాజు—తథాస్తు. తథాస్తు.

(అందఱు నిష్క్రమింతురు)

ఇది షష్ఠాంకము.

సర్వమును సంపూర్ణము.

శ్రీ శ్రీ శ్రీ